అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
శుక్రవారం 18-8-2017
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 3 సంచిక : 231
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal
www.navatelangana.com
12 + 16 పేజీలు వెల : 5.00

ఆర్టీసీలో 3,950 పోస్టులా..

ఎప్పుడిచ్చారు

విస్తుపోతున్న కార్మిక సంఘాలు

- మాకేం సమాచారం లేదు:టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ
- 2011-12లో చివరి నోటిఫికేషన్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీ యాజమాన్యానికి తెలీకుండానే ప్రభుత్వం అక్కడ 3,950 పోస్టులు భర్తీ చేసిందట! ప్రస్తుతం ఆ సంస్థలో ఎలాంటి ఖాళీ పోస్టులు లేవని కూడా సర్కారు స్పష్టం చేసింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ గోల్కొండ కోటపై నుంచి చేసిన ప్రసంగంలో నిరుద్యోగులకు శుభవార్త అంటూ ఇప్పటి వరకు 27,660 పోస్టులు భర్తీ చేశామని, మరో 36,806 పోస్టులు భర్తీ ప్రక్రియలో ఉన్నాయని, మరో 48,070 పోస్టుల్ని దశలవారీగా భర్తీచేస్తామంటూ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో ఆర్టీసీలో 3,950 పోస్టుల్ని భర్తీ చేసినట్టు చెప్పారు. అయితే ఈ పోస్టులు ఎప్పుడు భర్తీ అయ్యాయో సదరు యాజమాన్యానికి కూడా తెలీకపోవడం గమనార్హం. దీనిపై 'నవతెలంగాణ' టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జివి రమణారావును వివరణ కోరగా...'మేం కొన్ని పోస్టులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం... వాటికేమన్నా అనుమతులు ఇచ్చారేమో! మాకైతే ఎలాంటి సమాచారం లేదు" అని చెప్పారు. ఇక దీనిపై కార్మిక సంఘాలు భగ్గుమంటున్నాయి. ఆర్టీసీలో 2011-12లో ఇచ్చినదే చివరి నోటిఫికేషన్ అని, ఆ తర్వాత ఒక్క కొత్త పోస్టు కూడా భర్తీ కాలేదని స్పష్టం చేశాయి. ప్రభుత్వానివన్నీ తప్పుడు లెక్కలని తేల్చేశాయి. గడచిన మూడేండ్లలో ఆర్టీసీలో 1,879 ఖాళీలు ఏర్పడ్డాయి. అంతకుముందు మరో వెయ్యి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అనేక పోస్టుల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్ని నియమించి నెట్టుకొస్తున్నారు. పర్మినెంట్ ఉద్యోగాల ఊసే లేదు. అలాంటిది ముఖ్యమంత్రి కేసీఆర్ 3,950 పోస్టుల్ని భర్తీ చేశామని, ఆర్టీసీలో ఎలాంటి ఖాళీ పోస్టులు లేవని స్పష్టం చేయడం విస్మయపరుస్తోంది. అధికారులు ఆయన్ని తప్పుతోవ పట్టించారా...లేక ప్రభుత్వం ప్రచారార్భాటం కోసం ఉద్దేశ్యపూర్వకంగానే ఈ ప్రకటన చేసిందా అనేది తేలాల్సి ఉంది. ఆర్టీసీ యాజమాన్యానికి కూడా తెలీకుండా ఖాళీలు ఎలా భర్తీ అయ్యాయనేది అంతుపట్టని రహస్యంగా మారింది.

2013 జులై 4వ తేదీ అప్పటి ఉమ్మడి రాష్ట్ర ఆర్టీసీలోని 24,577 మంది కాంట్రాక్ట్ కార్మికుల్ని రెగ్యులరైజ్ చేసేలా ప్రభుత్వంతో కార్మిక సంఘాలు ఒప్పందం చేసుకున్నాయి. దానిలో భాగంగా మూడు విడతల్లో వారిని రెగ్యులరైజ్ చేశారు. చివరి విడతగా 2015 మే 13వ తేదీ కండక్టర్ కమ్ డ్రైవర్లుగా అప్పటికే పనిచేస్తున్న 3,950 మంది సర్వీసుల్ని రెగ్యులరైజ్ చేశారు. అంతే తప్ప ఎక్కడా కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చి పోస్టుల్ని భర్తీ చేసిన దాఖలాలు ...9లో

కార్పొరేట్ల డార్లింగ్ బీజేపీ



ఏడీఆర్ నివేదిక స్పష్టం

- నాలుగేండ్లలో రూ. 705 కోట్ల విరాళాలు

న్యూఢిల్లీ: పేదల ప్రయోజనాలను గాలికొదిలి... కార్పొరేట్ల కోసమే పనిచేస్తోందంటూ.. ముఖ్యంగా ప్రతిపక్షాలతోపాటు, ఇటు కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాహుల్ గాంధీ, అటు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బీజేపీపై ఆరోపణలు సంధిస్తూనే ఉన్నారు. కాగా, వారి ఆరోపణల్లో నిజముందా..? బీజేపీకి కార్పొరేట్లు కొమ్ముకాస్తున్నాయా? వారి నుంచి భారీ మొత్తాల్లో విరాళాలు తీసుకొని.. వారి ప్రయోజనాలను కాపాడే పనిలో ప్రస్తుత పాలకపక్షం ఉందా.. అవును.. నిజమే... అంటోంది అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) నివేదిక. ఏ ఇతర జాతీయ పార్టీనీ ప్రేమించనంత ఎక్కువగా కార్పొరేట్లు కాషాయపార్టీని ఇష్టపడుతున్నాయట. ఏడీఆర్ నివేదిక ప్రకారం... 2012-2016 మధ్య కాలంలో కార్పొరేట్లు, బడా పెట్టుబడిదారులు ఇచ్చిన విరాళాల్లో అత్యధిక భాగం కాషాయ పార్టీకే చేరాయి. ఈ సంవత్సరాల్లో ఐదు జాతీయ రాజకీయ పార్టీలు అందుకున్న మొత్తం రూ. 956.77 కోట్లు. అందులో 2,987 మంది దాతలు, సంస్థల నుంచి బీజేపీకి ముట్టింది రూ. 705.81 కోట్లు. కాంగ్రెస్‌కు 167 మంది వ్యాపార వేత్తల నుంచి రూ. 198.16 కోట్లు విరాళాలు అందాయి. 2014-15 సాధారణ ఎన్నికలు జరిగిన ఆర్థిక సంవత్సరంలో జాతీయ పార్టీలకు గరిష్టంగా కార్పొరేట్ల నుంచి విరాళాలు లభించాయని ఏడీఆర్ నివేదిక పేర్కొంది. 2014-15, 2015-16 మధ్య ప్రధాన జాతీయ పార్టీలు ...9లో

ఓపీఎస్ డిమాండ్ ఈపీఎస్ ఆర్డర్
జయలలిత మృతిపై దర్యాప్తునకు ఆదేశించిన సీఎం
వివరాలు 2లో

విద్యార్థుల ముందే ఉపాధ్యాయురాలికి నిప్పు
వ్యాపార మాజీ భాగస్వామి ఘాతుకం
వివరాలు 2లో

ఆక్సిజన్ కొరత వల్లే...
గోరఖ్‌పూర్ మరణాలపై మేజిస్ట్రేట్ నిర్ధారణ
డాక్టర్ కఫీల్‌ఖాన్‌కు క్లీన్‌చిట్
వివరాలు 2లో

ఉగ్రదాడి
స్పెయిన్..బార్సిలోనాలో..
వ్యాన్‌తో ఢీకొట్టిన ఘటనలో 13మంది మృతి, 50మందికి గాయాలు
వివరాలు 2లో

భూసేకరణ చట్టానికి లోబడి ఒప్పందాలు
సర్కార్‌కు హైకోర్టు ఆదేశం
వివరాలు 2లో

తాజ్‌ను నాశనం చేస్తారా?

కేంద్రంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన తాజ్‌మహల్‌ను నాశనం చేయాలనుకుంటున్నారా? అని కేంద్ర ప్రభుత్వాన్ని భారత సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. ఉత్తరప్రదేశ్‌లోని మధుర నుంచి ఢిల్లీకి మధ్య అదనపు రైల్వే మార్గం నిర్మాణం కోసం దాదాపు 400 చెట్ల నరికివేత అంశంపై విచారించిన సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. దీనిపై పర్యావరణవేత్త ఎంసి మెహతా దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ మదన్ బి లోకూర్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. తాజ్‌మహల్ తాజా చిత్రాలను మీరు చూశారా? అంటూ కేంద్రాన్ని ప్రశ్నించింది. లేదంటే ఇంటర్నెట్‌లోకి వెళ్లి చారిత్రాత్మక కట్టడం ప్రస్తుత పరిస్థితి ఎలా ఉందో ఓసారి తెలుసుకోవాలని సూచించింది. నిజంగానే తాజ్‌మహల్‌ను నాశనం చేయాలని భావిస్తే.. 'ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన కట్టడాన్ని కేంద్రం ధ్వంసం చేయాలనుకుంటున్నది' అని పేర్కొంటూ అఫిడవిట్ దాఖలు చేయాలని వెల్లడించింది. తదుపరి విచారణను ధర్మాసనం వచ్చే నెలకు వాయిదా వేసింది. 1631లో మొగల్ చక్రవర్తి షాజహాన్ తన భార్య ముంతాజ్ జ్ఞాపకార్థంగా యూపీలోని ఆగ్రాలో తాజ్‌మహల్‌ను కట్టించాడు.



విధుల్లో చేర్చుకోనందుకు..

ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

- కార్మికశాఖ-జీవీకే-ఉద్యోగుల సమక్షంలోనే ఘటన
- గాలిలో దీపాల్లా 108 ఉద్యోగుల ప్రాణాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీవీకే-ఈఎంఆర్ఐ యాజమాన్య నిర్వాహకం ఓ ఉద్యోగి ఆత్మహత్యాయత్నానికి దారితీసింది. వంద శాతం ప్రభుత్వ నిధులతో అత్యవసర వాహనాల (108)ను పర్యవేక్షిస్తున్న ఈ సంస్థ వేధింపులు భరించలేక గతంలో పదుల సంఖ్యలో ఉద్యోగులు ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. తాజాగా, వీరస్వామి అనే ఉద్యోగి.. కార్మికశాఖ, జీవీకే అధికారులు, సంస్థ ఉద్యోగుల సమక్షంలోనే ఆత్మహత్యకు పాల్పడటం విశేషం. ఆ ఉద్యోగి కొన్నేండ్లుగా హైదరాబాద్ ఎల్బీనగర్‌లో 108 పైలట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఏడాది క్రితం వాహనం నడుపుతుండగా రోడ్డు ప్రమాదం జరగడంతో ఉద్యోగిని సంస్థ పక్కనపెట్టింది. కుటుంబం రోడ్డున పడటంతో కొన్నాళ్లుగా తనకు ఉద్యోగం ఇవ్వాల్సిందిగా బాధితుడు సంస్థను బతిమాలుతున్నాడు. మరో అవకాశం ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాడు. బాధితుడి మొర జీవీకే పట్టించుకోవడం లేదు. ఇలా ఉండగా, చట్టాలకు విరుద్ధంగా తమకు జరుగుతున్న అన్యాయంపై కార్మికశాఖ- జీవీకే అధికారులతో ఉద్యోగులు గురువారం చర్చలు జరిపారు. అయితే, ఇదే సరైన సమయం అనుకొని వీరస్వామి ఉద్యోగం విషయాన్ని మరోసారి జీవీకే దృష్టికి ...9లో

కేంద్ర మంత్రి భూ కబ్జా

- పోస్టాఫీసుకు కేటాయించిన ప్లాట్.. వీఏఈఎస్‌కు కేటాయింపు



న్యూఢిల్లీ: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సహాయమంత్రి విజయ్ గోయెల్‌కు సంబంధించిన టాయ్ బ్యాంక్ ఏర్పాటు కోసం ఢిల్లీ నగరాభివృద్ధి సంస్థ (డీడీఏ) తన నిబంధనలను సైతం మార్చు చేసిన కుంభకోణం వెలుగులోకి వచ్చింది. మంత్రికి చెందిన వైష్ అగర్వాల్ ఎడ్యుకేషనల్ సొసైటీ (వీఏఈఎస్) ప్రతిపాదించిన టాయ్ బ్యాంక్ ఏర్పాటు కోసం డీడీఏ తన లేఅవుట్ నిబంధనలను మార్చి ప్లాట్‌ను కేటాయించినట్టు ఒక పత్రికలో ప్రచురితమైన వార్తా కథనం వెల్లడించింది. వాస్తవానికి ఒక పోస్టాఫీస్ ఏర్పాటు కోసం కేటాయించిన ఈ ప్లాట్‌ను డీడీఏ తన నియమ నిబంధనలను పక్కన పెట్టి 2016 సెప్టెంబర్‌లో మంత్రికి చెందిన వీఏఈఎస్ సంస్థకు కేటాయించినట్టు తెలుస్తోంది. 2014లో గోయెల్ రాజ్యసభకు ఎన్నికైన వెంటనే ఈ సంస్థ టాయ్‌బ్యాంక్ ఏర్పాటుకు తమకు స్థలం కేటాయించాలంటూ డీడీఏకు దరఖాస్తు చేసుకుంది. ఈ సంస్థకు గోయెల్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తుండగా కుమారుడు సిద్ధాంత్, కుమార్తె విద్యున్ సభ్యులుగా వున్నట్టు డీడీఏ రికార్డుల ద్వారా తెలుస్తోంది. గత ఏడాది ఆగస్టు 8న లే అవుట్ ప్లాన్‌ను మార్చి ఈ ప్లాట్‌ను వీఏఈఎస్ సంస్థకు కేటాయించినట్టు ఈ వార్త కథనం వెల్లడించింది. కేంద్ర మంత్రి తలచుకుంటే..ఏదైనా చేయగలరనటానికి ఇదే రుజువని జనం చర్చించుకుంటున్నారు.

అసిస్టెంట్ విద్యుత్ ఇంజనీర్ల అభ్యర్థులకు ఊరట

మెరిట్ ఆధారంగా భర్తీకి సుప్రీం గ్రీన్‌సిగ్నల్

- తాజా నోటిఫికేషన్ ఇవ్వాలన్న హైకోర్టు తీర్పు రద్దు
- జీవో 1997ను హైకోర్టు అపార్థం చేసుకుందని వెల్లడి
- 238 మంది అభ్యర్థులకు త్వరలో నియామకాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు వివరాలు 2లో



ఆర్ఎస్ఎస్ చీఫ్ పై చర్యలు

కేరళ సీఎం పినరయి విజయన్


తిరువనంతపురం: ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌పై చర్యలకు న్యాయ సలహా తీసుకోనున్నట్టు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. ఆ రాష్ట్ర అసెంబ్లీలో గురువారం ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. జిల్లా కలెక్టర్, విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ నివేదికల ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. పాలక్కాడ్‌లోని ఎయిడెడ్ పాఠశాలలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మోహన్ భగవత్ పాల్గొన్న విషయం తెలిసిందే. అయితే, నిబంధనలకు విరుద్ధంగా ...9లో



నేటి నుంచి ఈఫీ జాతీయ మహాసభలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఈఫీ) 8వ జాతీయ మహాసభలు శుక్రవారం నుంచి ప్రారంభమౌతున్నాయి. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు జాతీయ మహాసభలు జరుగుతాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన 450 మంది ప్రతినిధులు పాల్గొంటారు. 18వ తేదీ ఉదయం 10 గంటలకు సీఐటీయు జాతీయ అధ్యక్షురాలు హేమలత పతాకావిష్కరణ చేసి మహాసభల్ని ప్రారంభిస్తారు. అనంతరం జరిగే ఓపెన్ సెషన్‌లో ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కారామయ్య, సీఐటీయు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్‌లో పాటు ఏడుగురు జాతీయ ఆఫీస్ బేరర్లు పాల్గొంటారు. వివిధ కార్మిక సంఘాల జాతీయ నాయకులు సంఘీభావ ఉపన్యాసాలు ఇస్తారు. ప్రధానంగా 2014 విద్యుత్‌బిల్లును పార్లమెంటులో ఆమోదం పొందేందుకు కేంద్రప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు, దానివల్ల ప్రజలపై పడే ఆర్థికభారాలు, విద్యుత్‌రంగ విధ్వంసం తదితర అంశాలపై మహాసభల్లో చర్చిస్తారు. ఈ బిల్లులోని కంటెంట్-క్యారియర్ విధానంపై సుదీర్ఘ చర్చ జరగనుంది. ప్రస్తుతం 'ఇఫి' 24 రాష్ట్రాల్లో ఉంది. దీని విస్తరణ ప్రణాళికల్ని కూడా రూపొందిస్తారు. నూతన కార్యవర్గ ఎన్నిక కూడా జరుగుతుంది.



అక్రమంగా రూ.1500 కోట్లు

విద్యుత్ సరఫరా పరికరాల కొనుగోలు విషయంలో అదానీ గ్రూప్ వాస్తవ ధరకన్నా అదనపు ధరను చూపి రూ.1500 కోట్లను (నల్లధనం) విదేశాలకు తరలించినట్టు రెవెన్యూ నిఘా డైరెక్టరేట్(డీఆర్ఐ) నివేదికలో స్పష్టమైంది. దుబాయ్‌లోని బినామీ కంపెనీ ద్వారా ఈ డబ్బును పన్నుల ఎగవేతకు స్వర్గధామంగా భావించే మారిషస్‌కు తరలించినట్టు తెలిపిన డీఆర్ఐ నివేదికను అంతర్జాతీయ మీడియా సంస్థ 'ది గార్డియన్' ఈ నెల 16న బహిర్గతపరిచింది.

విదేశాలకు తరలించిన అదానీ గ్రూప్

- గౌతమ్ అదానీ సోదరుని నియంత్రణలోని సంస్థకు..
- 'ది గార్డియన్'లో డీఆర్ఐ నివేదిక బహిర్గతం

న్యూఢిల్లీ: విద్యుత్ ప్లాంట్ల పరికరాల కొనుగోలు విషయంలో అదనపు ధరలు చూపిన పలు కంపెనీలకు 2014-2015 మధ్య డీఆర్ఐ షోకాజ్ నోటీసులు పంపిన విషయాన్ని ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ(ఈపీడబ్ల్యూ) పలు సంచికల్లో వెల్లడించింది. అదానీ గ్రూప్‌నకు చెందిన మూడు కంపెనీలు(అదానీ పవర్ మహారాష్ట్ర లిమిటెడ్, అదానీ పవర్ రాజస్తాన్ లిమిటెడ్,మహారాష్ట్ర పవర్ ఈస్టర్న్ గ్రిడ్ పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ లిమిటెడ్ (ఎంఈజీపీటీసీఎల్)) దిగుమతి చేసుకున్న పరికరాలకు సంబంధించి అదనంగా చూపిన మొత్తం విలువ రూ.6000 కోట్లుగా డీఆర్ఐ అంచనా వేసినట్టు ఈపీడబ్ల్యూ 2016లో వెల్లడించింది. దిగుమతి చేసు కున్న పరికరాలకు తప్పుడు ధరలు చూపుతూ ఈ కంపెనీలు వాణిజ్య ఆధారిత మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఈపీడబ్ల్యూ ఆ సంచికలో వెల్లడించింది. యూఏఈలోని ...9లో

ADANI



మైనర్‌కు 65 ఏండ్ల షేక్‌తో నిఖా 2లో

పురోహిత్ బెయిల్ అభ్యర్థనపై సుప్రీం కోర్టు తీర్పు వాయిదా

న్యూఢిల్లీ: దాదాపు తొమ్మిదేండ్ల నాటి మాలెగావ్ పేలుళ్ల కేసులో ప్రధాన నిందితుడు లెఫ్టినెంట్ కర్నల్ శ్రీకాంత్ ప్రసాద్ పురోహిత్ బెయిల్ అభ్యర్థనపై సుప్రీం కోర్టు తన నిర్ణయాన్ని వాయిదా వేసింది. జస్టిస్ ఆర్కె అగర్వాల్, జస్టిస్ ఎఎం సప్రేలతో కూడిన ధర్మాసనం ముందు పురోహిత్ తరఫున సీనియర్ అడ్వొకేట్ హరీశ్ సాల్వే వాదనలు వినిపిస్తూ ఎనిమిదేండ్లుగా జైలులో ఉన్న పురోహిత్‌పై ఇప్పటివరకు నేరారోపణ జరగలేదని గుర్తుచేశారు. మహారాష్ట్ర వ్యవస్థీకృత నేరాల నియంత్రణ చట్టం (ఎంసీఓసీఏ) ప్రకారం ఆయనపై ఆరోపించిన నేరాలను కూడా ఉపసంహరించుకున్నట్టు సాల్వే తెలిపారు. ఈ కారణాల వల్ల ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని ఆయన ధర్మాసనానికి విజ్ఞప్తిచేశారు.

ముస్లింలు రోడ్లపై నమాజ్ చేయొద్దని అడగలేనప్పుడు...

- ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు

లక్నో: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈద్ సందర్భంగా రోడ్లపైకి వచ్చి నమాజ్ చేయడం సరి కాదని, ముస్లింలను తాను ఇలా అడగలేనప్పుడు... కృష్ణాష్టమి సందర్భంగా పోలీసు స్టేషన్లలో వేడుకలను జరుపుకోవడం ఆపాలని హిందువులను నేను ఎలా ఆదేశించగలనని అన్నారు. 'ఈద్ సందర్భంగా రోడ్లపై నమాజ్ చేయడాన్ని నేను నియంత్రించలేకపోతే, పోలీస్ స్టేషన్లలో జన్మాష్టమి ఉత్సవాలను ఆపే హక్కు నాకు ఉండదు' అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో జన్మాష్టమి వేడుకలను అంతరాయం కలిగించిందని, ఇప్పుడు ఆ ఉత్సవాలను హిందువులు ఘనంగా జరుపుకుంటారని యోగి ఆదిత్యనాథ్ అన్నారు. పోలీసు వ్యవస్థలో మార్పు కోసం కీర్తనలు, ప్రార్థనలు ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు. శాంతి భద్రతలకు లోబడి తమ తమ పండుగలను నిర్వహించుకునే స్వేచ్ఛ దేశంలో ప్రతి ఒక్కరికీ ఉంటుందన్నారు.

విద్యార్థుల ముందే ఉపాధ్యాయురాలికి నిప్పు

- వ్యాపార మాజీ భాగస్వామి ఘాతుకం

బెంగళూరు: అప్పటిదాకా శ్రద్ధగా పాఠం వింటున్న విద్యార్థులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. వారి కళ్లెదుటే ఉపాధ్యాయురాలికి ఓ వ్యక్తి నిప్పంటించడంతో భయభ్రాంతులకు లోనయ్యారు. మంటల్లో తీవ్రంగా గాయపడిన బాధితురాలు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ దారుణ ఘటన కర్నాటకలో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. బెంగళూరుకు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న మాగాడి ప్రభుత్వ పాఠశాలలో సునంద(50) టీచర్‌గా పని చేస్తున్నారు. కాగా బుధవారం ఉదయం తరగతి విద్యార్థులకు ఆమె పాఠం చెబుతున్నారు. ఇంతలో సునంద వ్యాపార మాజీ భాగస్వామి రేణుకారాధ్య అక్కడకు వచ్చాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. ఇంతలో సునందపై రేణుకారాధ్య కిరోసిన్ పోసి నిప్పంటించాడు. విద్యార్థులు బిగ్గరగా కేకలు వేయడంతో పాఠశాల సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. బాధితురాలిని హుటాహుటిన ఆస్పత్రిలో చేర్పించారు.

కోడలి కోసం కొడుకునే చంపి..

ముంబయి: వరకట్న దాహంతో అత్తింటివారి వేధింపులు, చిత్రహింసలకు ఎందరో వివాహితలు బలౌతున్న రోజులివి. కానీ, ఓ మహిళ తన కోడలి బాసటగా నిలిచింది. కొడుకు తాగి వచ్చి కోడలిని చిత్రహింసలు పెడుతుంటే తట్టుకోలేకపోయింది ఆ తల్లి. ఈ క్రమంలో కొడుకు గొంతు నులిమి హతమార్చింది. ముంబయిలోని మాంఖుర్ద్ ప్రాంతానికి చెందిన అన్వర్ ఇద్రిష్(43) కొడుకు నదీమ్‌కు రెండేండ్ల క్రితం వివాహమైంది. కాగా మద్యానికి బానిసైన అతడు.. భార్యను రోజూ చిత్రహింసలకు గురి చేస్తున్నాడు. మంగళవారం రాత్రి కూడా తాగి వచ్చిన నదీమ్, తన భార్యను మరోసారి తీవ్రంగా కొట్టాడు. దీంతో స్నేహితురాలి దగ్గర ఉండాలని ఆమెకు అన్వర్ చెప్పింది. కొద్దిసేపటి తర్వాత ఇంట్లో నిద్రిస్తున్న కొడుకును దుపట్టె సాయంతో ఊపిరాడకుండా చేసి చంపేసింది. కొడుకు శవం పక్కనే కూర్చుని రాత్రంతా ఏడ్చింది. కాగా బుధవారం ఉదయం నదీమ్ భార్య వచ్చి చూసేసరికి అన్వర్ ఏడుస్తూ కనిపించింది. జరిగిన విషయాన్ని స్థానికులు తెలుసుకుని పోలీసులకు సమాచారమందించారు.

ఇలాగే జీవితాంతం బతకాలా?

తిరువనంతపురం : 'జీవితాంతం నేను ఇలాగే బతకాలా?' అని కేరళ లవ్ జిహాద్ కేసులో బాధితురాలు అఖిలా అశోకన్ (హదియా) ప్రశ్నిస్తోంది. తలకు ముసుగు వేసుకుని తలుపు చాటున నిలబడిన అఖిల తన తల్లికి ఈ ప్రశ్న వేసింది. కాగా తన కుమార్తె బయటకు రావాలని ఆమె తల్లి కోరుతోంది. గత మూడు నెలలుగా అఖిల కేవలం ఒక గదికే పరిమితమైంది. బయటకు వెళ్లడానికి ఆమెను అనుమతించడంలేదు. వారి కుటుంబం కూడా ఎక్కడకూ వెళ్లడానికి ఇష్టపడడం లేదు. తాను ముస్లింగానే బతుకుతానని, అలాగే మరణిస్తానని అఖిల చెబుతోంది.

బీహార్‌ను కుదిపేస్తున్న 'శ్రీజన్' కుంభకోణం

పాట్నా: బీహార్‌లో వెలుగు చూసిన రు.వెయ్యి కోట్ల 'శ్రీజన్' అవినీతి కుంభకోణం అక్కడి నితీష్ సర్కారును కుదిపేస్తోంది. ఈ కుంభకోణంలో ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, ఉపముఖ్యమంత్రి సుశీల్‌కుమార్ మోడీ ప్రత్యక్ష ప్రమేయం వుందంటూ ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలు ప్రభుత్వంలో తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి. భాగల్పూర్ జిల్లాలోని శ్రీజన్ మహిళా సహయోగ్ సమితి అనే స్వచ్ఛంద సంస్థకు రూ.1000 కోట్ల ప్రభుత్వ నిధుల బదిలీకి సంబంధించిన ఈ కుంభకోణంలో ఆ సంస్థ తనకు వచ్చిన ప్రభుత్వ నిధులను అత్యధిక వడ్డీరేటుకు రుణాల రూపంలో పంపిణీ చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ కుంభకోణం భాగల్పూర్ పరిధి దాటి ఇతర జిల్లాలకు కూడా విస్తరించినట్లు తెలుస్తోంది. ఈ స్వచ్ఛంద సంస్థ 2007 నుండి 2014 వరకూ ఈమోసం కొనసాగించిందని, సంస్థ వ్యవస్థాపకురాలు మనోరమా దేవి ఈ ఏడాది ఫిబ్రవరిలో మరణించటంతో ఆ సంస్థ కార్యకలాపాలు నిలిచిపోయాయని సమాచారం. ప్రాథమిక ఆధారాల మేరకు ఆమె కుమారుడు అమిత్ కుమార్, కోడలు ప్రియాకుమార్‌లను పోలీసులు అరెస్ట్ చేసినట్టు తెలుస్తోంది. ఈ కుంభకోణం మొత్తం విలువ రు.500 కోట్లు వుంటుందని కొన్ని మీడియా సంస్థలు చెబుతుండగా ఇది వెయ్యికోట్ల పైమాటేనని మరికొన్ని మీడియా సంస్థలు తమ కథనాలలో పేర్కొన్నాయి.

8 రోజుల్లో 34 మంది..

- మరట్వాడాలో పెరుగుతున్న రైతు ఆత్మహత్యలు

ముంబయి: మహారాష్ట్రలోని మరట్వాడా రీజియన్‌లో రైతు ఆత్మహత్యలు అంతకంతకూ పెరుగుతున్నాయి. రీజియన్‌లో మరోసారి కరువు ఛాయలే కనిపిస్తున్నాయి. మరట్వాడా పరిధిలోని 8 జిల్లాల్లో ఖరీఫ్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. పైగా 15 రోజుల నుంచి ఎండలు తీవ్రరూపం దాల్చడంతో వేసిన పంటలు మాడిపోతున్నాయి. దీంతో అన్నదాతలు తీవ్ర మనస్తాపానికి గురై తనువు చాలిస్తున్నారు. ఎనిమిది రోజుల్లోనే 34 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్టు ఔరంగాబాద్ డివిజనల్ కమిషనర్ వెల్లడించారు.

ఈయేడాది ప్రారంభం నుంచి ఈనెల 15 వరకు మరట్వాడాలో 580 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు., వీరిలో బీడ్ జిల్లా నుంచి అత్యధికంగా 107 మంది ఉన్నారని వివరించారు.

ఓపీఎస్ డిమాండ్...ఈపీఎస్ ఆర్డర్

- జయలలిత మృతిపై దర్యాప్తునకు ఆదేశించిన సీఎం

చెన్నై: దివంగత ముఖ్యమంత్రి జయలలిత మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలన్న పన్నీర్‌సెల్వం డిమాండ్‌కు తమిళనాడు సీఎం పళనిస్వామి సానుకూలంగా స్పందించారు. అమ్మ మృతిపై దర్యాప్తు జరిపిస్తామని, విచారణ కమిటీని త్వర్లోనే ప్రకటిస్తామని పళనిస్వామి గురువారం వెల్లడించారు. విచారణ బృందానికి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వం వహిస్తారని చెప్పారు. అంతేకాక.. పోయెస్ గార్డెన్‌లోని వేదా నిలయాన్ని స్మారక కేంద్రంగా మార్చనున్నట్టు ఆయన వివరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న జయలలిత గతేడాది డిసెంబర్ 5న చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో కన్నుమూసిన సంగతి తెలిసిందే. అయితే.. అమ్మ మరణంపై అనుమానాలున్నాయని, దీనిపై విచారణ జరపాలని పన్నీర్‌వర్గం డిమాండ్ చేస్తోంది.

ఆక్సిజన్ కొరత వల్లే ...

- గోరఖ్‌పూర్ మరణాలపై మేజిస్ట్రేట్ నిర్ధారణ




గోరఖ్‌పూర్: గోరఖ్‌పూర్‌లోని బీఆర్డీ ఆస్పత్రిలో చిన్నారుల మరణానికి ఆక్సిజన్ కొరతగా ఉండటమే కారణమని జిల్లా మేజిస్ట్రేట్ నివేదిక సమర్పించారు. మెడికల్ కాలేజీ ఆస్పత్రిలోని అనస్తీసియా విభాగం అధిపతి డాక్టర్ సతీష్ కుమార్, కాలేజీ ప్రిన్సిపాల్ ఆర్‌కె మిశ్రా, ఆక్సిజన్ కొనుగోలు వ్యవహారాల ఇన్‌చార్జీ ఈ దారుణానికి బాధ్యులని జిల్లా మేజిస్ట్రేట్ రాజీవ్ రౌతెలా నివేదించారు. అయితే ప్రాణాలను కాపాడటంలో ఆక్సిజన్ చాలా కీలకమైనది కాబట్టి ఆ విషయాన్ని విస్మరించి ఆక్సిజన్ సరఫరాను నిలిపివేసిన పుష్పా సేల్స్ సంస్థ కూడా బాధ్యత వహించాల్సిందేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఘటనపై యోగి ప్రభుత్వం తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు డాక్టర్ కఫీల్ ఖాన్‌ను బలిపశువును చేసిన విషయం తెలిసిందే. కాగా, బుధవారం మేజిస్ట్రేట్ నివేదిక డాక్టర్ కఫీల్ ఖాన్‌కు క్లీన్ చిట్ ఇవ్వడం గమనార్హం. మేజిస్ట్రేట్ నివేదిక తమకు అందినట్టు ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ రాజీవ్ కుమార్ ధ్రువీకరించారు. ఇదే ఘటనపై చీఫ్ సెక్రెటరీ విడిగా దర్యాప్తు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కాగా, ఈ దర్యాప్తు నివేదికను ఆయన ప్రభుత్వానికి ఆదివారం అందించే అవకాశం ఉంది.

తీరు మారని యూపీ సర్కారు

ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయి చిన్నారులు మృతిచెందిన వార్తలు ఇంకా కనుమరుగు కాక ముందే గడచిన సోమ, మంగళవారాల్లో మరో 34 మంది చిన్నారుల ఊపిరి ఆగిపోయినట్లు ఆస్పత్రి రికార్డులు చెబుతున్నాయి. ఇందులో సోమవారం ఒక్కరోజే 24 మంది చిన్నారులు తుది శ్వాస విడిచారని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పికె సింగ్ చెప్పారు. ఇందులో 15 మంది నియోనేటాల్ వార్డులోనూ, ఐదుగురు ఎన్‌సెఫలైటిస్ వార్డులోనూ, మరో నలుగురు ఇతర వార్డుల్లోనూ ప్రాణాలు కోల్పోయారని ఆయన వివరించారు.

మరో పది మంది 10 మంగళవారం మరణించినట్లు ఆస్పత్రి రికార్డులు చెబుతున్నాయి. వీరిలో ఏడుగురు నియోనేటాల్ వార్డులోనూ, ముగ్గురు ఎన్‌సెఫలైటిస్ వార్డులోనూ మరణించారు. బుధవారం నాటి వివరాలు ఇంకా అందుబాటులోకి రాలేదు.



'మేము వారి మురికిని శుభ్రం చేస్తున్నాం.. అయినా మమ్మల్ని కొడుతున్నారు..'

ఉనా ఘటన పునరావృతం



బాధితులు సైలేష్ మనిభాయి, మనిబెన్ మనిభాయి

ఆనంద్ (గుజరాత్) : దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఉనా దారుణ ఘటన మరోసారి పునరావృతమైంది. అహ్మదాబాద్‌కు దాదాపు 70 కిలో మీటర్ల దూరంలోని ఆనంద్ జిల్లాలో ఒక దళిత యువకుడిని, అతడి తల్లిని అగ్రవర్ణాల వారు చితకబాదారు. ఈ దుర్మార్గానికి వేదిక ఆనంద్ జిల్లా సోజిత్ర తాలూక, కసోర్ గ్రామం కాగా, సైలేష్ మనిభాయి రోహిత్, అతని తల్లి మనిబెన్ మనిభాయి రోహిత్‌లు బాధితులు. ఏకంగా 100 మంది వరకూ అల్లరి మూకలు ఇటీవల వారి ఇంటిపై దాడి చేసి మరీ కొట్టారు. కారణం షరా మామూలే... చనిపోయిన ఆవును తీయడం వారి నేరమైంది. దర్బార్ కులానికి చెందిన (క్షత్రియ)వారు ఈ దాడికి పాల్పడినట్టు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి ఏడుగురిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. భారతీయ శిక్షాస్మృతి, ఎస్సీ/ఎస్టీలపై దాడుల నియంత్రణ చట్టం 323, 506/2 కింద నిందితులపై కేసు నమోదైంది. అనంతరం మరో 12 మంది పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. 'ఇప్పటివరకూ (ఈనెల 16) 17 మందిని అరెస్టు చేశాం. ఇందులో ఏడుగురిని బాధితులు గుర్తించారు' అని ఆనంద్ జిల్లా ఎస్సీ/ఎస్టీ సెల్ డిప్యూటీ సూపరింటెండెంట్, ఈ కేసు దర్యాప్తు అధికారి డిడి దమోర్ చెప్పారు.

అసలేం జరిగింది?

అగ్ర కులానికి చెందిన గౌతభాయి భగత్ నుంచి ఆగస్టు 11న దళితుడైన సైలేష్ మనిభాయికి ఫోన్ వచ్చింది. తన ఆవు చనిపోయిందని, తన నివాస ప్రాంగణం నుంచి దానిని తొలగించాల్సిందిగా సైలేష్ మనిభాయికి ఆదేశం వచ్చింది. ఆవు కళేబరాన్ని తీసుకొని... దాని చర్మం ఒలిచి అనంతరం దాన్ని ఊరు చివర శ్మశానానికి దగ్గరలోని వాడుకలోలేని ఒక ప్రభుత్వ స్థలంలో దాన్ని పడేశాడు. వారి శ్మశానానికి సమీపంలో దాన్ని పడేయడం అగ్రవర్ణాల వారి ఆగ్రహానికి కారణమైంది. 'మా కుటుంబం కళేబరాలను తీసివేయడం, అలాగే చనిపోయిన వాటి చర్మాలను ఒలవడం మానేసింది. మేము దళితులమైందున గ్రామంలోని అగ్రకులాలవారు ఆదేశిస్తే తప్పని పరిస్థితుల్లో ఆ పనిచేస్తున్నాం..' అని బాధితుడి అన్న ప్రకాశ్‌భాయి రోహిత్ చెప్పారు. 'నేను ఖేదా జిల్లా నడియాడ్లో పని చేస్తున్నాను, దురదష్టకరమైన ఆ రోజు నేను ఇంటి వద్ద లేను. నా అమ్మ, తమ్ముడు, నా ఏడాది కూతురు ఇంట్లో ఉన్నారు. దాదాపు 100 మంది ఇంట్లోకి చొరబడ్డారు. నా తమ్ముడ్ని కొట్టడం ప్రారంభించారు. అడ్డం వెళ్ళిన అమ్మనూ కొట్టారు. ఆమె వయసు 50 ఏండ్లు. సైలేశ్ కన్నా ఎక్కువగా ఆమె గాయపడింది. ఆమెను ఈ నెల 16న ఆస్పత్రిలో చేర్చాం.



గాయాల కారణంగా ఆమె మూత్రపిండాలు దెబ్బతిన్నాయని వైద్యులు చెప్పారు' అని ప్రకాశ్ భాయి చెప్పారు. 'నా ఏడాది కూతురిని సజీవ దహనం చేస్తామని కూడా వారు బెదిరించారు. వారి మురికిని మేము శుభ్రం చేస్తున్నాం. అయినా వారు మమ్మల్ని కొడుతున్నారు.. బెదిరిస్తున్నారు..' అని ప్రకాశ్ భాయి వాపోయారు. ఆ దళిత కుటుంబంపై దాడి చేసిన వారిలో ఆ గ్రామ సర్పంచ్ కొడుకు కంతిభాయి పర్మార్ కూడా ఉన్నాడు.

'భగత్ నుంచి ఈ నెల 11న ఫోన్ రావడంతో నేను ఒక ట్రాక్టర్‌ను మాట్లాడుకొని అతని ఇంటికి వెళ్ళాను. దళితులు ఆవు చర్మం ఒలిచే ప్రాంతం వరద నీటిలో మునిగి వుంది. పాలుపోని నేను దాన్ని తీసుకొని గ్రామంలో ఉన్న శ్మశానం సమీపంలోని ప్రభుత్వ స్థలంలో పడేస్తుండగా.. కొందరు చూసి నన్ను హెచ్చరించారు. అది అగ్రవర్ణాల వారి శ్మశానమని.. అక్కడ వేయొద్దని హెచ్చరించారు. దాంతో నేను సాధారణంగా దళితులు కళేబరాలను పడేసే ప్రదేశం వద్దకే తీసుకెళ్ళి నీళ్ళు న్నప్పటికీ చేసేదిలేక అక్కడే పడేసి వచ్చాను. మరుసటి రోజు (ఈ నెల 12) రాత్రి ఎనిమిదిన్నరకు దాదాపు 100 మంది అగ్రవర్ణాలవారు మా ఇంటిపై దాడిచేశారు. ముందు బూతు లు తిట్టారు. ఆ తర్వాత తీవ్రంగా కొట్టారు. ఇరుగుపొరుగు వారు వచ్చి బతిమిలాడగా... మమ్మల్ని వదిలేసి వెళ్ళారు. గ్రామంలో ఉన్న 40 దళిత ఇండ్లను తగులబెడతామని బెదిరించారు. గ్రామంలో ఉంటే చంపేస్తామని బెదిరించారు.' అని బాధితుడు సైలేష్ చెప్పారు. కసోర్ గ్రామ జనాభా 13 వేలు. ఇందులో 12 వేల మంది అగ్రవర్ణాలైన దర్బార్ లేక ఠాకూర్‌లకు చెందినవారే. కేవలం 40 కుటుంబాలు దాదాపు 250 మంది దళితులు.

కుల వివక్ష ఆ గ్రామానికి కొత్తేమీ కాదు

'ఆ గ్రామంలో దళితులకు ఆలయ ప్రవేశం లేదు. ఆ గ్రామంలోనే కాదు.. చుట్టుపక్కల గ్రామాలైన కంబత్, ఉమ్రేత్‌లలో కూడా ఇదే పరిస్థితి. 2012లో ఒక దళిత కుటుంబంపై దాడి జరిగింది. అప్పుడు కూడా గోవే కారణమైంది. పోలీసు, రాజకీయ ఒత్తిడితో ఆ కేసు దర్యాప్తు ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఆ కుటుంబం ఇప్పటికీ భయం గుప్పిట్లో జీవిస్తోంది' అని రాష్ట్రీయ దళిత్ అధికార్ మంచ్ నాయకుడు యశ్ మఖ్వానా అన్నారు. ఉనా దాడి ఘటన తర్వాత, పశువుల కళేబరాలను ముట్టుకోకూడదని దళితులు ప్రతిజ్ఞ తీసుకున్నారు. అయినా... కొందరు దళితులు ప్రత్యామ్నాయ జీవనోపాధి లేక ఆ వృత్తిని కొనసాగిస్తున్నారు.

మైనర్‌కు 65 ఏండ్ల షేక్‌తో నిఖా

- నా బిడ్డను ఎలాగైనా కాపాడండి... తల్లి రోదన

హైదరాబాద్ : మైనర్ విద్యార్థిని నిఖా 65 ఏండ్ల ఒమన్ షేక్‌తో జరిగింది. ఇప్పుడు ఆ వధువు తల్లి మాత్రం కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. నా బిడ్డను ఎలాగైనా కాపాడంటూ కాళ్లా వేళ్లా పడుతున్నది. తండ్రి, బంధువు కలిసి ఐదు లక్షలు తీసుకుని షేక్‌తో పెండ్లి చేయించారు. ఆమెను ఒమన్ దేశానికి పంపారు. అక్కడ తన కుమార్తె పడుతున్న బాధలనుంచి విముక్తి కల్పించాలని ఆ తల్లి దీనంగా వేడుకుంటున్నది. 16 ఏండ్ల మైనర్ వధువు తల్లికి ఫోన్‌లో మేసేజ్ పంపింది. 'మీరు నన్ను కాపాడండి. నన్ను తిరిగి తీసుకెళ్లకపోతే.. చనిపోతాను' అన్నది ఆ మెసేజ్ సారాంశం. తల్లి ఆ సందేశాన్ని చూసి షాక్‌కు గురయ్యారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన బిడ్డ రోజూ ఏడుస్తున్నది. మస్కట్ నుంచి తిరిగి వచ్చేయాలనుకుంటున్నది. నేను ఆ షేక్ తో మాట్లాడా. ఐదు లక్షలు తీసుకుని మీ అమ్మాయిని పెండ్లి చేసుకున్నా. డబ్బులు ఇస్తే.. మీ అమ్మాయిని తిరిగి పంపిస్తానని షేక్ అన్నట్టు ఆ తల్లి వివరించింది. హైదరాబాద్‌లోని ఓ ఖాజీ రంజాన్ మాసానికి ముందు షేక్,తన కుమార్తె వివాహాన్ని హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిపారు. ఆ హోటల్‌లోనే కొత్త జంట నాలుగైదు రోజులు గడిపారు.ఆ తర్వాత షేక్ మస్కట్ వెళ్లిపోయాడు. మైనర్ వధువుకు వీసా తీసి పంపాక..ఒమన్ చేరారు. పెండ్లి ఫోటోలను పోలీసులకు ఇచ్చి తన బిడ్డను కాపాడాలంటూ ఆ తల్లి విలపిస్తున్నది. కాగా హైదరాబాద్‌లో కాంట్రాక్ట్ పెండ్లిండ్లు గోప్యంగా జరుగుతూనే ఉన్నాయి. గల్ఫ్ దేశాల్లోని సంపన్నులైన షేకులు మైనర్లను వివాహం చేసుకోవటం..వారిని తమ దేశాల్లో ఇబ్బందుల పాల్జేస్తున్న ఘటనలు కోకొల్లలు. పాతబస్తీ ప్రాంతంలో ఆర్థికస్థితిగతులు సరిగాలేక.. షేకులిచ్చే కాసులకు ముందు ఆశపడటం, ఆ తర్వాత గల్ఫ్ దేశాల్లో వారి చెరల్లో జీవితాలు బుగ్గిపాలవుతున్న దారుణాలు అనేకం.

పాపకు జన్మనిచ్చిన పదేండ్ల చిన్నారి



చండీగఢ్: 'అమ్మ' అన్న పదానికి పూర్తి అర్థం కూడా తెలిసిన వయస్సు కాదు ఆ చిన్నారిది. తన కడుపులో పెరుగుతున్నది బిడ్డ అని కూడా తెలుసుకోలేని అభాగ్యురాలు.. కడుపులోని రాయిని తీసేందుకు డాక్టర్లు ఆపరేషన్ చేస్తారమ్మా.. అని తల్లిదండ్రులు చెబితే నిజమే అనుకున్నది.. ఓ కామాంధుడి అఘాయిత్యానికి బలైన ఆ బాలిక గురువారం పాపకు జన్మనిచ్చింది. చిన్నారి పరిస్థితి నిలకడగానే ఉన్నదని వైద్యులు తెలిపారు. చండీగఢ్‌కు చెందిన ఓ చిన్నారి(10)పై వరుసకు మామయ్య అయ్యే వ్యక్తి కొన్ని నెలలపాటు అఘాయిత్యానికి ఒడిగట్టాడు. కాగా.. కడుపునొప్పి వస్తోందన్న ఆమెను ఆస్పత్రిలో చూపించగా 30 వారాల గర్భవతి అని తెలిసింది. అంత చిన్న వయస్సులో గర్భం దాల్చడంతో ఆమె తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అబార్షన్‌కు అనుమతించాలంటూ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కానీ, అబార్షన్ చేస్తే బిడ్డకూ, తల్లికీ ఇద్దరి ప్రాణాలకు ప్రమాదమని వైద్య నిపుణుల బృందం.. సుప్రీంకోర్టుకు నివేదించింది. ఈ క్రమంలో అబార్షన్‌కు అనుమతి నిరాకరిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం గతనెల 28న తీర్పు వెలువరించింది. అయితే.. చండీగఢ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆ చిన్నారి గురువారం పాపకు జన్మనిచ్చారు. శిశువు 2.2 కిలోగ్రాముల బరువు ఉన్నదని, ప్రస్తుతం నియోనటాల్ ఐసీయూలో పర్యవేక్షణలో ఉంచామని వైద్యు లు తెలిపారు. బాలికకు ప్రత్యేక గదిలో చికిత్స అందిస్తున్నామని వివరించారు. శిశువు కూడా కోలుకుంటుందని ఆశిస్తున్నట్టు వారు తెలిపారు. ఇదిలా ఉండగా.. శిశువును ఎవరికైనా దత్తత ఇవ్వాలని ఆస్పత్రి వర్గాలను బాలిక తండ్రి వేడుకున్నాడు.

రాజీనామా చేయండి

- ఇష్రాత్ జహాన్ కేసులో పోలీసు ఉన్నతాధికారులకు సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ : బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో ఆరోపణలతో కేసు విచారణను ఎదుర్కొంటున్న ఇద్దరు పోలీసు అధికారులు ఎన్‌కె అమిన్, తరుణ్ బరోట్‌లను తమ పదవులకు రాజీనామా చేయాల్సిందిగా సుప్రీంకోర్టు ఆదేశించింది. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (ఎస్‌పీ)గా అమిన్ గతేడాది పదవీ విరమణ చేశారు. కాగా, ఆయనను ఏడాది కాలానికిగాను గుజరాత్ మహిసాగర్ జిల్లా ఎస్పీగా ప్రభుత్వం తిరిగి నియమించారు. సోహ్రాబుద్దీన్, ఇష్రాత్ జహాన్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో ఈయన విచారణను ఎదుర్కొంటున్నారు. టిఎ బరోట్ కూడా గతేడాది రిటైర్ కాగా, వడోదరలో ఏడాది కాలానికిగాను డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుగా బాధ్యతలు అప్పగించారు. ఈయన ఇష్రాత్ జహాన్, సాధిక్ జమాల్ ఎన్‌కౌంటర్ కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. తమ తమ పదవులకు రాజీనామా చేయాల్సిందిగా ఇద్దరు పోలీసు అధికారుల తరపున కోర్టుకు హాజరైన న్యాయవాదిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జెఎస్ ఖేహర్, న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. వీరిద్దరినీ తిరిగి విధుల్లోకి నియమించడాన్ని వ్యతిరేకిస్తూ ఐపీఎస్ మాజీ అధికారి రాహుల్ శర్మ దాఖలుచేసిన పిటిషన్ నేపథ్యంలో కోర్టు పై ఆదేశాలు జారీచేసింది. వీరి నియామకాన్ని సవాలుచేస్తూ రాహుల్ శర్మ తొలుత గుజరాత్ రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా, కోర్టు శర్మ పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు నిర్ణయాన్ని సవాలుచేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రెండు ఎన్‌కౌంటర్ కేసుల్లోనూ అమిన్‌పై సీబీఐ చార్జిషీటు దాఖలుచేసిందని, ఆయన ఇప్పటికే దాదాపు ఎనిమిది సంవత్సరాలు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారని శర్మ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. జ్యుడీషియల్ కస్టడీ నుంచి విడుదలైన వెంటనే ఆయనను తిరిగి ఎస్‌పీ పదవిని అప్పగించారని ఆరోపించారు. 'పలువురి హత్య, అపహరణ కేసుల్లో నిందితుడిగా ఉన్న తరుణ్ బరోట్‌పై కూడా చార్జిషీటు నమోదైంది. పైన పేర్కొన్న కేసుల్లో అరెస్టయిన తరుణ్, దాదాపు మూడేండ్లు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. ఈయనను కూడా విడుదలైన వెంటనే డిప్యూటీ ఎస్పీగా బాధ్యతలు అప్పగించారు' అని రాహుల్ శర్మ ఆరోపించారు. ఇద్దరు అధికారులు ప్రశ్నార్థకమైన విధి నిర్వహణ రికార్డు ఉన్నప్పటికీ వారికి తిరిగి పదవులను కట్టబెట్టడాన్ని శర్మ తన పిటిషన్‌లో ప్రశ్నించారు.

ఎక్కడికి వెళ్లినా అబద్ధాలు చెబుతారు, ఐక్యంగా పోరాడితే..

ఆయన కనిపించకుండా పోతారు

- ప్రధాని మోడీపై రాహుల్ విమర్శనాస్త్రాలు
- సంస్కృతి పరిరక్షణ సమ్మేళన్‌లో పాల్గొన్న శరద్‌యాదవ్, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, ఏచూరి



న్యూఢిల్లీ: ఆయన ఎక్కడికి వెళ్లినా అబద్ధాలు చెబుతారు, మనం ఐక్యంగా పోరాడితే, ఆయన ఎక్కడా కనిపించకుండా పోతారంటూ ప్రధాని మోడీపై కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పించారు. మోడీ మేక్ ఇన్ ఇండియా గురించి చెబుతారు. కానీ, మన చుట్టూ ఎక్కడ చూసినా చైనాలో తయారైన వస్తువులే కనిపిస్తాయని రాహుల్ అన్నారు. మోడీ చెప్పిన మేక్ ఇన్ ఇండియా విఫలమైంది. ఉద్యోగాలు కల్పించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వైఫల్యం చెందిందని రాహుల్ అన్నారు. జేడీ(యూ) సీనియర్ నేత శరద్‌యాదవ్ నేతృత్వంలో గురువారం ఢిల్లీలో నిర్వహించిన సాంఝీ విరాసత్ బచావో(సంస్కృతి పరిరక్షణ) సమ్మేళన్ ర్యాలీలో రాహుల్‌గాంధీ పాల్గొని ప్రసంగించారు. ఈ ర్యాలీలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారామ్‌ఏచూరి, యూపీ మాజీ సీఎం అఖిలేశ్‌యాదవ్, ఎన్‌సీపీ,బీఎస్‌పీ, టీఎంసీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. గుజరాత్ పర్యటన సందర్భంగా తన కాన్వాయ్‌పై రాళ్ల దాడికి పాల్పడ్డ సంఘటనపై రాహుల్ మాట్లాడుతూ.. తనకు నల్లజెండాలు చూపిన బీజేపీ కార్యకర్తలవైపు తన కాన్వాయ్‌ని ముందుకు పోనివ్వగా వాళ్లు అక్కడి నుంచి పారిపోయారంటూ ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వస్తే ప్రతిఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, ఒక్కో కుటుంబం ఖాతాలో రూ.15లక్షల చొప్పున జమ చేస్తామంటూ ఇచ్చిన హామీని బీజేపీ నిలబెట్టుకోలేకపోయిందని రాహుల్ విమర్శించారు. దేశభక్తి విషయంలో ఆర్ఎస్ఎస్ కపట నాటకమాడుతోందని రాహుల్ మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టేవరకూ జాతీయ జెండాను ఆర్ఎస్ఎస్ ఎగురవేయలేదని ఆయన గుర్తు చేశారు. ఈ దేశం తమదని ఆర్ఎస్ఎస్ చెబుతుంది, మేం ఈ దేశస్తుల మని మనం చెబుతాం..ఇది మనకూ ఆర్ఎస్ఎస్‌కూ ఉండే తేడా అని రాహుల్ అన్నారు. మొదట వారు మైనారిటీలది ఈ దేశం కాదని చెప్పారు. ఉనా సంఘటన తర్వాత దళితుల విషయంలోనూ వారు అదే విషయం చెబుతున్నారని రాహుల్ అన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఆర్ఎస్ఎస్‌కు చెందిన ప్రముఖ నేత ఒకరు తనను జైలు నుంచి విడుదల చేయడానికి బ్రిటీష్ పాలకులకు క్షమాపణ చెప్పుకు న్నారు. కాంగ్రెస్ నేతలుగానీ, ఇతర పార్టీల నేతలుగానీ జైలు నుంచి తమ విడుదల కోసం బ్రిటీష్ పాలకులను క్షమాపణ కోరలేదని రాహుల్ స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ యత్నిస్తున్నదని, అందుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా పోరాడాలని రాహుల్ పిలుపునిచ్చారు.

షెడ్యూల్డ్ పరిశ్రమల జీవోలను సవరించకపోతే...

సెప్టెంబర్ 19న రాష్ట్రవ్యాప్త సమ్మె

కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలి

- 11న మండల, క్లస్టర్ కేంద్రాల్లో లేబర్ ఆఫీసుల ఎదుట ధర్నాలు: రాష్ట్ర సదస్సులో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం సాయిబాబు



మాట్లాడుతున్న సాయిబాబు

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

షెడ్యూల్డ్‌పరిశ్రమల్లో కాలపరిమితి ముగిసిన జీవోలను సవరించి, కనీసవేతనం రూ.18వేలు, వీడీఏ ప్రతిపాయింట్‌కు రూ.10.50లకు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం సాయిబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే సెప్టెంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అధ్యక్షత వహించగా, సాయిబాబు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తీర్మానాన్ని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ రమ, జె మల్లికార్జున్ బలపరిచారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ...తెలంగాణ ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. షెడ్యూల్డ్ పరిశ్రమల్లోని అత్యధిక జీవోలు కాలపరిమితి దాడిపోయి ఏడెనిమిదేండ్లు గడుస్తున్నా, కొత్త జీవోలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో మొత్తం 65 షెడ్యూల్డ్ సంస్థలుంటే 52 సంస్థల జీవోల కాలపరిమితి ఐదేండ్లు దాడిపోయిందని చెప్పారు. కనీస వేతనాల సలహామండలి ఈజీవోలను సవరించి, ప్రభుత్వానికి సిఫారసు చేసినా ముఖ్యమంత్రి సంతకం చేయడం లేదని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం, మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో పాటు ప్రజాప్రతినిధులందరి వేతనాలూ పెంచుకున్నారనీ, ఇటీవల టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యుల వేతనంరూ.80వేల నుంచి రూ.2.25లక్షలవరకూ పెంచారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వమిచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని పోరాడుతున్న కార్మిక సంఘాలపై ప్రభుత్వం నిర్భందం మొపుతున్నాదనీ, కార్మిక చట్టాలను, హక్కులను కాలరాస్తుందని చెప్పారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు వచ్చే నెల 17న జరిగే సమ్మెలో షెడ్యూల్డ్ సంస్థల పరిధిలోని వచ్చే పారిశ్రామిక క్లస్టరు, షెడ్యూల్ సంస్థల కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు కె రాజయ్య, జె చంద్రశేఖర్, బి మల్లేశం, కె బ్రహ్మాచారి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కార్యాచరణ..

- మెమోరాండంపై కార్మికుల సంతకాలు సేకరించాలి.
- కార్మికుల పనిస్థలాల్లో, నివాసప్రాంతాల్లో పాదయాత్ర, జీపుయాత్ర, మోటార్ సైకిళ్ల యాత్రలు నిర్వహించాలి.
- ప్రతి మండల, క్లస్టర్ కేంద్రాల్లో 'సమ్మె సదస్సు' పెట్టాలి.
- సెప్టెంబర్ 11న మండల, క్లస్టర్ కేంద్రాల్లో లేబర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేయాలి.
- కార్మిక, ప్రజా, సామాజిక సంఘాల మద్దతు కూడగడుతూ రౌండ్‌టేబుల్స్ నిర్వహించాలి.
- సెప్టెంబర్ 19న సమ్మె నిర్వహించాలి. ఈ సందర్భంగా భారీ ర్యాలీలు నిర్వహించాలి.

25న దేవులపల్లి రామానుజారావు శత జయంతి వేడుకలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేవులపల్లి రామానుజారావు తెలంగాణ ఉద్యమానికి చేసిన సేవలను స్మరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 25న ఆయన శతజయంతి ఉత్సావాలు నిర్వహిస్తోంది. నిజాం ప్రభుత్వ పాలనలోనే ఆయన తెలుగు భాష, తెలుగు సంస్కృతి వ్యాప్తికి ఎంతో కృషి చేశారని పేర్కొంది. తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనున్నట్టు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నూతన హంగులతో టూరిజం హోటల్

- రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మెన్ పేర్వారం రాములు

నవతెలంగాణ - కొండపాక

సిద్దిపేట జిల్లాలోని రాజీవ్ రహదారిపై రూ.20కోట్లతో అధునాతనమైన హంగులతో టూరిజం హోటల్‌ను నిర్మించనున్నట్టు రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ పేర్వారం రాములు తెలిపారు. రాజీవ్‌ర హాదారి నాగులబండ శివారులో నిర్మించనున్న జనతా టూరిజం హోటల్ స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ టూరిజం నిర్మాణా నికి రూ.10కోట్ల కేటాయించగా మరో రూ.10 కోట్లు బ్యాంక్ నుంచి రుణం తీసుకొని నిర్మిస్తున్నట్టు తెలిపారు. త్వరలో నిర్మించ బోయే ఈ హోటల్‌ను ఫైవ్‌స్టార్ హోటల్ కంటే మంచి క్వాలిటీతో ఉంటుందన్నారు. 40 గదులతో నిర్మించే ఈ హోటళ్లో రెండు వీఐపీ గదులు, 20 ఏసీ గదులు, 18 సాధారణ గదులు ఉండనున్నట్టు తెలి పారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్, రామగుండం తది తర ప్రాంతాలకు వెళ్లే టూరిస్టు బస్సులు, వ్యాన్లతో పాటుగా లారీల కోసం పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసి వారికి బాత్‌రూంలతోపాటుగా తదితర వస తులను కల్పించనున్నట్టు తెలి పారు. అదే విధంగా ప్రాం గణంలో టూరిస్టు పిల్లల కోసం నీటి కొలను ఏర్పాటు చేసి అందులో జల క్రీడల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు.

ఉపరాష్ట్రపతికి

పౌరసన్మానం కోసం ఏర్పాట్లు చేయండి

- అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

భారత ఉపరాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంకయ్యనాయుడు తొలిసారి హైదరాబాద్ రానున్న నేపథ్యంలో ఆయనకు ప్రభుత్వం పౌరసన్మానం చేయనుందని, అందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పి సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఉపరాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్‌పి సింగ్ మాట్లాడుతూ భారత ఉపరాష్ట్రపతికి రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21న రాజ్‌భవన్‌లో పౌర సన్మాన కార్యక్రమం నిర్వహించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు నిర్ణయించారని పేర్కొన్నారు. అందుకు అవసరమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పరిసరాల పరిశుభ్రత, రహదారుల మరమ్మతులు, బేగంపేట ఎయిర్ పోర్టులో ఏర్పాట్లు, నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు, తాగునీటి సరఫరా, వైద్య, ఆరోగ్య, అగ్నిమాపక సేవలు, ఉద్యాన, సమచార పౌర సంబంధాలు, సీఎస్‌ఎన్ఎల్, తెలంగాణ స్టేట్ టెక్నాలజికల్ సర్వీసులు తదితర శాఖల ద్వారా నిర్వహించే పనులను చేపట్టాలని సూచించారు.

విద్యుద్ఘాత మరణాలు నిరోధించాలి

- చాడ వెంకట్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

విద్యుత్ తీగలు పొలాల నుంచి పోవడంతో అవి గాలికి వదులు కావడం వల్ల ఒక వైరు మరొక వైరుతో తాకడంతో పొలం మధ్యలో పడి రైతులు విద్యుద్ఘాత మరణాలు జరుగుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని ఈ తరహా మరణాలను నిరోధించాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణలో వ్యవసాయం దాదాపు బోర్లు, బావుల మీద ఆధారపడి కొనసాగుతున్నదన్నారు. రైతుల, కూలీలు కరెంట్ షాక్ కొట్టి చనిపోతున్నారన్నారు. ప్రతి విద్యుత్ స్తంభాల మధ్య నిర్ణీత దూరం 60 మీటర్లు ఉండాలన్నారు.


వంద మీటర్ల దూరం ఉండటం మూలాన ఈ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రధానంగా విద్యుత్ ఉత్పత్తి పైన ప్రత్యేక దృష్టి సారించడం మంచి పరిణామన్నారు. విద్యుత్ పంపిణి వ్యవస్థపైన దృష్టి పెట్టడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరిచి విద్యుత్ శాఖలోని కింద స్థాయ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసి వ్యక్తిగత బాధ్యతలు ఇచ్చి, రైతులు, పశువులు మరణించకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కరెంట్ షాక్‌తో మరణించిన రైతులకు రూ 5 లక్షలు, చనిపోయిన పశువులకు రూ 60 వేల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'జనసేన పార్టీలో రెండు ప్రత్యేక విభాగాలు'

హైదరాబాద్: జనసేన పార్టీలో రెండు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయనున్నట్టు ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రకటించారు. గురువారం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ జనసేన విద్యార్థి విభాగం, జనసేన మహిళా విభాగాలను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు.

ఈ రెండు విభాగాల కోసం విధి విధానాలను రూపొందించే పనిలో ఉన్నట్టు పవన్ తెలిపారు. ఈ రెండు విభాగాలను అక్టోబర్‌లో ఆచరణలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామని, ఒకవేళ అపుడు వీలుకాకపోతే ఈ ఏడాది చివరి వరకు అమల్లోకి తీసుకువస్తామన్నారు.

కవి ధేనువకొండ శ్రీరామమూర్తి మృతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కవి ధేనువకొండ శ్రీరామమూర్తి (70) గురువారం హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ప్రకాశం జిల్లా అద్దంకి మండలంలోని ధేనువకొండ గ్రామంలో జన్మించారు. చీరాలలో స్థిరనివాసం. సంగీతం, సాహిత్య సంప్రదాయాలున్న కుటుంబంలో 1947 పుట్టారు. ఒంగోలులో సీఎస్‌ఆర్ శర్మ కాలేజీలో పీయూసీ చదివారు. హైదరాబాద్ ప్రభుత్వ ఆయుర్వేద కాలేజీలో బీఏఎంఎస్ చేశారు. వైద్య శాఖలో మూడు దశాబ్దాలపాటు వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించారు. రెండు దశాబ్దాలుగా కవిత, కథ, వ్యాసం మొదలైన రచనలు చేశారు. ఆశల సముద్రం, ఐలాండ్ విల్లా, అమ్మఒడి, వల్మీకం, సమ్ సైలెంట్ మెలోడీస్, మోహతిమిరం వంటి పుస్తకాలు రాశారు. ధేనువకొండ శ్రీరామమూర్తి భౌతికకాయాన్ని సందర్శించి పలువురు నివాళులర్పించారు. కవి, బీసీ కమిషన్ సభ్యులు జూలూరు గౌరీ శంకర్, ప్రముఖ కవి ఎన్ గోపి, శివారెడ్డి, గుడిపాటి, ఎకె ప్రభాకర్, కెపి అశోక్‌కుమార్, పగడాల నాగేందర్ నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

లోదా యాజమాన్యం మోసం చేసింది

- సినీనటుడు జగపతిబాబు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

సొంతింటి కల సాకారం చేసుకోవాలన్న ఆశలతో కోట్లు పెట్టి ఫ్లాట్లు కొనుక్కుంటే.. లోదా యాజమాన్యం మోసం చేసిందని సినీనటుడు జగపతిబాబు అన్నారు. గురువారం లోదా గేటెడ్ కమ్యూనిటీక్లబ్ హౌస్‌లో లోదా బెలిజా రెసిడెంట్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 13 ఎకరాల్లో ఇక్కడ టవర్స్ నిర్మించి 60 నుంచి 70 శాతం వరకు ఖాళీ స్థలం వదులుతున్నట్టు మొదట లోదా యాజమాన్యం తెలిపిందన్నారు. తరువాత నాలుగెకరాల్లో మెరిడియన్ బ్లాక్‌లు నిర్మించిం దన్నారు. మధ్య నిర్మించిన చైన్‌లి ంక్ వాల్‌ను నిర్మించారని చెప్పారు. ఫ్లాట్లు కొన్నప్పటి నుంచీ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, లోదా యాజమాన్యం మొదటి నుంచీ మోసం చేస్తూ వస్తోందని విమర్శించారు. రెండు బ్లాక్‌లకు మధ్య నిర్మించిన గోడను జీహె చ్ఎంసీ అధికారులు కూల్చేస్తా మంటున్నారని, అలా చేస్తే ఊరుకునేది లేదని అన్నారు. ఫ్లాట్లు కొనుగోలు చేసినప్పటి నుంచీ ఫైర్ సేఫ్టీ లేదని తదితర కారణాలు చెబుతూ ఇబ్బంది పెడుతు న్నారన్నారు. అసో సియేషన్ అధ్యక్షుడు పవన్ పిచారా మాట్లా డుతూ.. 12 ఎక రాల్లో 560 ఇండ్లు మాత్రమే ఉం డాలని, 16 టవర్స్‌లో సమాన సైజ్ ఫ్లాట్లు ఉంటాయని చెప్పార న్నారు. తాము 2010లో కొను గోలు చేస్తే.. 2012లో ఫ్లాట్లు ఇచ్చారన్నారు. ఈ విష యమై 2013 నుంచి అధికా రులకు విన్నవించినప్పటికీ ఎలాం టి చర్యలు తీసుకోకుండా, ఇప్పుడు గోడ కూలగొడతామంటే తమ భద్రతకు భంగం కలిగిం చినట్లే అవుతుందన్నారు. అసోసి యేషన్ కార్యదర్శి కళ్యాణ్ రెడ్డి, హైద రాబాద్ ఐఎస్‌బి మాజీ డీన్ అజిత్ రంగ్‌నేకర్, అనామిక లాల్యాని పాల్గొన్నారు.

అధికారులపై కఠిన చర్యలుంటాయి

పరిశ్రమలు, ఐటీ శాఖలపై మంత్రి కేటీఆర్ సమీక్ష



మాట్లాడుతున్న కేటీఆర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం గత మూడు సంవత్సరాల్లో అనేక అద్భుతమైన విధానాలను అమలులోకి తీసుకుని వచ్చిందని, రాబోవు రెండేండ్ల కాలానికి పాలసీల్లో హామీ ఇచ్చిన అంశాల అమలుకు కృషి చేయాలని మంత్రి కేటీఆర్ అధికారులను ఆదేశించారు. దీనికోసం పనులను మరింత వేగంవంతం చేయాలన్నారు. ప్రభుత్వ పాలసీలకు దేశ వ్యాప్తంగా ప్రశంసలు లభించాయని, ఈ మేరకు రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు, పెట్టుబడులే ప్రాతిపదికగా పనిచేయాలన్నారు. ఇకపైన వచ్చే ప్రతి మూడు నెలల్లో సాధించే శాఖాపరమైన మైలురాళ్లను ముందే తెలియజేయాలని, ఈ మైలురాళ్లను అందుకోలేని అధికారులపైన కఠినంగా వ్యవహారించేందుకు వెనకాడబోమని మంత్రి హెచ్చరించారు. గత ఎడాది ఈజ్ అఫ్ డూయింగ్ బిజినెస్‌తో దేశంలో ప్రథమ స్థానంలో నిలిచామని, ఈ సారి అదే స్థానాన్ని కొనసాగించేలా పనిచేయాలని అధికారులను కోరారు. గురువారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో పరిశ్రమలు, ఐటీ శాఖలపై సంబంధింత శాఖ మంత్రి కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఒక్కో కార్యక్రమం, ప్రాజెక్టులపైన మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ ఫార్మసిటీ, మెడికల్ డైవైజెస్ పార్కులపై చర్చించారు. పలు పరిశ్రమల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు సూమారు 8500 వేల ఎకరాల వరకు డిమాండ్ ఉన్నదని అధికారులు తెలిపారు.

ఏయిరో స్పేస్ రంగంలో మరిన్ని పెట్టుబడులు తీసుకుని వచ్చేలా ప్రయత్నాలు చేయాలని మంత్రి సూచించారు. తెలంగాణ ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టు, మిషన్ భగీరథ ప్రాజెక్టుతో కలిసి సమన్వయం చేసుకుంటున్నామని అధికారులు మంత్రికి తెలిపారు. మిషన్ భగీరథ ప్రాజెక్టుతో పాటే తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కూడా పూర్తవుతుందన్నారు. టాస్క్ కేంద్రాలను జిల్లాలకు విస్తరించేందుకు దశల వారీగా ప్రయత్నాలు ప్రారంభించాలని మంత్రి కోరారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, పరిశ్రమల కమిషనర్ నదీమ్ అహ్మద్, టియస్ ఐఐసి యండి వెంకటనర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం


విచారణ తంతు

రోహిత్ వేముల ఆత్మహత్య వెనుక కులవివక్షగానీ, మంత్రులుగానీ, అధికారులుగానీ లేరట! ప్రపంచ వ్యవహారాల పట్ల మనస్తాపం చెందిన రోహిత్ వేముల తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడట! కేంద్ర ప్రభుత్వం నియమించిన రూపన్‌వాలా కమిటీ 'తేల్చిన' విషయం ఇది.

నేరస్తులను శిక్షించవల్సిన పాలకులు, వివక్షను రూపుమాపవల్సిన ఏలికలు కంచే చేసుమేసినట్టు వ్యవహరించారు. పైగా రోహిత్ వేముల దళితుడు కాదని చెప్పేందుకు, సమస్యను పక్కదారి పట్టించేందుకు చేయవల్సిందంతా చేసారు. వీటికి సాధికారత కల్పించటమే ఈ విచారణ కమిటీ చేసిన పని.

సత్యాన్ని పాతరేసింది ఈ విచారణ నివేదిక. ప్రజాస్వామ్యం పట్లగానీ, విచారణపట్లగానీ ఎంతో కొంత విశ్వాసం ఉన్నవారికి ఇలాంటి విచారణ నివేదికలు చూసిన తర్వాత ఆవిరైపోతుంది. మంత్రులు మంత్రులుగానే ఉండి, వారి ప్రభుత్వం పర్యవేక్షణలో జరిగే విచారణ ద్వారా తేలే న్యాయం నేతిబీరకాయలో నెయ్యి వంటిదేనని మరోసారి రుజువు చేసారు. కొండను తవ్వి ఎలుకనుబట్టిన రూపన్‌వాలా నివేదిక కేంద్ర మంత్రులిద్దరికీ క్లీన్‌చిట్ ఇవ్వటమే కాకుండా, వైస్‌ఛాన్సలర్ చర్యలను సంపూర్ణంగా సమర్ధించింది. పైగా రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణాలు ఆయనకే బాగా తెలుసునని చెప్పింది. అయితే అంతర్జాతీయ వ్యవహారాల వల్ల కలత చెంది ప్రాణం తీసుకున్నానని ఆయన వీరికి కలలో వచ్చి చెప్పాడా? వైస్ ఛాన్సలర్ చర్యలవల్లనే ఆత్మహత్య చేసుకుని ఉండిఉంటే... ఆ విషయం ఆత్మహత్యకు ముందు తాను రాసిన లేఖలో చెప్పేవాడనీ, అట్లా రాయలేదనీ ఈ విచారణ కమిటీ చెబుతున్నది. ప్రపంచవ్యవహారాల పర్యవసానంగానే ఊపిరి వదలుతున్నానని ఆలేఖలో రాసాడా? పైగా ఈ విచారణ కమిటీ కూడా మరోసారి రోహిత్ వేముల దళితుడు కాదని నమ్మించే ప్రయత్నం చేసింది.

వైస్ ఛాన్సలర్ కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్టు రోహిత్ తన లేఖలో రాయలేదు. నిజమే! అంతకన్నా తీవ్రమైన విషయం... కులవివక్ష గురించి స్పష్టంగా చెప్పాడు. తన మరణానికి కారణం కేవలం ఒక వ్యక్తీ లేదా కొందరు వ్యక్తులు మాత్రమే కాదనీ, సమాజాన్ని ఆవహించిన కుల దురహంకారం, కులవివక్షే కారణమనీ రోహిత్ లేఖ సారాంశం. వివక్షనే శత్రువుగా చూసాడు. కేవలం కొంత మంది వ్యక్తులకు పరిమితం చేసేంత సంకుచితంగా ఆలోచించలేదు. అందుకే వివక్షకు పాల్పడిన వారంతా నేరస్తులే. వైస్‌ఛాన్సలర్ కచ్చితంగా నేరస్తుడే. రోహిత్‌వేముల మీద, తన సహచరుల మీద చర్య తీసుకునే విధంగా వీసీ మీద వత్తిడి తెచ్చిన కేంద్రమంత్రులిద్దరూ నేరస్తులే. రోహిత్ వేముల సూసైడ్ నోట్ చదివిన వారెవరికైనా ఇది సులభంగానే అర్థమవుతుంది. నేరస్తులైన వైస్‌ఛాన్సలర్‌నూ, మంత్రులనూ కాపాడేందుకూ, కుల దురహంకార ధోరణులను ప్రోత్సహించేందుకే ఈ నివేదిక తోడ్పడుతుంది.



పాలకులు ఎంతకైనా తెగబడగలరనీ ప్రజాస్వామ్యాన్ని పరిహసించగలరనీ మరోసారి నిర్ధారించేదే ఈ నివేదిక.

రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణం కులవివక్ష అని స్పష్టంగా అర్థమవుతుంది. అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్ కార్యకర్తలను గూండాలుగా చిత్రీకరిస్తూ మతోన్మాదులు ఫేస్‌బుక్‌లో పెట్టటంతో ఘర్షణ మొదలైంది. అసోసియేషన్ కార్యకర్తలు దేశద్రోహులనీ, సంఘ విద్రోహులుగా మారారనీ, కులాన్ని పెంచి పోషిస్తున్నారనీ కేంద్ర మంత్రులిద్దరూ ఆరోపించారు. యూనివర్సిటీ లోని మతోన్మాదులకు మద్దతునిస్తూ, రోహిత్ వేముల సహచరుల మీద చర్య తీసుకోవాలని వైస్‌ఛాన్సలర్ మీద వత్తిడి తెచ్చారు. ఇవేవీ విచారణ కమిటీకి కనిపించకపోవటమే విడ్డూరం. వైస్‌ఛాన్సలర్ తీసుకున్న చర్యలు మరింత హేయమైనవని ఎవరికైనా అర్థమవుతుంది. విచారణ కమిటీకి అర్థం కాకపోవటమే ఒక వింత. బహిరంగ ప్రదేశాలలో తిరగవద్దనీ, హాస్టల్‌లో ఉండవద్దనీ, తోటి విద్యార్థులను కలవ వద్దనీ, విద్యార్థి సంఘాలలో ఉండవద్దనీ, ఎన్నికల్లో పోటీ చేయవద్దనీ ఆదేశించారు. ఆధునిక సమాజంలో వేయవల్సిన శిక్షలేనా ఇవి? మనువాదుల దురహంకారపూరిత శిక్షలే కదా! ఏం చేయాలో తోచక, ఎక్కడ ఉండాలో తావులేక చిన్న గుడారం వేసుకున్నారు. వెలివాడలో వెలిసారీ వెలివేయబడిన విద్యార్థుల బృందం. భావసంఘర్షణా కేంద్రాలుగానూ, ఆధునిక భావాల సృష్టికర్తలుగానూ, అభివృద్ధికి వెలుగు దివ్వెలుగానూ ఉండవల్సిన ఆధునిక విశ్వవిద్యాలయాలలో ఇట్లా వెలివేయ వచ్చునా! మేధావులుగా చెప్పుకునే వారే ఛాందసవాదులై, మనువాదం ఆవహించి తిరోగమన చర్యలకు పాల్పడిన ఫలితమే కదా ఇది. ఈ వెలివేతను భరించలేక, వివక్షను తట్టుకోలేకనే తనువు చాలించాడు రోహిత్ వేముల. మనిషిని మనిషిగా చూడటం లేదనీ, పుట్టుక తీరునే చూస్తున్నారనీ లేఖలో స్పష్టంగా రాసాడు. ఇది ప్రభుత్వ హత్యే అనటానికి ఇంతకన్నా ఆధారాలేమికావాలి? ఇది కులవివక్ష ఫలితమనీ, యూనివర్సిటీ అధికారుల చర్యల పర్యవసానమనీ చెప్పడానికి ఇంకా సాక్ష్యాలు కావాలా!

నేరస్తులను శిక్షించవల్సిన పాలకులు, వివక్షను రూపుమాపవల్సిన ఏలికలు కంచే చేసుమేసినట్టు వ్యవహరించారు. పైగా రోహిత్ వేముల దళితుడు కాదని చెప్పేందుకు, సమస్యను పక్కదారి పట్టించేందుకు చేయవల్సిందంతా చేసారు. వీటికి సాధికారత కల్పించటమే ఈ విచారణ కమిటీ చేసిన పని. ఇప్పటికే పాలకులు తగు చర్యలు తీసుకోకపోవటం ఫలితంగా తెలంగాణలో కులదురహంకార దాడులు, హత్యలు పెరుగుతున్నాయి. గత ఆరు మాసాలలోనే పదిహేనుకు పైగా ఇలాంటి దాడులూ, హత్యలూ జరిగాయి. ఈ పాపాలకు బాధ్యత వహించవల్సింది పాలకులే. పాలకులను నిలదీయవల్సింది ప్రజలే.

అవార్డుల వాపసీ... ఎందుకు చారిత్రాత్మక సంఘటన?



డాక్టర్ దేవరాజు మహారాజు

మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలయ్యింది. ఎక్కువ కాలం కాంగ్రెస్ పాలించినా, మధ్యలో సంకీర్ణ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి. బీజేపీ కూడా లోగడ రాజ్యమేలింది. అయితే, భావస్వేచ్ఛను ఇంతగా తొక్కిపెట్టి, అరాచకం సృష్టించిన ప్రభుత్వాలు లోగడ లేవు. రాజ్యాంగంలోని 14, 19, 21 ప్రకరణాలు దేశ ప్రజలకు భావస్వేచ్ఛ నిచ్చాయి. ఎంచుకునే హక్కు నిచ్చాయి. తొలిసారిగా 2015-16లలో అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం అక్షరానికి, పుస్తకానికీ, మస్తకానికీ ఏమాత్రం విలువ, స్థానం లేకుండా చేయాలని ప్రయత్నం చేసింది. ఈ దేశంలో ప్రతి పౌరుడికి ఆలోచనా స్వేచ్ఛ, వ్యక్తీకరణ స్వేచ్ఛ, విశ్వాస స్వేచ్ఛ, ఆహార విహారాల స్వేచ్ఛకు హక్కులున్నాయి. అవన్నీ రాజ్యాంగం కల్పించిన రక్షణలు. వీటిలో దేనికి దెబ్బతగిలినా ఏ సమాజమూ భరించదు. సహించదు. ప్రతిఘటన అనివార్యమౌతుంది. ప్రభుత్వ దుర్మార్గాల నుంచి ప్రజలు తమని తాము కాపాడుకునే ప్రయత్నం తప్పక చేస్తారు. అదే ప్రజాస్వామ్య బద్ధంగా తెలియజేసే నిరసన! నిరసన అనేక రూపాల్లో ఉండొచ్చు. ప్రపంచంలో ఏ దేశ చరిత్ర చూసినా ఈ విషయాలు తెలుస్తాయి.

'కొన్ని శతాబ్దాలుగా 'భిన్నత్వంలో ఏకత్వం'తో ఉన్న భారతదేశాన్ని ఛిన్నాభిన్నం చేసి ఏం సాధించాలనుకుంటున్నారు? హేతువాదుల్ని చంపి హేతువు నెట్లా బతికిస్తారు? మనుషుల్ని చంపి దేశాన్నెట్లా రక్షిస్తారు? మొఘల్ సామ్రాజ్యంలో కూడా పరమత సహనం ఉండేదని చదువుకున్నాం. మరి ఇంత అసహనంతో అధికారం ఎలా చలాయిస్తారు?

సంప్రదాయం, సంస్కృతి పేర హిందూత్వవాదులు సాగించిన అమానుష హత్యాకాండకు నిరసనగా దేశం యావత్తూ కదిలివచ్చింది. కవులు, రచయితలు, కళాకారులు, శాస్త్రవేత్తలు, చరిత్రకారులు, నాటక, సినీరంగాలవారు, మేధావులు ఎందరో తమ నిరసనని ఎంతో బలంగా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశారు. కొందరు తమ అవార్డుల్ని తిప్పికొట్టారు. కొందరు తమ పదవుల్ని, హోదాల్ని వదులుకున్నారు. మరికొందరు పౌర సన్మానాల్ని, బిరుదుల్ని త్యజించారు. లౌకిక ప్రజాస్వామ్య వాదులైన ప్రజలు వీరికి అండగా నిలబడ్డారు. మీడియా వీరి వెన్నంటి నిలబడింది. వీరందరి సంఘటిత శక్తి ఒక ప్రభంజనమైంది. ఈ 'నిరసన' ప్రపంచ చరిత్రలో ప్రత్యేకంగా నిలువగల స్థాయి, స్థోమత సంపాదించుకుంది. ప్రపంచంలో ఎక్కడ ఏ అన్యాయం జరిగినా కవులు, రచయితలు బాధితుల పక్షాన నిలిచి అక్షరపోరాటం చేస్తారన్నది అక్షరసత్యం కదా!

ఆ దశలో దేశ ప్రధాని తక్షణం కల్పించుకుని, ఇక ముందు భావ ప్రకటనా స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఏమాత్రం ఆటంకం కలగనివ్వకుండా చూస్తాననే భరోసా ఇవ్వాల్సింది. దోషుల్ని పట్టి, శిక్షించి తన ప్రభుత్వ నిజాయితీని నిరూపించుకుంటుందని ప్రకటించాల్సింది. అది జరగకపోగా, తన సహచర కేంద్ర మంత్రులతో పిచ్చి వ్యాఖ్యానాలు చేయించారు. దాంతో విషయం విషమించింది.

"వైజ్ఞానిక ధోరణిని, మానవతా వాదాన్ని, సత్యాన్వేషణ తత్వాన్ని, సంస్కరణ తత్వాన్ని పెంపొందింప జేయడం ప్రతి భారత పౌరుని కర్తవ్యం" - ఇది మన భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుల గురించి రాసుకున్న వ్యాక్యం! ఈ భావం మీద గౌరవం, విశ్వాసం ఉంచి, జనంలో దీన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నవారు మాత్రం అన్యాయంగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఆ మధ్య వరుసగా జరిగిన హేతువాదుల హత్యలు గమనించండి. వీరంతా 67-82 యేండ్ల మధ్య వయస్సున్న వృద్ధులు. ఒక బాధ్యతతో తమ చుట్టూ ఉన్న సమాజాన్ని మేల్కొల్పాలని జీవితాల్ని ధారపోసిన మానవతా వాదులు. డాక్టర్ నరేంద్ర దబోల్కర్ (1నవంబర్ 1947-20 ఆగస్టు 2013) సీపీఐ నేత గోవింద్ పన్సారే (26నవంబర్ 1933 - 20 ఫిబ్రవరి 2015) ప్రొఫెసర్ యం.యం. కల్బుర్గి (28 నవంబర్ 1938-30 ఆగస్టు 2015)లు ఉదయంపూటే హత్య చేయబడ్డారు. ఒక మోటార్ సైకిల్‌పై ఇద్దరు దుండగులు రావడం, ఒకడు కాపలా కాయడం మరొకడు వారికి ఎదురు వెళ్ళి తుపాకీతో కాల్చి చంపడం.. ఏ హడావుడి లేకుండా పారిపోవడం జరిగాయి. చిత్రమేమంటే.. వీరెవరో పోలీసులకు అంతుచిక్కదు. 2013లో హంతకుల్ని పోలీసులు పట్టుకుని ఉంటే, 2015లో వరుసగా రెండు హత్యలు జరిగి ఉండేవి కావేమో! ఒక పథకం ప్రకారం జరుగుతున్న హత్యల పూర్వాపరాలు గమనిస్తే, ఇవన్నీ ఎవరో బడాబాబుల అండదండలతో నిర్భయంగా, నిరాఘాటంగా జరుగుతున్నాయని అనిపిస్తుంది. శారీరకంగా నిర్బలులైన వృద్ధుల్ని మట్టుబెట్టి, సమాజానికి వారేమి సందేశమివ్వాలని అనుకుంటున్నారు? భావజాలాన్ని ఆపగలరా? దృక్పథాల్ని మార్చగలరా? సమాజం మూఢత్వంలోనే మగ్గిపోవాలని, తమ ఆధిపత్యం కొనసాగుతూనే ఉండాలని ఎంతకాలం ప్రయత్నించగలరూ? వీటికి తోడు ఢిల్లీ దగ్గర ఒక గ్రామంలో ఆవుమాంసం తిన్నాడన్న నేరం మోపి మహ్మద్ అఖ్లాక్ అనే వృద్ధుణ్ణి హత్య చేయడం, అక్టోబర్12న సురేంద్ర కులకర్ణిపై నల్లసిరా గుమ్మరించిన శివసేన కార్యకర్తలు అదినల్లరంగు కాదని దేశభక్తుల రక్తమని చెప్పుకోవడం వంటి ఘటనలు సామాన్యుల్లో భయాందోళనలు కలిగించాయి. వాజ్‌పాయ్ ప్రధానిగా ఉన్న సమయంలో ప్రధాని కార్యాలయానికి (పిఎంఒ) డైరెక్టర్‌గా ఉన్న సురేంద్ర కులకర్ణి లాంటి ప్రముఖులకే భద్రత లేనప్పుడు, ఇక మామూలు వారి పరిస్థితి ఏమిటీ? అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ, దాని అనుబంధ సంస్థలలోని ప్రముఖుల ఆశీస్సులతోనే కార్యకర్తలు రెచ్చిపోయి ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ప్రజలు అనుకుంటున్నారు.

ఇందులో పద్మశ్రీ నరేంద్ర దబోల్కర్ వృత్తిపరంగా వైద్యుడు. సామాజిక కార్యకర్తగా మారి, "మహారాష్ట్ర అంధ శ్రద్ధ నిర్మూలన సమితి (ఎంఎఎన్ఎస్) ఏర్పరిచి, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నవాడు. మార్నింగ్ వాక్ ముగించుకుని ఇంటికి వెళుతున్నప్పుడు ఇద్దరు దుండగులు కాల్చి చంపారు. పర్స్‌లో దొరికిన ఫొటో, విజిటింగ్ కార్డు వల్ల మృతుడెవరో పోలీసులు తెలుసుకోగలిగారు. మహారాష్ట్రలో అత్యంత ప్రజాదరణ గల వామపక్ష సీపీఐ నేత గోవింద్ పన్సారే. "శివాజీ కౌన్ హోతా" గ్రంథ రచయిత. అది ఒక బెస్ట్ సెల్లర్! "శ్రామిక ప్రతిష్ఠాన్" సామాజిక సాంస్కృతిక సంస్థ రూపొందించి ఉపన్యాస పరంపర కొనసాగించినవాడు. కార్మిక చట్టం నిపుణుడు. గ్రామాల్లో మూఢ నమ్మకాల నిర్మూలనకు ఎంతగానో కృషి చేశాడు. భార్యతో కలసి మార్నింగ్ వాక్ వెళ్ళి వచ్చి ఇంట్లోకి వెళుతుండగా ఇద్దరు దుండగులు తుపాకితో కాల్చి చంపారు. ఆయన భార్య గాయాలతో బయటపడి, బతికింది. ఇక యం.యం. కల్బుర్గిది మరీ దారుణమైన హత్య. పొద్దున్నే ఆయన ఇంటికి వెళ్ళి తలుపుకొట్టి, ఎదురుపడగానే తుపాకీతో కాల్చి చంపారు. కల్బుర్గి ప్రముఖ సాహితీవేత్త, మాజీ వైస్ ఛాన్సలర్, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, హేతువాది, పరిశోధకుడు. వరుసగా ఇలాంటి వారిని మట్టుబెట్టడం వల్ల సాహిత్య కళారంగ ప్రముఖులు తమ దిగ్భ్రాంతిని తెలియజేశారు.



2015 ఆగస్టు 30న యం.యం. కల్బుర్గి హత్య దేశాన్ని కదిలించింది. సాహితీ వేత్తలు దేశవ్యాప్తంగా నిబ్బరంగా ఉండలేకపోయారు. ఏదో ఒక రకంగా తమ నిరసన తెలియజేయాలనుకున్నారు. మొట్టమొదట మధ్యప్రదేశ్‌లో ఒక గ్రామంలో ఉన్న హిందీకవి ఉదయ్‌ప్రకాశ్ పి.టి.ఐ.వార్తా సంస్థకు ఫోన్ చేసి తన సాహిత్య అకాడమీ అవార్డును తిప్పి పంపుతున్నట్టు ప్రకటించారు. అది చాలా మంది రచయితలలో కదలిక తెచ్చింది. మనసు చంపుకుని, నోరు మూసుకుని ఊరుకోవడం కన్నా ఏదో ఒకరకంగా నిరసనను వ్యక్తీకరించడమే మేలుకదా! అని అనుకున్నారు. ఒక్కొక్కరు తమ తమ కేంద్ర సాహిత్య అవార్డుల్ని తిప్పి పంపసాగారు. అది 2015 సెప్టెంబర్ మొదట్లో జరిగితే, ఒక ఇరవై రోజుల తర్వాత డెహ్రాడూన్‌లో ఉన్న నయనతార సెహగల్ ఇండియన్ ఇంగ్లీష్ రచయిత్రి తన సాహిత్య అకాడమీ అవార్డును అక్టోబర్ 7న తిప్పి పంపారు. ఉదయప్రకాశ్‌కు "మెహన్‌దాస్" అనే కథల పుస్తకానికి 2010లో అవార్డు లభిస్తే, నయనతార సెహగల్‌కి "రిచ్‌లైక్ అజ్" అనే పుస్తకానికి 1985లోనే లభించింది. నయనతార మరెవరోకాదు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చెల్లెలు విజయలక్ష్మీ పండిట్ కూతురు. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధిస్తే... వ్యతిరేకించారు. అంతేకాదు ఈ దేశాన్ని ఒక కుటుంబమే పరిపాలించడమేమిటని ప్రశ్నించారు కూడా! స్వతంత్ర ఆలోచనా ధోరణి ఉన్న మహిళ ఆమె.

1955లో భారత ప్రభుత్వం విశ్వేరయ్యకు 'భారత రత్న' బిరుదునిచ్చి గౌరవించింది. ఆ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు ఉత్తరం రాస్తూ, "భారత రత్న ఇచ్చారని నేను మీ ప్రభుత్వాన్ని సమర్థిస్తూ, పొగడుతూ ఉంటానని అనుకోవద్దు. నేనెప్పుడూ వాస్తవాలు వెల్లడించే మనిషిని. ఆ తరువాత మీ ఇష్టం!" అని రాశాడు. దానితో నెహ్రూ దృష్టిలో విశ్వేశ్వరయ్య మరింత ఎదిగిపోయాడు. ఈ విషయం ఎందుకు గుర్తు చేసుకోవాల్సి వస్తోందంటే మన హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సిసిఎంబి) మాజీ డైరెక్టర్, పి.యం. భార్గవ తన పద్మభూషణ్ పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వానికి తిప్పి పంపారు. దేశం 'అసహన భారతం'గా మారుతున్నందుకు తన అసంతృప్తిని ప్రకటిస్తూ, తన నిరసనని ఆయన అలా తెలియజేశారు. రచయితలు, హేతువాదులు, మానవతా వాదుల హత్యలు తనను కలచివేశాయని, భావప్రకటనా స్వేచ్ఛ లేకుండా దేశాన్ని అసహన భారతంగా మారుస్తున్న వారిపట్ల మోడీ ప్రభుత్వం ఉదారంగా ఉంటోందని ఆయన ఆవేదన తెలియజేశారు. కవులు, కళాకారులు తమ రచనల ద్వారా లేదా కళా ప్రక్రియల ద్వారా తమ నిరసనను తెలిపే అవకాశం ఉంది. కానీ, తన వంటి పరిశోధకులకు, శాస్త్రజ్ఞులకు ఆ అవకాశం ఉండదు. అందువల్ల గత్యంతరం లేక నిరసనకు మరో మార్గం లేక, పద్మభూషణ్ అవార్డును వెనక్కిచ్చి తీవ్రమైన మనోవేదనను ప్రకటిస్తున్నానని ఆయన అన్నారు. ఎనభై యేండ్ల సీనియర్ సైంటిస్టు, సిసియంబికి రూపకల్పన చేసిన ఫౌండర్ డైరెక్టర్ అయిన పుష్ప, యం.భార్గవకు వైజ్ఞానిక రంగంలో ఎంతో పేరుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వంద అవార్డులు స్వీకరించిన ప్రజ్ఞాశాలి. అయినా తనకు భారత ప్రభుత్వం ఇచ్చిన పద్మభూషణ్ చాలా ఇష్టమైందని, దానిపట్ల ఎంతో ప్రేమ, గౌరవం ఉన్నాయని, కాని దేశంలో హేతువుకు, హేతువాదానికి విఘాతం కలుగుతున్నప్పుడు చూస్తూ ఊర్కోవడమెలా? అని ఆయన ప్రశ్నించారు. వైజ్ఞానిక పరిశోధనలు హేతువుతో మొదలై, హేతువు చుట్టూ తిరుగుతాయి. కాని ఈ ప్రభుత్వం, దాని అనుబంధ సంస్థలు హేతువునే చంపేస్తున్నాయి. అణగదొక్కుతున్నాయి. అలాంటప్పుడు పద్మా అవార్డులకు, అకాడమీ అవార్డులకు విలువేముంది? హేతువుకు గౌరవం లేనప్పుడు పరిశోధనలకేం గౌరవముంటుంది? పరిశోధనలకు గౌరవం లేనప్పుడు పరిశోధకుడిగా అందుకున్న పద్మభూషణ్‌కేమి విలువ ఉంటుంది? సామాజిక స్పృహ గల ప్రతి రచన, చిత్రలేఖనం, నృత్యం, అన్నీ హేతువులోంచే బయటపడతాయి. విత్తును చంపి పచ్చని చెట్టు కావాలన్నట్టు ఉంది ఇప్పటి పరిస్థితి. 'కొన్ని శతాబ్దాలుగా 'భిన్నత్వంలో ఏకత్వం'తో ఉన్న భారతదేశాన్ని ఛిన్నాభిన్నం చేసి ఏం సాధించాలనుకుంటున్నారు? హేతువాదుల్ని చంపి హేతువు నెట్లా బతికిస్తారు? మనుషుల్ని చంపి దేశాన్నెట్లా రక్షిస్తారు? మొఘల్ సామ్రాజ్యంలో కూడా పరమత సహనం ఉండేదని చదువుకున్నాం. మరి ఇంత అసహనంతో అధికారం ఎలా చలాయిస్తారు?

వ్యాసకర్త: ప్రముఖ సాహితీ వేత్త, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్. సెల్: 9908633949

మెయిల్ @ నవతెలంగాణ




కె. చంద్రమోహన్

"గోరఖ్ పూర్ పే బాత్"

గోరఖ్‌పూర్‌లోని బాబారాఘవ్‌దాస్ సర్కారు దవాఖానాలో 72మంది పసిపిల్లలు పిట్టల్లా రాలిపోయారు. కారణాలు ఏమిటి? ఆ తల్లుల గర్భశోకం ఎలా తీర్చగలరు. ఇదే ఉత్తరప్రదేశ్‌లో అఖ్లాక్ ఇంట్లో గొడ్డు మాంసం వుందని నానా యాగీ చేసి చంపేశారు. గోరక్షక దళాలను ప్రోత్సహించారు. చంటి పిల్లలు చనిపోతే కేంద్రంలో, ఆ రాష్ట్రంలో అధికారంలోనున్న బీజేపీ అధ్యక్షులు అమిత్‌షా పిల్లల మరణాలు ఇదేమీ కొత్తకాదు, ఇంతకు ముందు కూడా జరిగాయి అని మానవత్వం కూడా చూపించకుండా కొట్టివేసిండు. స్వయానా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సొంత ప్రాంతమైన గోరఖ్‌పూర్ ఆసుపత్రిలో జరిగిన ఘోరమిది. ఘటన జరిగిన రెండు రోజుల ముందే, ముఖ్యమంత్రి ఆసుపత్రిని సందర్శించారు. ఆ మాత్రం పరిశీలన చేయలేక పోయారా? పైగా ఆయన ఇక్కడ జరిగే మెదడువాపు వ్యాధుల మరణాలపై గల్లీ నుండి ఢిల్లీ దాకా చాలాసార్లు మాట్లాడాను అని ప్రగల్బాలు పలికిండు. అన్నీ తెలిసిన ఆయన 20ఏండ్లు గోరఖ్‌పూర్‌కు పార్లమెంట్ సభ్యుడిగా కూడా వెలగ బెట్టిండు. కనీసం జరిగిన ఘోరానికి చింతించకుండా అదేరోజు సాయంత్రం కృష్ణాష్టమి గ్రాండ్‌గా జరపాలని పిలుపునిచ్చాడు. యుద్ధ ప్రాతిపదికన దవాఖానలో సౌకర్యాలు, డాక్టర్లను ఏర్పాటు చేయాల్సిందిపోయి చనిపోయిన పిల్లల శవాలు ఖాళీచేయించేందుకు పోలీసుల్ని పంపించారు. నిష్పక్షపాతంగా న్యాయమూర్తులతో విచారణ జరిపించాల్సిందిపోయి ప్రిన్సిపల్ సెక్రటరీతో ఒక కమిటీ వేసి నాలుగు వారాల్లో రిపోర్టు ఇవ్వాలని చేతులు దులుపుకున్నారు. రాష్ట్ర ఆరోగ్యమంత్రి దీని వెనుక కుట్రవుందని ప్రకటించారు. ప్రాణవాయువు లేక చనిపోయారని మీడియా కోడై కూస్తున్నది. లిక్విడ్ ఆక్సిజన్ సరఫరా చేసే పుష్పా సేల్స్ అనే సంస్థకు ఆస్పత్రి రూ.63.65 లక్షలు బకాయి పడింది. పలుమార్లు లేఖలు రాసినా ప్రభుత్వం నుండి స్పందన లేదు. చివరకు సరఫరా ఆపేశారు. వాస్తవాన్ని ప్రక్కన పెట్టి ఇద్దరు డాక్టర్లు రాజీవ్‌మిశ్రా, కఫీల్ అహ్మద్‌లను సస్పెండ్ చేశారు. డాక్టర్ కఫీల్ చివరి వరకు పిల్లలను బతికించేందుకు సొంత డబ్బులు కూడా ఖర్చు పెట్టి నానా తిప్పలు పడ్డట్టు మీడియా చూపించింది. ఆయన్ని ఎందుకు తొలగించిందో ప్రభుత్వం వద్ద సమాధానం లేదని (ఐయంఏ) భారతీయ వైద్యుల సంఘం ప్రశ్నించింది. జాతీయ మానవ హక్కుల సంఘం (యన్ హెచ్ ఆర్ సి) 4 వారాల్లో జరిగిన ఘోరకలిపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

గడిచిన 40 ఏండ్లలో అధికారికంగా 25 వేలు, అనధికారికంగా 50వేల మంది పిల్లలు చనిపోయారు. అప్పుడు ఏ రాజకీయ పార్టీలను ప్రశ్నించలేదేంటి అని ఉత్తరప్రదేశ్ బీజేపీ అధికార ప్రతినిధులు మాట్లాడటం సిగ్గుచేటు. గత పాలకులు అంతే మేమూ అంతే అని చెప్పదలచుకున్నారా? ఈ ఒక్క నెలలోనే 134 మంది పిల్లలు చనిపోయారని కేంద్ర వైద్య బృందం ప్రకటించింది. ఒక రెఫరల్ ఆస్పత్రిలోని పరిస్థితి ఈ రకంగా వుందంటే దేశంలో పేదోడికి ఆరోగ్య హక్కు పరిస్థితి ఏంటో ఇట్టే అర్థం అవుతుంది. ఆవులకు అంబులెన్స్‌లు ఏర్పాటు చేయటానికి పైసల్ వుంటాయికాని, పేద పిల్లలకు ప్రాణవాయువు అందించలేని దుస్థితిలో ప్రభుత్వం వున్నది. బీఆర్‌డీ వైద్య కళాశాల ఖాతాలో రూ.3.86 కోట్లు వున్నాయి. చేతులు తడపక పోబట్టే డబ్బులు ఆలస్యం అయ్యిందని, డాక్టర్లందరికీ ప్రయివేట్ దవాఖానాల్లో సొంత ప్రాక్టీస్‌లు వున్నాయని కూడా మీడియా పరిశోధించింది. వెనకటి సాధువులకు మానవత్వం, దయ ఎక్కువ వుండేదంటారు. ఇప్పటి సాధువులు అధికారానికి అలవాటు పడ్డారు. ఇదేమైనా యాక్సిడెంటా పోనిలే అనుకోవటానికి, దేశం రేపటి గొప్ప పౌరులను కోల్పోయింది. 'కుంభకోణం' స్కూల్ ఘటన, టెర్రరిస్టు దాడి జరిగితేనే స్పందిస్తామా? 'యోగికి, చీము, నెత్తురు వుంటే రాజీనామా చేయాలి. ఇది సర్కారు వైఫల్యం; కుళ్ళిన వ్యవస్థకు తార్కాణం. అయ్యా ప్రధానమంత్రి కేరళలోని దేవాలయంలో అగ్నిప్రమాద బాధితులను పరామర్శించటానికి 3000కిలో మీటర్లు ప్రయాణించారు. రాజకీయ హత్య లంటూ కేరళ ప్రభుత్వాన్ని అస్థిర పరచటానికి మీ మంత్రి జైట్లీ కాలుకు బలపం కట్టుకున్నాడు. మరి ఢిల్లీకి దగ్గర్లో ఉన్న గోరఖ్‌పూర్‌కు ఎందుకు వెళ్ళలేదు? మన్‌కీ బాత్‌లు ఆపి 'గోరఖ్‌పూర్' గురించి మాట్లాడండి. ■

నితీశ్ అవకాశవాదం.. లౌకిక రాజకీయాలకు దెబ్బ



సిహెచ్ మధు

దేశంలోని ప్రజాస్వామ్యవాదులు, లౌకిక వాదుల దృష్టిలో నితీశ్ అవకాశవాదిగా మిగిలిపోయారు. మోడీ అనే మర్రి నీడలో ఆయనో గడ్డిపోచలా మారిపోతారు. నితీశ్‌ను బీహార్ ముఖ్యమంత్రి అనటానికి కూడా మనసు ఒప్పటం లేదు. బీహార్ ప్రజలు మహాకూటమికి ఓటువేశారు తప్ప ఎన్‌డీఏ కూటమికి కాదు. నితీశ్‌కుమార్ భారతదేశ బడుగువర్గాల అందరి అంచనాలు తలక్రిందులు చేసి, ప్రజాస్వామ్యవాదులకు లౌకికవాదులకు దూరంగా జరిగారు. మోడీ నియంతృత్వానికి బాహాటంగా తలవంచిన బీజేపీ యేతర మొదటి ముఖ్యమంత్రి నితీశ్.

ప్రజాస్వామ్య చరిత్ర, అణగారిన వర్గాల చరిత్ర ఆయనను క్షమిస్తుందా అనుమానమే! ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి బీజేపీతో పొత్తు ప్రభుత్వం ఏర్పరచకుండా నిశ్శబ్దంగా ఉంటే... ఒకరి అవినీతిపరులు, ఇంకొకరు మతతత్వవాదులని, నిశ్శబ్దంగా ఉంటే... దేశంలో ఆయన హీరో అయ్యేవారు. ఇప్పుడు ఆయన జీరో..! కానీ ప్రజల ఆలోచనలను వారి గుండెచప్పుళ్లను, పాలకవర్గం మీద ప్రజలకున్న కసిని అర్థం చేసుకోవటం లేదు. ప్రధాని నరేంద్రమోడీ తన రాజకీయ నేర్పరితనంతో ప్రత్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించి వాళ్ల బలహీనతల అసరాతో లొంగదీసుకోవచ్చు. కానీ ప్రజల గుండెల్లో పెద్దగా మోడీకి స్థానం లేదు. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితులను చాకచక్యంతో వాడుకొని మళ్లీ ప్రధాని కావచ్చు. మైనారిటీయేతర ప్రజలలో మత సెంటిమెంట్ ఎక్కించి మళ్లీ పీఠం కైవసం చేసుకోవచ్చు. అది తాత్కాలిక సెంటిమెంట్. ఒక మత్తు లాంటిది. ఎప్పటికీ మత్తులో ఉండరు ప్రజలు. అభివృద్ధిని చూస్తారు. తమకు అల్లుకున్న సమస్యను చూస్తారు. తమ కన్నీళ్లకు కారకులెవరో చూస్తారు. పాలకుల వాగ్దానాలు నెమరువేసుకొని ఎవరినైనా సముద్రంలోకి విసిరిపారేస్తారు. నరేంద్రమోడీ ఎంత? శక్తివంతమైన ఇందిరాగాంధీనే నెట్టేసారు. వాజ్‌పాయ్‌ను కౌగిలించుకుంటూనే 'మతాన్ని కౌగిలించుకోజాలమని వద్దనుకున్నారు. మోడీ అభివృద్ధి ప్రధానికాదు. ఇతరుల బలహీనతలపైన ఆధారపడిన ప్రధాని, అవినీతి, అసమర్థత కాంగ్రెస్ సొత్తుగా భావించి, సంకీర్ణ ప్రభుత్వాలు వద్దు అనుకుని, శక్తివంతమైన ప్రధాని కావాలని భావించారు. ఈ ప్రజలు ఆలోచనలను మోడీ సొమ్ముచేసుకున్నారు. ఎంత ఆశ! విదేశీ బ్యాంకులలో దాచుకొన్న 75లక్షల కోట్లు తెచ్చి ప్రజలకు పంచుతానన్నారు. ఆశపడరా! మోడీ ప్రజల మనసును సొమ్ముచేసుకోవచ్చు. ప్రత్యర్థుల రాజకీయ అవినీతిని బలహీనతగా తనకు అనుకూలంగా మార్చుకోవచ్చు. కానీ, ఏ బలహీనతలు లేని ప్రజలకు, శ్రామిక సంస్కృతిని నమ్మిన ప్రజలు ప్రజాస్వామ్య భావజాలం, లౌకికతత్వం లేని ప్రధానిని అసలు అంగీకరించరు. నియంతృత్వాన్ని తలకెత్తుకోలేరు. ఈ మూడేండ్లలోనే ప్రధాని మోడీ రెండు మరకలను అంటించుకున్నారు. ఒకటి కార్పొరేట్ ప్రధానిగా పేరు పొందారు. రెండు రాజ్యాంగ వ్యవస్థలను సూత్రాలను తన వ్యక్తిగత వైభోగానికి వాడుకునే నాయకునిగా పేరు తెచ్చుకున్నారు. అతి త్వరలోనే యుద్ధ ప్రధానిగా పేరు తెచ్చుకోవచ్చు. ఇవన్నీ నితీశ్‌కు తెలియవా?



ఈ రాజకీయ వ్యవస్థలో ఎంతటి వారైనా దిగజారిపోతారని అర్థమైతున్న సత్యం. వ్యవస్థ అలాంటిది. బురదలో ఉన్నవన్నీ దున్నపోతులే. తెగించి పోరాడే రాజకీయ వ్యక్తులు పరిమితమే. తాను చూచిన చరిత్రలో నితీశ్ మచ్చలేని వ్యక్తి. పైగా ఆయనలో పెద్దగా పదవీ వ్యామోహం కనిపించదు. ఇప్పుడు కుర్చీ కొరకు బీజేపీతో చేతులు కల్పటం ఎందుకు జరిగిందో అర్థం కాదు. లాలూ కుటుంబ అవినీతి కారణమని అనలేం. అది ఒక కారణం కావచ్చు. అదే ముఖ్యమైన కారణమైతే లాలూ కొడుకును బర్తరఫ్ చేసి నిశ్శబ్దంగా ఊరుకునేవారు. ఏమి జరిగేదో చూడాల్సింది. లాలూ మద్దతు ఉపసంహరించు కొని బీజేపీకి అవకాశమిచ్చేవారా? లేక బీజేపీ మద్దతు ప్రమాదకరమని మంత్రివర్గం నుండి వైదొలగి మద్దతు యిచ్చేవారో? నితీశ్ రాజీనామాకు లాలూ అవినీతి కారణం కావచ్చు. బీజేపీతో పొత్తుకు ఎవరు కారణం? ఏమి కారణం? అంతుచిక్కని రహస్యాలు. అంతుచిక్కినా బయటకు చెప్పలేని రహస్యం. నరేంద్రమోడీ ప్రధాని అయిన తర్వాత రాజకీయ నేరాలు.. పాపాలు తెలియలేని, పెద్ద వలయాన్ని సృష్టించారు. ఇప్పుడు రాజకీయ వ్యవస్థ రహస్యాల పాపాల పుట్టగా మారిపోయింది. మోడీ చెప్పే మాట ఒకటి జరిగేది మరొకటి.

నిజానికి దుర్మార్గమైన రాజకీయ వ్యవస్థ మీద అసహ్యం ఉన్నా కొందరు ముఖ్యమంత్రుల మీద ప్రేమ ఉండేది. అందులో నితీశ్‌కుమార్ ఒకరు. కొన్ని విలువలకు కట్టుబడిన వారు. వారి మంత్రివర్గమేమీ పవిత్ర జలాలు కావు కానీ, వీళ్ల పర్వాలేదు అనిపించుకున్నారు. దేశంలోని ప్రజా స్వామ్య వాదులు, లౌకిక వాదులు మోడీని ఎదిరించే సత్తా ఉన్న వ్యక్తిగా భావి ప్రధానిగా ఊహించే నితీశ్ తలవంచాడు. బడుగు వర్గాలు తమ నాయకునిగా భావించేవారు. అణగారిన వర్గాల ఐక్యత హిందూభావజాల వ్యతిరేకిగా పేరున్నవారు పదవి ఎంతటివారినైనా దిగజార్చుతుంది. ఇప్పుడు నడుస్తున్నవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు.

లాలూ కుటుంబం అవినీతికి వ్యతిరేకంగా రాజీనామా చేసానని నితీశ్ అవినీతి వ్యతిరేక హీరోగా పోజు పెడుతున్నారు. కానీ, లాలు అవినీతి మహాకూటమితో జతకట్టేటప్పుడు తెలియదా? సీబీఐ గుర్తించిన తర్వాతే నితీశ్ కంటపడిందా? బీజేపీలో అవినీతి ముఖ్య మంత్రులు, మంత్రులు లేరా? ఆయన మంత్రులు, ఆయన ఎమ్మెల్యేలు కడిగిన ముత్యాలా?

మొత్తం మీద నితీశ్ లొంగుబాటు, బీజేపీతో పొత్తు కలవరం కల్గించే విషయం. అయితే ఇదీ ఒకవిధంగా మంచిదే. ఆలస్యం కావచ్చు, కానీ పాతనీరు కొట్టుకుపోతే తప్ప.. స్వచ్ఛమైన నీరు చేరదు. అయినా నాలాంటి వాళ్లకు అర్థం కాని విషయం. మోడీకి ఎదురులేదని నితీశ్ ఆయన కొమ్ముకాయటానికి అడుగువేసారు. కానీ, ప్రజల గుండెల్లో మోడీ ఎలా ఉన్నారో గుర్తించలేదు. దళితులు, మైనారిటీలు తమపై జరుగుతున్న హింసతో భయం భయంగా బతుకుతున్నారు. నోట్ల రద్దుతో తమ బతుకులు చిందరవందర అయ్యాయని సామాన్యజనం కసిగా ఉన్నారు. జీఎస్‌టీ తమ కడుపుకొట్టేలా ఉందని చిన్న మధ్య తరగతి వ్యాపారులు గొంతు పెంచుతున్నారు. దేశంలోని రైతాంగమంతా మోడీకి వ్యతిరేకంగా ఒక్కటయ్యారు. కార్పొరేట్ ప్రధానిగా, ఒక నియంతగా ప్రజల మనసులలో నిలిచిపోయారు.

సెల్: 9949486122



చైతన్యం పెంచుకోవాలి...



నాపై జనరేషన్స్ మా అమ్మ, అత్తగారు వాళ్లు చూసి నేర్చుకున్నదేమంటే... జీవితమంతా పిల్లలకు, మొగుళ్లకు అంకితం చేయొద్దు. వాళ్లుంటే జీవితం, లేకపోతే డిప్రెషన్‌లోకి వెళ్లిపోవడం ఉండొద్దు. ఏదో ఒకటి నేర్చుకోవాలి. ఏదో ఒక వ్యాపకం పెట్టుకోవాలి. మనకంటూ ఓ ప్యాషన్ ఉండాలి. మానసికంగా బిజీగా, జ్ఞానం కలిగి ఉండాలి. మగాళ్లకు బయట సర్కిల్, నెట్‌వర్క్ ఉంటుంది. కానీ ఆక్టివ్ ఏజ్‌లో ఉన్నప్పుడు ఆడవాళ్లు సర్కిల్ ఏర్పాటు చేసుకోకపోతే... వృద్ధాప్యంలో చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. అలాగే ఎవరినైనా కలిసినప్పుడు... నా అత్తగారు, నా పిల్లలు అని కాకుండా... బయట జరుగుతున్న విషయాల గురించి ఒక గంట సేపు చర్చించగలిగే చైతన్యం పెంచుకోవాలి. అందరూ ఉద్యోగాలే చేయాలని లేదు. నీకు ఏది ఇష్టం అయితే దాంట్లోనే లోతైన అవగాహన పెంచుకోవాలి.

భావోద్వేగాలను బంధిస్తూ..

ఫొటో ఎలా ఉండాలి?
వెంటాడాలి
బాధో, సంతోషమో...
ఉద్వేగమేదైనా కంటతడి పెట్టించాలి
చూసిన ప్రతిసారి జ్ఞాపకాల దొంతరలను మోసుకు రావాలి
కదిలించాలి..
కార్యోన్ముకులను చేయాలి
ఇవన్నీ కలబోసిన ఫొటోగ్రాఫర్ 'మాధవి కురం'
వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయినా...
బ్రేక్ కోసం ఇష్టమైన ఫొటోగ్రఫీని ఎంచుకున్నారు
క్యాండిడ్ ఫొటోగ్రాఫర్‌గా మంచి బ్రేక్ తెచ్చుకున్నారు
'పిక్ ఏదైనా చూస్తే ఒకసారి మైండ్‌లో ఫిక్సవ్వాలి' అనే
ఆ ఫొటోగ్రాఫర్ పరిచయం ఆమె మాటల్లోనే...

"**నా**న్న ఇంజనీర్... మాది ఆటోమొబైల్ ఇండస్ట్రీస్‌కి మెషీన్స్ తయారు చేసే బిజినెస్. నా చదువంతా హైదరాబాద్‌లోనే. కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేట్‌ని. చదువయ్యాక యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసిన. పదేండ్ల కిందట ఇండియాకు తిరిగి వచ్చాం. అప్పుడప్పుడే డిజిటల్ కెమెరాస్ వస్తున్నాయి. అక్కడి నుంచి వస్తూ వస్తూ ఓ కెమెరా తెచ్చుకున్నాను. ఇక్కడికొచ్చాక మళ్లీ సాఫ్ట్‌వేర్ జాబ్ అయితే సమయం మన చేతిలో ఉండదు. పిల్లలను వేరే వాళ్ల చేతిలో వదిలిపెట్టిపోవడానికి మనసొప్ప లేదు. 13 ఏడ్లు జాబ్ చేసినందుకు బ్రేక్ కావాలనిపించింది. అందుకే ఎక్కడా ఉద్యోగంలో చేరలేదు. పిల్లలను చూసుకోవడం, వాళ్ల ఫొటోస్ తీయడం మొదలుపెట్టాను. నిజానికి నాకు చిన్నతనం నుంచి జర్నలిస్టిక్ పిక్చర్స్ పరిశీలించడం ఎక్కువగా ఇష్టం ఉంటుండే. వార్తల కంటే ఎక్కువగా ఫొటోస్‌ని ఫాలో అయ్యేదాన్ని. ఫొటో ఒక్కటే కథంతా చెప్పడం బాగనిపించేది. ఆ స్టయిల్లో ఫొటోస్ తీస్తే బాగుంటుంది అని ఎన్నోసార్లు అనుకున్నా. ఇష్టం ఉంది. ఇప్పుడు ఖాళీ సమయం కూడా ఉంది. అలాంటి ఫొటోస్ ఎందుకు తీయగూడదని మొదలుపెట్టాను. ఒకే ఆసక్తులు ఉన్న స్నేహితులను కలవడం.. అవతలివాళ్ల దగ్గరనుంచి ఫొటోగ్రఫీ టెక్నిక్స్ నేర్చుకోవడం కొత్త ఎక్స్‌పీరియెన్స్.




నా ఫొటోల్లో నాకు నచ్చేది...

మాగ్నమ్ వర్క్‌షాప్ కోసం ఓ ఓల్డేజ్ హోమ్‌లో ఫొటోస్ తీశాను. చివరి రోజుల్లో ఆ వృద్ధుల కన్నుల్లో ఉన్న ఒంటరితనం నన్ను కదిలించింది. ఇక రంజాన్ టైమ్‌లో చార్మినార్... కన్నుల పండుగ. కానీ మొహర్రం టైమ్‌లో ఒక ఫొటో తీశాను. మొహర్రంలో అందరూ మగవాళ్లు బ్లాక్ డ్రెస్సుల్లో బ్లేడ్స్‌తో కట్ చేసుకుంటున్నారు. ఆ చుట్టూ జరుగుతున్నదాన్ని గమనిస్తున్న ఓ పిల్లాడు... తాను అలాగే చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఆ చిన్నారి అమాయక ముఖంలో ఎన్ని ఉద్వేగాలో. అది నన్నెంతగా కదిలించిందంటే... చిన్న పిల్లల పట్ల మనం ఎలా ఉండాలో నాకు నేర్పించింది. ముస్లింలా, హిందువులా అని కాదు... కానీ మనం చేసే పనులు పిల్లల మీద ఎలాంటి ప్రభావం చూపుతాయో నాకు నేర్పిన ఫొటో అది. అలా జీవితంలో నాకు విలువలు నేర్పిన ఫొటోలు ఉన్నాయి. ఫొటోగ్రఫీ మూలాన జీవితం విలువ తెలుసుకున్న రోజువారీ చూసేవే అయినా పట్టించుకోకుండా పోయినవి.. ఫొటోగ్రాఫర్‌గా గమనించడం మొదలుపెట్టాక... ప్రతి ఫొటో నుంచి ఎంతోకొంత నేర్చుకున్న. ఈ మీడియం ద్వారా నేను ఫొటోలు తీయడం ఏమోగానీ గ్రహించింది చాలా ఎక్కువ.

క్యాండిడ్ ఫొటోగ్రాఫర్‌గా...

నేను ఇక్కడికి వచ్చిన సమయంలోనే మా కజిన్స్ ఒకరి తరువాత ఒకరి పెండ్లి చేసుకోవడం మొదలుపెట్టారు. వాళ్లకి గిఫ్టేమి ఇవ్వాలని ఆలోచించినప్పుడు... పెండ్లి ఫొటోలు తీసి వాళ్లకు ఇస్తే బాగుంటుందనపించింది. అలా ఇద్దరు ముగ్గురికి ఇచ్చాను. ఆ ఫొటోస్ చూసిన వాళ్ల ఫ్రెండ్స్‌కి నచ్చి... 'నా పెండ్లి ఫొటోస్ కూడా తియ్యక్క' అని అడిగారు. సరే అని చేయడం. అంతే ఒక ప్లానంటూ ఏమి లేదు. అయితే ఒక దశలో.. ఎంతో టైమ్ వెచ్చించి, ఎంతో కొంత ఖర్చుపెట్టి చేస్తున్నప్పుడు ఉచితంగా ఎందుకు చేయాలి? అలా ఉచితంగా చేయడం వల్ల నేనేదో పనిలేక చేస్తున్నానని అవతలివాళ్లకు అలుసు కూడా అవుతుంది. అందుకే కొంత ఛార్జ్ చేయడం ప్రారంభించా. అదే ఒక కమర్షియల్ వెంచర్‌లా అయిపోయింది. సరిగ్గా 2008 నుంచి మొదలుపెట్టాను. ఇప్పటిదాకా దగ్గర దగ్గర 200 పెండ్లిళ్లు చేసి ఉంటాను. కానీ మార్కెట్‌ను ఎప్పుడూ ఫాలో అవ్వలేదు. అన్నీ ట్రయల్ ఎండ్ ఎర్రర్‌లో నేర్చుకున్నాను. బయట అడ్వర్టైజింగ్ కూడా ఎక్కువ చేయలేదు. కానీ నేను వర్క్ చేసిన వాళ్ల బంధువులు, వాళ్ల స్నేహితులు ఇలా పరిచయాలతోనే వచ్చే అసైన్‌మెంట్స్ వస్తున్నాయి.





ప్రతిభతోనే మరిన్ని అవకాశాలు...

నేను మొదలుపెట్టాక క్యాండిడ్ ఫొటోగ్రఫీ ఒక ట్రెండ్ లాగా వచ్చింది. కొత్త లెన్సెస్ వచ్చాయి. క్వాలిటీ ఆఫ్ పిక్చర్స్ బాగుంటున్నాయి. కానీ... ఫొటోస్‌లో సున్నితత్వం లేదు. వివిధ రకాల పోజులు, కాలా ఛష్మా... వంటి సంప్రదాయమైనవాటినే కాస్త స్టైలిష్‌గా చేస్తున్నారు. కానీ అది క్యాండిడ్ కాదు. పెండ్లిలో చాలా మధురమైన క్షణాలుంటాయి. కూతురి పెండ్లిలో తండ్రి ఎమోషన్స్... కంట్లో తేమ, నవ్వు, ఆప్యాయత... కొన్ని అమోఘ క్షణాలు ఉంటాయి. రెండు రోజులు ఆ కుటుంబంతో ఇంటరాక్ట్ అయినప్పుడు ఎవరివైపు ఫోకస్ చేయాలని ఒక ఐడియా వస్తుంది. నిజానికి పెండ్లిళ్ల ఫొటోగ్రాఫర్స్ ఎవ్వరూ ఆ ఎమోషన్స్‌ను పట్టుకోరు. ఆ క్షణాలను తిరిగి ఫొటోల రూపంలో ఇచ్చినప్పుడు వాళ్ల కళ్లల్లో ఆనందం అంతా ఇంతా కాదు. నా ప్రతిభే నాకు మరిన్ని అవకాశాలను తెచ్చి పెట్టింది. ఒక దశలో డబ్బులు కాదు... సంతృప్తి ఉందా? ఏమన్నా నేర్చుకోగలమా? అనే భావన వస్తుంది. అందుకే ఇప్పుడు వచ్చిన ప్రతి వెడ్డింగ్ చేయడం లేదు. పర్సనల్ ఫొటోగ్రఫీపై ఎక్కువ ఫోకస్ చేశాను. దానికోసం ప్రముఖ మాగ్నమ్ ఫొటోగ్రాఫర్ చెంగ్ చి చాన్ దగ్గర వర్క్‌షాప్‌కు వెళ్లాను. డాక్యుమెంటరీ టైప్ ఫొటోస్ ఎలా తీయాలనేది నేర్చుకున్నాను. చాలా మంది వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీని ఇష్టపడతారు. కానీ నాకు మనుషులు, మన సమాజంలోని సామూహిక వేడుకలు అంటే ఇష్టం. స్ట్రీట్ ఫొటోగ్రఫీ అన్నా ఇష్టం.



సమాజాన్ని చదవాలి...

మనం తీసిన ఫొటోస్ 15 చూపించి, తరువాత బ్లాంక్ చేస్తే... ఆ పదిహేనులో కొన్ని మదిలో ముద్రించుకుపోతాయి. ఆ ముద్రించుకుపోయేవే అసలైన ఫొటోలు. వాటిని చూసినప్పుడు ఏం అనిపించింది అనేది వదిలేస్తే.. ఏది మనసులో ఉండిపోయింది అనేది ముఖ్యం. చిత్రంలో ఫొటోగ్రాఫర్ దృష్టికోణం చూసేవాళ్లకు అర్థమయ్యిందా లేదా అవసరం లేదు. వాళ్లకో దృష్టి కోణం ఉంటుండొచ్చు. అది వాళ్ల మనసుల్లో మిగిలిపోవడం అనేది మంచి ఫొటో ప్రధాన లక్షణం. ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా కదిలించింది... సిరియన్ బేబీ. బీచ్‌లో బోర్లా పడి ఉన్న బేబీ మృతదేహాన్ని చూసి కంటతడిపెట్టని వారుండరు. దానికింద ఏమీ రాయాల్సిన అవసరం లేదు. జస్ట్ ఫొటోనే తన కథను చెప్పేస్తుంది. ఫొటో పెట్టాక కింద ఏదైనా రాయాల్సిన అవసరం, చెప్పాల్సిన అవసరం రాకూడదు. దానంతట అదే మాట్లాడాలి. అది రావడానికి చాలా టైమ్ పడుతుంది. చాలా ప్రాక్టీస్, నేర్పు, ఓర్పు రావాలి. "మంచి ఫొటోగ్రాఫర్ కావాలంటే... కెమెరా గిమెరా అన్ని పక్కకుపెట్టి ముందు పుస్తకాలు చదువు. నీకు సమాజంపై జ్ఞానం లేకుండా ఏం ఫొటోస్ తీస్తావు? వాటి ద్వారా జనాలకు ఏం చెబుతావ్? ఫొటోగ్రాఫర్‌కు ఒక సామాజిక దృష్టి, ఆర్థిక దృక్పథం చాలా అవసరం. వాటిని అర్థం చేసుకోవాలంటే ముందు నువ్వు చదవాలి" అంటారు ప్రపంచ ప్రఖ్యాత ఫొటోగ్రాఫర్ సెబాస్టియో సలాగో. ఆయన మాటలను బలంగా నమ్ముతాను. మంచి ఫొటోగ్రాఫర్ కావాలంటే సమాజాన్ని చదవాలి.

ప్రతికూలతల నుంచి సైతం...

ఫొటోగ్రాఫర్ మాధవి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మాధవి.. పనిచేసే తీరు ఒక్కటే. పనిపట్ల నిబద్ధత, అంకితభావం ఒక్కటే. అక్కడైనా, ఇక్కడైనా... తెలియనిది నేర్చుకోవాలన్న తపన కూడా ఒక్కటే. కాకపోతే అక్కడ ఒకే తీరు వేరుగా ఉంటుంది. ఇక్కడ ప్రతి క్షణం భిన్నంగా ఉంటుంది. వయసుతోపాటు వచ్చే పరిణితితో పాటు ఫొటోగ్రాఫర్‌గా నేర్చుకున్నాను. అయితే మహిళా ఫొటోగ్రాఫర్‌గా నేను అంత వ్యత్యాసాన్ని ఏమీ చూడలేదు. మగవాళ్లు ఎక్కువ భాగం బయట ఉంటారు కాబట్టి వాళ్లకు ఎక్కువ స్కోప్ ఉంటుంది. మహిళగా నాకు కొన్ని లిమిటేషన్స్ ఉన్నాయి. కానీ మగవాళ్లకు యాక్సెస్‌లేనివి కొన్ని నాకు యాక్సెస్ ఉంటాయి. ప్రతికూలతల నుంచి కూడా సానుకూలతలను తీసుకోవడం నా అలవాటు.

కట్ట కవిత

కడవరకు ఆర్థిక స్వేచ్ఛ కోసం

ఉద్యోగంలో ఉన్నప్పుడు ఓ భరోసా. నెలనెలా క్రమం తప్పని ఆదాయం.. ఎప్పటికప్పుడు పెరిగే వేతనం. పదవీ విరమణ తర్వాత ఇలాంటివి దాదాపు దూరం అవుతాయి. ప్రభుత్వ ఉద్యోగులకు పింఛను, పరిమితులతో కూడిన వైద్య ఖర్చులు అందుతాయి. అందరికీ ఈ వెసులుబాటు ఉన్నా.. లేకున్నా తమకంటూ ఓ కచ్చితమైన ఏర్పాట్లు చేసుకోవాల్సిందే. అప్పుడే నెలనెలా ఇబ్బంది పడకుండా విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడిపేయవచ్చు.

పాత రోజులు గుర్తు చేసుకోండి
వచ్చిన ఆదాయంలో నుంచి కనీసం 10శాతం పొదుపు చేయాలి. ఒక్కసారి మీరు ఉద్యోగం ప్రారంభించిన రోజులు గుర్తుకు తెచ్చుకోండి. అప్పటి నుంచీ ఎంతో కొంత పొదుపు చేయడం వల్లే కదా.. ఇప్పుడు మీరు ఈ స్థాయికి చేరింది? ఆ అలవాటును ఇప్పుడు మానుకోకండి. పదవీ విరమణ తర్వాత వచ్చిన సొమ్ము నుంచి కూడా కొంత పొదుపు



చేయండి. ఆ మొత్తాన్ని సరైన పథకాల్లో మదుపు చేయండి. వృథా ఖర్చులు సాధ్యమైనంత వరకూ కట్టడి చేయండి. దీనివల్ల మీ దగ్గరున్న సొమ్ము కరిగిపోకుండా ఉంటుంది.

ఆరోగ్యం జాగ్రత్త
పెరుగుతున్న వైద్య ఖర్చులు ఆందోళన కలిగిస్తున్నాయి. వయసు పెరిగే కొద్దీ ఆరోగ్య సమస్యలూ పెరుగుతాయి. కాబట్టి, ముందుగా మీరు చేయాల్సిందేమిటో తెలుసా? మీ ఆరోగ్యాన్ని వీలైనంత వరకు కాపాడుకోవడం. అప్పుడే మీ దగ్గరున్న డబ్బు సురక్షితంగా ఉంటుంది. ఉద్యోగంలో ఉన్నప్పుడు టీం ఆరోగ్య బీమా పాలసీలు ఉంటాయి. వీటిని వ్యక్తిగత పాలసీలుగా మార్చుకునే వెసులుబాటు ఉందా? ఒకసారి తెలుసుకోండి. ఆదాయం తగ్గిందనీ, ఖర్చులు తగ్గాయనీ ఆరోగ్య బీమాను విస్మరించడం ఎట్టి పరిస్థితుల్లోనూ సరికాదు. ఇప్పటికే మీరు వ్యక్తిగతంగా పాలసీని తీసుకుంటే దాన్ని కొనసాగించండి.

కాస్త ఆలోచించి...
పదవీ విరమణ చేయగానే కొంత డబ్బు చేతికి వస్తుంది. ఇలాంటప్పుడే చాలా విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. కొడుకులు, కూతుళ్లకూ కొంత మొత్తం ఇవ్వాలనే ఆలోచన ఉంటుంది. మనవడికీ, మనవరాలికీ బహుమతులు ఇవ్వాలనుకుంటారు. గృహోపకరణాల కోసం ఖర్చు చేస్తుంటారు. ఇవన్నీ కూడా కాస్త ఆలోచించి చేయాల్సిన పనులు. అలాగే అధిక వడ్డీ ఆశతో అప్పులు ఇవ్వడం, తెలియని వ్యాపారాల జోలికి వెళ్లడం ఏ మాత్రం శ్రేయస్కరం కాదు.

పెట్టుబడి వృద్ధి కోసం
సురక్షిత పథకాల్లో రాబడికి హామీ ఉంటుంది. కానీ, పెరుగుతున్న ఖర్చులను తట్టుకునేంత రాబడి రాకపోవచ్చు. కాబట్టి, కొంత నష్టభయం ఉన్నప్పటికీ ఈక్విటీ ఆధారిత పెట్టుబడులవైపు చూడటం మంచిది. మీ పెట్టుబడుల్లో 20శాతానికి మించకుండా బ్యాలెన్స్‌డ్ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసే ప్రయత్నం చేయవచ్చు. పెద్ద మొత్తంలో డబ్బు ఉన్నప్పుడు స్థిరాస్తులను కూడా కొనుగోలు చేయవచ్చు. ఇలా చేయడం వల్ల మీ పెట్టుబడి వృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది. మ్యూచువల్ ఫండ్లను ఎంచుకొని, అప్పుడప్పుడూ కొంత మొత్తం రావాలనుకున్నప్పుడు డివిడెండ్ ఆప్షన్‌ను పరిశీలించాలి.

పింఛను రావాలంటే
పదవీ విరమణ తర్వాత క్రమం తప్పకుండా ఆదాయం రావాలని భావించే వారు బీమా సంస్థలు అందించే పథకాలను పరిశీలించవచ్చు. వీటితో పాటు మార్కెట్లో అనేక ఇతర పథకాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ పథకాల్లో మీరు పెట్టిన పెట్టుబడిని బట్టి, హామీతో కూడిన రాబడి నెలనెలా వస్తుంది. మీ తదనంతరం మీ జీవిత భాగస్వామికి కూడా పింఛను అందే ఏర్పాటు చేయవచ్చు. ఇందులో కూడా రకరకాల అవకాశాలున్నాయి. ఇలాంటి పాలసీల వల్ల మీకు ఆర్థిక స్వేచ్ఛ సాధ్యం అవుతుంది.

ఇల్లే రక్ష
మీకు సొంతిల్లు ఉందా? అయితే, అదే మీకు మలి వయసులో కొండంత రక్ష. మీ ఇంట్లో మీరు ఉంటూనే.. దానిని పింఛను ఇచ్చే మార్గంగా మలుచుకోవచ్చు. దీనికోసం బ్యాంకులు అందిస్తున్న ఎదురు తనఖా (రివర్స్ మార్టిగేజ్) పథకాన్ని ఎంచుకోవచ్చు. దీనివల్ల మీ పదవీ విరమణ జీవితాన్ని ఏ ఆర్థిక ఇబ్బందీ లేకుండా గడిపేందుకు అవకాశం ఉంటుంది. మీ దంపతుల తదనంతరం బాకీ మొత్తాన్ని చెల్లించి, మీ వారసులు ఇంటిని తిరిగి తీసుకోవచ్చు. లేదా బ్యాంకు ఇంటిని స్వాధీనం చేసుకుంటుంది. పలు ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు ఉంటే బ్యాంకులు ఈ పథకాన్ని అమలు చేయడానికి అంగీకరించకపోవచ్చు. పూర్తి వివరాల కోసం బ్యాంకులను సంప్రదించండి. ❄

అందాన్ని పెంచే బ్యూటీషియన్స్



ఫ్రూట్స్ అనగానే వాటిని ఆరోగ్యాన్ని పెండే ఆహారంగానే చూస్తాం. కానీ అవి అందాన్ని పెంచే బ్యూటీషియన్స్ అని మీకు తెలుసా? ముఖ్యంగా ఓ అయిదు ఫ్రూట్స్ మన అందానికి చేసే మేలు అంతా ఇంతా కాదు. వాటిని శరీరంలోకి పంపినా, శరీరంపై పూసుకున్నా కూడా మంచిదే.

- అరటిపండ్లలో ఉండే ఉండే ఫైబర్, మినరల్స్, మెగ్నీసియం, పొటాషియం వంటివి కూడా ఎంతో మేలు చేస్తాయి. రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఇమ్యూనిటీని పెంచుతాయి. ఇందులో ఉండే విటమిన్ ఎ, బి, ఇ లు యాంటీ ఏజింగ్ ఏజెంట్ లా పని చేస్తాయి. అందుకే దీన్ని వీలైనంత తీసుకోవాలి. తేనెతో కలిపి అప్పుడప్పుడూ ప్యాక్ కూడా వేసుకుంటే మంచిది.
- కమలాపండులో ఉండే విటమిన్ సి స్కిన్ టెక్సర్‌ను ఇంప్రూవ్ చేస్తుంది. చర్మంపై ఉండే గాయాల్ని, మచ్చల్ని పోగొడుతుంది. కాబట్టి వీటిని తరచూ తినాలి. వీటి తొక్కలు కూడా ఎంతో మంచివి. వీటిని ఎండబెట్టి, పొడి చేసి, నీటిలో కలుపుకుని స్నానం చేస్తే చర్మం మృదువుగా తయారవుతుంది.
- రోజుకో యాపిల్ తింటే డాక్టర్‌కి దూరంగా ఉండొచ్చు అంటారు. డాక్టర్ కే కాదు... బ్యూటీషియన్‌కి కూడా దూరంగా ఉండొచ్చు. ఎందుకంటే అది మన అందాన్ని అంత బాగా కాపాడుతుంది మరి. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్ కంటెంట్ కణాల్ని, టిష్యూస్‌ని డ్యామేజ్ అవ్వకుండా కాపాడుతుంది. మలినాలను తొలగిస్తుంది. అందుకే వీటిని ఎక్కువగా తినాలి. యాపిల్ జ్యూస్‌ని తేనెలో కలిపి ముఖానికి రాసుకుని, ఆరిన తర్వాత కడిగేసుకుంటే తేమ పెరిగి ముఖం కళకళలాడుతుంది. పొడి చర్మం కలవారికి ఇది చాలా మంచిది.
- బొప్పాయిలో పపెయిన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది చర్మానికి చాలా మేలు చేస్తుంది. డెడ్ స్కిన్ సెల్స్‌ని తొలగించి చర్మాన్ని శుభ్రపరుస్తుంది. దీని గుజ్జులో తేనె కానీ పెరుగు కానీ కలిపి రుద్దుకున్నా కూడా చర్మం ఎంతో కాంతివంతమవుతుంది.
- ఇక నిమ్మ గురించి చెప్పేదేముంది? ఇందులో ఉండే విటమిన్ సి చేసే మేలు అంతా ఇంతా కాదు. శరీరంలో వేడిని తగ్గిస్తుంది. మలినాలను తొలగిస్తుంది. చర్మాన్ని, జుత్తుని కాపాడుతుంది. అందుకే దీన్ని వీలైనంత ఎక్కువ తీసుకోవాలి. దీని రసం రాస్తే మొటిమలు, మచ్చలు, ర్యాషెస్ ఏవైనా తగ్గిపోతాయి. తలకి రాస్తే చుండ్రు పోతుంది. జుత్తు బలంగా అయ్యి మెరుస్తూ ఉంటుంది. ❄

గద్వాల సంస్థాన చివరి పాలకురాలు



ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా లోని గద్వాల సంస్థానాన్ని పాలించిన మహారాణి ఆది లక్ష్మీదేవమ్మ. రాజా చిన్న సీతారామభూపాలుని భార్య. ఆయన మరణాంతరం ఆమె సంస్థానం పరిపాలన అధికారాన్ని చేపట్టారు. 1946 నుండి 1949 వరకు గద్వాలను పరిపాలించారు. ఈ సంస్థానం చివరి పాలకురాలు. నిజాం నవాబును ఎదురించిన వీరవనిత. గద్వాల సంస్థానాన్ని స్వతంత్ర సంస్థానంగా ప్రకటించి పరిపాలించారు.

సీతారామభూపాలునికి సంతానం లేకపోవడం వల్ల నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ తమ రాజ్యంలో గద్వాల సంస్థానాన్ని కలుపుకుంటే, రాణి న్యాయపోరాటం చేసి సంస్థానాన్ని తిరిగి చేజిక్కించుకున్నారు. సంస్థానంలో సంప్రదాయంగా వస్తున్న సాహిత్య పోషణను కొనసాగిస్తూ, ఎందరో కవులను ఆదరించారు. కవుల పుస్తకాలను ముద్రించారు. 1949 లో సంస్థానాల, జాగీర్దారుల పాలనలు రద్దు కావటంతో రాణి సంస్థానపు ఆస్తులను, చారిత్రాత్మక గద్వాల కోటను ప్రభుత్వ పరం చేశారు. దాంతో 1663లో రాజా పెద సోమభూపాలుడి పాలనతో ప్రారంభమైన గద్వాల సంస్థానపు పాలన 1949లో మహారాణి ఆదిలక్ష్మీదేవమ్మ పాలనతో ముగిసింది.

ఆమె పేరు మీదుగా గద్వాల కోటలో మహారాణి ఆదిలక్ష్మీదేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇది మహబూబ్ నగర్ జిల్లాలో ఏర్పాటైన మొదటి డిగ్రీ కళాశాల. ❄

నెల్లూరు కోర్టు సంచలన తీర్పు

మహిళ హత్య, దోపిడీ కేసులో నిందితుడికి మరణశిక్ష

నెల్లూరు : వరుస దోపిడీ, హత్యలకు పాల్పడుతూ.. సంచలనం సృష్టించిన నిందితుడికి మరణశిక్ష విధిస్తూ నెల్లూరు నాలుగో అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సంచలన తీర్పు చెప్పారు. మహిళ హత్యకేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు నెల్లూరు జిల్లా కొండాపురం మండలం ఎర్ర బొట్లపల్లి గ్రామానికి చెందిన కుక్కపల్లి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్‌కు న్యాయమూర్తి బి. శ్రీనివాసరావు గురువారం శిక్ష ఖరారు చేశారు.ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నిందితుడు వెంకటేశ్వర్లు 9వ తరగతి వరకు చదివాడు. చదువు సరిగా రాకపోవడంతో హిందూపురంలో ఉంటున్న అత్త వద్దనే ఉండి 7 ఏండ్లు హెటల్లో పని నేర్చుకున్నాడు.

అక్కడ దురలవాట్లు, విలాస జీవితానికి అలవాటుపడ్డాడు. పెళ్లి అనంతరం కావలిలో ఉండి నూడుల్స్ వ్యాపారం చేస్తూ అప్పులపాలయ్యాడు. దీంతో సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో దొంగతనాలకు, దోపిడీలకు పాల్పడేవాడు. ఈ క్రమంలో ఇంట్లో ఒంటరిగా ఉండే మహిళలను లక్ష్యంగా చేసుకొని వారి నుంచి బంగారం, డబ్బు దోచుకునేవాడు. ఈ నేపథ్యంలో హత్యలు కూడా చేసేవాడు. 2016 జులై 9న నెల్లూరు చిల్డ్రన్స్ పార్కు ప్రాంతంలోని ఆడిటర్ నాగేశ్వరరావు ఇంట్లోకి ప్రవేశించి ఆయన భార్య ప్రభావతిని దారుణంగా హత్యచేసి ఆమె నగలను దోచుకెళ్లే ప్రయత్నం చేశాడు. ఇంట్లోనే ఉన్న ఆమె కుమారుడు అనంతకష్ణ, కుమార్తె మాధురీలు అడ్డుపడటంతో వారిపై దాడిచేసి గాయపరిచాడు. అనంతరం బయటకు పారిపోతుండగా అప్పుడే ఇంట్లోకి వస్తున్న నాగేశ్వరరావుకు దొరికాడు.వీరి కేకలు విన్న చుట్టుపక్కల వారు వచ్చి నిందితుణ్ని పట్టుకొని బాలాజీనగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు నిందితుణ్ని అదుపులోకి తీసుకుని హత్యానేరం కింద కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం చార్జిషీటు దాఖలు చేసి కోర్టుకు హాజరుపరిచారు. వారి విచారణలో గతంలో చేసిన మూడు దోపిడీ హత్య కేసులు బయటకు వచ్చాయి. వాటిలో ఒకట్కైన అల్లీపురం గ్రామంలో వృద్ధ దంపతులను హత్యచేసి నగలు దోచుకున్న కేసులో నిందితునికి యావజ్జీవ శిక్ష పడింది. ఇప్పుడు పద్మావతి హత్య కేసులో నేరం రుజువు కావడంతో ఇది అత్యంత హేయమైన చర్యగా భావించిన న్యాయమూర్తి నిందితునికి మరణశిక్ష విధించారు. మరో రెండు కేసులు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి.

ముస్లింలకే మండలి ఛైర్మన్ పదవి

- విజయవాడ, కడపలో హజ్ హౌస్‌లు
- హజ్ యాత్రను ప్రారంభించిన సీఎం చంద్రబాబు

అమరావతి : రాష్ట్ర శాసన మండలి ఛైర్మెన్ పదవి ముస్లింలకే కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ముస్లింల ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సచివాలయం నుంచి ముస్లిం సోదరుల హజ్ యాత్ర బస్సులను ఆయన జెండా ఊపి గురువారం ప్రారంభించారు. హజ్ యాత్రకు వెళ్తున్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ, కడపలో హజ్ హౌస్‌లను ఏర్పాటు చేస్తామన్నారు.

ఇందుకు రూ.12 కోట్లు కేటాయించామన్నారు. కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామన్నారు. 20వేల మంది ముస్లిం ఆడబిడ్డల వివాహాల కోసం రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.2,844 కోట్లు కేటాయించామన్నారు. హజ్ యాత్ర సందర్భంగా రాష్ట్రాభివృద్ధిని కాంక్షిస్తూ ప్రార్థనలు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,810 మందికి హజ్ యాత్రకు ఏపీ నుంచి అవకాశాన్ని కల్పించామన్నారు. గతంలో మక్కా వెళ్ళాలంటే నేరుగా విమానం లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులకు గురికావాల్సి వచ్చేదన్నారు. ఈ సందర్భంగా హజ్ గైడ్ పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎం.ఏ షరీఫ్, ఏపీ హజ్ కమిటీ ఛైర్మన్ మోమిన్ అహ్మద్ హుస్సేన్, సభ్యులు మస్తాన్ షరీఫ్, హాజీ హసన్, భాషా, మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కె.ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుషోలో డబ్బులు పంచుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ



టీడీపీ కార్యకర్తపై చెయ్యి చేసుకుంటున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

బాలయ్యా ఇదేం పనయ్యా!

బావకు తిప్పలు తెచ్చిన మరిది ప్రచారం

నంద్యాల : ముఖ్యమంత్రి చంద్రబాబుకు బావమరిది, వియ్యంకుడు కూడా అయిన ప్రముఖ సినీ హీరో, హిందూపురం ఎంఎల్ఏ బాలకృష్ణ నంద్యాల నియోజకవర్గంలో చేసిన ఎన్నికల ప్రచారం తెలుగుదేశం పార్టీకి కొత్త సమస్యలను తెచ్చిపెట్టింది. తెలుగుదేశం పార్టీ తరపున స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న బాలయ్య ప్రచారంపై ఆ పార్టీ శ్రేణులు చాలా ఆశలు పెట్టుకున్నాయి. దీనికి తగ్గట్టుగానే ఆయన టూర్ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. బుధవారమంతా ఆయన ప్రచారం జోరుగానే సాగింది. తనదైన పంచ్‌మార్కు డైలాగులతో బాలయ్య కార్యకర్తల్లో హుషారు నింపడంతో పాటు, ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నమూ చేశారు. అయితే, ఇదంతా నాణానికి ఒక వైపు మాత్రమే! 'చూడు.. ఒకవైపే చూడు... రెండోవైపు చూడొద్దు..' అంటూ ఏదో సినిమాలో బాలయ్య ప్రఖ్యాత డైలాగు మాదిరిగానే మరోవైపు దీనికి భిన్నమైన పరిస్థితి నెలకొంది. ప్రచార పర్వం ముగిసిన తరువాత రాత్రి నంద్యాలలోని లాడ్జికి బస చేయడానికి వచ్చిన బాలయ్య తనకు పూలమాల వేసి, ఫోటో దిగడానికి ప్రయత్నించిన ఒక అభిమానిపై విరుచుకుపడ్డాడు. చెంప చెళ్లుమనిపించాడు. అనూహ్యంగా జరిగిన ఈ పరిణామంతో అక్కడ ఉన్న నాయకులు, అభిమానులు నివ్వెరపోయారు. ఈ సంఘటన జరిగినప్పుడు అక్కడ మీడియా ప్రతినిధులు ఎవ్వరూ లేరు. బాలయ్య చర్యతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఆయన అభిమానులు, టీడీపీ కార్యకర్తలే బాలకృష్ణ తీరును సెల్‌ఫోన్లో చిత్రీకరించి, ఆన్‌లైన్‌లో పెట్టారు. ఈ విషయం చర్చనీయాంశమవుతుండగానే ప్రచార పర్వంలో బాలకృష్ణ కొంతమదికి డబ్బులు పంచుతున్న ఫోటోలు వెలుగులోకి వచ్చాయి. ఎక్కడ, ఎప్పుడు జరిగిందన్న విషయం స్పష్టంగా తెలియకపోయినప్పటికీ వందరూపాయ నోట్లను పట్టుకుని, మరో చేత్తో ఒకొక్కటి పంచుతున్నట్లుగా ఫోటోలోఉంది. అయితే, ఎన్నికల ప్రచారమన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది. గురువారం ఈ విషయం మీడియాలో చర్చనీయాంశం కావడంతో ఎన్నికల కమిషన్ సూమోటోగా కేసు నమోదు చేసింది. నోడల్ ఆఫీసర్‌ను విచారణ చేయాలని ఆదేశించింది.

అగ్రిగోల్డ్ బాధితులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం : రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు

తాడేపల్లి : అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై మూడేళ్లుగా ఉద్యమిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన చేపట్టిన అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్ర రెండో రోజు గురువారం శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస మండలాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయస్థానాన్ని మోసగించేందుకు అగ్రిగోల్డ్ యాజమాన్యం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పోలీసుల లాఠీఛార్జీకి, కేసులకు భయపడబోమని, తామే ముందుండి పోరాడుతామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు.

కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి నాగలక్ష్మి, జిల్లా అధ్యక్షులు మొజ్జాడ జయసింహ, పలువురు ఏజెంట్లు, బాధితులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధిత కుటుంబానికి సీపీఐ నేత రామకృష్ణ పరామర్శ

అగ్రిగోల్డ్ బాధితుడు మనస్థాపంతో మృతిచెందిన నేపథ్యంలో గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మృతుడు వేముల రాజశేఖర్ కుటుంబాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు. బాధితుల డబ్బు వచ్చే విధంగా చూడటంతోపాటు రాజశేఖర్‌కు రావాల్సిన సొమ్మునూ తెప్పించడానికి కృషి చేస్తామని చెప్పారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలనే అంశంపై ఇచ్ఛాపురం నుండి హిందూపురం వరకూ సీపీఐ ఆధ్వర్యంలో బస్సు యాత్ర చేస్తున్నట్లు చెప్పారు. అగ్రిగోల్డ్ నిర్వాకంతో రాష్ట్రవ్యాప్తంగా 142 మంది చనిపోయారని, సంస్థ ఆస్తులమ్మి బాధితులకు న్యాయం చేయాలని కోర్టు ఆదేశించినా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. వేముల రాజశేఖర్ కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అతని పిల్లల చదువులకూ ప్రభుత్వం సాయం చేయాలని కోరారు.

సీఎం కార్యక్రమానికే కరెంటు లేదు..



విజయవాడలో జరుగుతున్న హార్టికల్చర్ ఎగ్జిబిషన్ తిలకించేందుకు వచ్చిన సీఎం చంద్రబాబుకు అరుదైన అనుభవం ఎదురైంది. ఆయన హార్టికల్చర్ ఎగ్జిబిషన్‌కు రాగానే కరెంటు సరఫరా నిలిచిపోయింది. చేసేదేమిలేక టార్చ్‌లైట్ వెలుగులోనే సీఎం ఎగ్జిబిషన్ తిలకించారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు



నిడదవోలు : కారు బ్రేక్ ఫెయిల్ కావడంతో పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు మండలం మద్దూరు వద్ద పశ్చిమ డెల్టా గోదావరి ప్రధాన కాలువలోకి దూసుకెళ్లింది. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన శివ సుబ్రహ్మణ్యం తన వ్యక్తిగత పనుల నిమిత్తం గురువారం రాజమహేంద్రవరం నుంచి నిడదవోలుకు కారులో బయలుదేరారు. ఆ కారు నిడదవోలు మండలం మద్దూరు వద్దకు వచ్చేసరికి బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో కారు ఒక్కసారిగా అదుపుతప్పి మద్దూరు వంతెన సమీపంలోని కాలువలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో కారులో ఉన్న శివసుబ్రమణ్యం కారులోంచి బయటకు వచ్చి ఈతకొట్టుకుంటూ బయటపడ్డాడు. సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన శివ సుబ్రహ్మణ్యం ఈ సంఘటనపై ఎస్ఐ కె.నరేంద్రకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, స్థానికులు కారును కాల్వలోంచి బయటకు తీశారు.

'కాకినాడ' ఎన్నికలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

తుది తీర్పుకు లోబడే ఫలితాలు

హైదరాబాద్ : కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికల నిర్వహణకు హైకోర్టు నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. ఎన్నికలను నిలిపివేస్తూ స్టే ఉత్తర్వులు జారీ చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. అయితే ఎన్నికల ఫలితాలు తాము వెలువరించే తుది తీర్పుకు లోబడి ఉండాలని న్యాయమూర్తి తన మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డివిజన్ల పునర్విభజన, రిజర్వేషన్ల ఖరారు, మేయర్ అభ్యర్థి రిజర్వేషన్లను సవాల్ చేస్తూ దాఖలైన మూడు వేర్వేరు వ్యాజ్యాలను న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. ప్రతివాదులైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లను దాఖలు చేయాలని గురువారం హైకోర్టు న్యాయమూర్తి పి.నవీన్‌రావు ఆదేశించారు. ఎన్నికలు ఆపాలంటూ రెండు, మేయర్ రిజర్వేషన్‌పై స్పష్టత ఇవ్వాలంటూ దాఖలైన మరో వ్యాజ్యంపై హైకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. తొమ్మిది గ్రామాలను విలీనం చేసి అక్కడి జనాభా, ఓటర్లను పరిగణనలోకి తీసుకొని 50 వార్డులుగా విభజించి రిజర్వేషన్లు ఖరారు చేశారని, ఆ తర్వాత హైకోర్టు మూడు గ్రామాల విలీనాన్ని నిలిపివేయడంతో 48 డివిజన్లకే ఎన్నికలు నిర్వహిస్తున్నారని, దీని ప్రభావం రిజర్వేషన్లపై ఉంటుందంటూ పిటిషనర్ చేసిన వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది.

భూసేకరణ చట్టానికి లోబడి ఒప్పందాలు


తెలంగాణ సర్కారుకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్ : భూసేకరణ చట్టానికి తెలంగాణ సర్కార్ సవరణలు తెచ్చిన ప్రకారం రైతుల అభ్యంతరాలు పెండింగ్‌లో ఉండగానే ఇతర రైతులతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోవచ్చునని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్‌బెంచ్ స్పష్టం చేసింది. అయితే రైతులతో చేసుకునే ఒప్పందాలు భూసేకరణ సవరణ చట్టం 2017లోని నిబంధలకు లోబడి ఉండాలని తేల్చి చెప్పింది భూసేకరణపై రైతుల అభ్యంతరాల్ని సత్వరమే పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని పేర్కొంది. ములుగు మండలం మామిడ్యాల గ్రామస్తులు శ్రీనివాస్ ఇతర రైతులు వేసిన వ్యాజ్యాన్ని గురువారం బెంచ్ విచారించింది. 2013 భూసేకరణ చట్టానికి సెక్షన్ 30–ఎ చేరుస్తూ తెలంగాణ ప్రభుత్వం సవరణ చేసిన ప్రకారం రైతులతో ఒప్పందాలు చేసుకోవచ్చునని అడ్వకేట్ జనరల్ డి. ప్రకాశ్‌రెడ్డి వాదించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించే కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ నిమిత్తం బైలాంపూర్, తానేదార్‌పల్లి, తానేదార్‌పల్లి తండా, మామిడ్యాల రైతుల అభ్యంతరాలు పెండింగ్‌లో ఉండగానే ఇతర రైతులతో ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నదని పిటిషనర్ న్యాయవాది వాదించారు.

పద్మ అవార్డుల ఎంపికలో సంస్కరణలు..ప్రధాని

న్యూఢిల్లీ. గతంలో పద్మ పురస్కారాలు ఎలా దక్కేవో అందరికీ తెలుసునని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన యువ పారిశ్రామికవేత్తల సదస్సులో ఆయన ప్రసంగించారు. పద్మ అవార్డులకు ఎంపిక చేసే విధానంలో తాము సంస్కరణలు తీసుకొచ్చినట్టు చెప్పారు. ప్రస్తుతం పద్మ అవార్డుల కోసం ఏ వ్యక్తి అయినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ప్రస్తుతం ఎవరికీ తెలియని వారు హీరోలుగా గుర్తింపు పొందుతున్నారని అన్నారు. ప్రతి పౌరుడు దేశం కోసం ఎంతోకొంత తోడ్పాటునందించాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వంలో విధానాలు రూపకల్పన చేయగలిగే యువతతో సమావేశమయ్యానంటూ మోడీ తెలిపారు.. దేశం కోసం యువతతో పాటు సీనియర్లు కూడా కలిసిమెలిసి పనిచేయాలని కోరారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో 40కేజీల గంజాయి పట్టివేత



నవ తెలంగాణ–ఖమ్మంటౌన్

ఖమ్మం జిల్లా మధిర వద్ద కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో 40 కేజీల గంజాయిని రైల్వే పోలీసులు గురువారం పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం... డీజీ కృష్ణ ప్రసాద్, సికింద్రాబాద్ రైల్వే ఇన్‌చార్జి ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు ఖమ్మం లైన్ ఐఆర్పీ చంద్రభాను ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా రైళ్లలో ఆపరేషన్ మొదలుపెట్టారు. ఇదే క్రమంలో గురువారం ఖమ్మం జిల్లా మధిర వద్ద కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో సోదాలు చేశారు. సీట్ల కింద వాటిని బయటికి తీసి పరిశీలించగా ఒక దానిలో 11కేజీలు, మరో మూడు సంచుల్లో ఒక్కో సంచిలో 10కేజీల చొప్పున గంజాయిని గుర్తించారు. అవి తీసుకెళుతున్న ఒరిస్సాకు చెందిన రంజన్ కుమార్ సాహు, గీతాంజలి సాహు, రంజూక్ల సాహులను అదుపులోకి తీసుకుని ఖమ్మం స్టేషన్‌లో దించారు. ఈ తనిఖీల్లో టి.బాలస్వామి, సతీష్, నర్సింహారావు పాల్గొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

అట్టహాసంగా 'పైసా వసూల్' ఆడియో ఆవిష్కరణ

- డబుల్ సెంచరీ పక్కా సాధిస్తుంది: బోయపాటి
- వరుణుడి రాకతో అరగంట అంతరాయం
- పోలీసుల అత్యుత్సాహంతో ఇబ్బందులు పడ్డ అభిమానులు
- మీడియాను కూడా అనుమతించని వైనం..



నవతెలంగాణ–రఘునాథపాలెం


గాయత్రీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత వద్దిరాజు రవిచంద్ర సౌజన్యంతో, ఆదిత్య మ్యూజిక్, శ్రేయాస్ మీడియా ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బాలకృష్ణ నటించిన 101వ చిత్రం 'పైసా వసూల్' ఆడియో ఆవిష్కరణ గురువారం అట్టహాసంగా జరిగింది. ఖమ్మం జిల్లా వాస్తవ్యులైన వెనిగల ఆనందప్రసాద్ నెలకొల్పిన భవ్య క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఈ సినిమా రూపుదిద్దుకొంది. గతంలో నిర్మాణ రంగంలో ఉన్న ఆనంద్ ప్రసాద్ సినిమాపై మక్కువతో నిర్మాతగా మారి భవ్య క్రియేషన్స్ బ్యానర్‌ను నిర్మించి ఆ బ్యానర్‌పై శౌర్యం, నీకు నాకు డాష్ డాష్, లౌక్యం, శమంతకమణి లాంటి హిట్ చిత్రాలు నిర్మించారు. అదే కోవలో బాలయ్యతో 101వ చిత్రంగా 'పైసా వసూల్ ' సినిమాను నిర్మించారు. భాస్కర భట్ల లిరిక్ రైటర్ కాగా అనూప్ రూబెన్స్ సంగీతాన్ని అందించారు. "వసూళ్లు వసూళ్లు.. పైసా వసూళ్లు..", "కన్ను కన్ను కలిశాయి..."పాటలను వేదికపై వినిపించారు. ఈ సినిమాలో మామా మామా అనే పాట బాలకృష్ణ పాడటం విశేషం. ఈ సీడీలను దర్శకులు బోయపాటి శ్రీను, టీడీపీ నాయకులు నామా నాగేశ్వరరావు ఆవిష్కరించి తొలి సీడీని హీరో బాలకృష్ణకు అందచేశారు. ఈ సందర్భంగా సినీ దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ హీరోలో ఉన్న హీరోయిజాన్ని బయటకు తీసుకురావడంలో పూరీ జగన్నాథ్ అందెవేసిన చేయి అని, ఇందుకు ఉదాహరణే మహేష్‌బాబు నటించిన పోకిరి సినిమా అన్నారు. అనంతరం హీరో బాలకృష్ణ మాట్లాడుతూ.. ఎన్‌టీఆర్ స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని అందించడమే మా కుటుంబ ధ్యేయం అని చెప్పారు. నిర్మాత ఆనంద్ ప్రసాద్ జిల్లా వ్యాస్తవ్యులు అయినందున ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటు చేశామని, భద్రాచలం శ్రీరామచంద్రుడి ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. 101వ చిత్రమైనప్పటికీ తొలి చిత్రంగా భావిస్తూనే చేశానని అన్నారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి దర్శకులు క్రిష్, హీరోయిన్లు చార్మి, శ్రీయ, కైరా, పృథ్వీరాజు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అలీ, యాంకర్ శ్రీముఖితో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు.

వరుణుడి రాకతో అరగంట పాటు అంతరాయం

ఖమ్మం నగరంలో గతంలో ఎన్నడూ లేనంత భారీ అంచనాలతో ఈ కార్యక్రమానికి కొద్ది రోజులుగా టెక్నీషియన్లు శ్రమించి సెట్టింగులు వేశారు.

అంచనాలకు మించి బాలకృష్ణ అభిమానులు, ఖమ్మం నగరవాసులు హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభమైన కొద్ది సేపటికే వర్షం రావడంతో కొంత అంతరాయం కలిగింది. అనంతరం లైట్లు, మైక్ పనిచేయకపోవడంతో దాదాపు అరగంటకు పైగా ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. పోలీసుల అత్యుత్సాహంతో బాలకృష్ణ అభిమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతేగాకుండా మీడియాకు సైతం అనుమతి ఇవ్వకపోవడంతో పలువురు వెనక్కి తిరిగి వెళ్లిపోయారు.

టెక్స్‌టైల్ పార్కు స్థలంలో కొరియా బృందం



పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న కొరియా బృందం సభ్యులు, వరంగల్ రూరల్ జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్


నవతెలంగాణ–వరంగల్

వరంగల్ రూరల్ జిల్లా గీసుగొండ, సంగెం మండలాల్లో ఏర్పాటుచేస్తున్న మెగా టెక్స్‌టైల్ పార్కు స్థలాన్ని కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీస్ చైర్మెన్ కిహక్ సంగ్ నేతృత్వంలో ప్రతినిధుల బృందం గురువారం సందర్శించింది. పార్కులో పరిశ్రమల స్థాపనకు సాధ్యాసాధ్యాలను పరిశీలించింది. రవాణా సౌకర్యం, నీటి లభ్యత, విద్యుత్ సౌకర్యం, చేనేత కార్మికుల సంఖ్య తదితర అంశాలను చైర్మెన్ కిహక్ సంగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇండస్ట్రియల్ పార్కు ప్లాన్‌ను కొరియా బృందం వివరించింది. ఈ సందర్భంగా విభజించిన బ్లాకులలో కొన్ని మార్పులు చేయాలని సూచనలు చేశారు. ఒక్కో బ్లాక్ మధ్యలో రెండు వరుసల రహదారి ఏర్పాటు చేయాలని పార్కులో రైల్వేట్రాక్ వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున రైల్వేఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సూచించారు. సివిల్ నిర్మాణాలకు ఎక్కువ నిధులు వృథా చేయకుండా ఉపాధి, ఉత్పత్తులపై దృష్టి సారించాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ అభివృద్ధి సాధించేలా ప్రయత్నం చేయాలన్నారు. బృందానికి టీఎస్ ఐఐసీ ఎండీ వెంకటనర్సింహారెడ్డి, ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ క్లస్టర్ ఎండీ ఆర్ సీఎం రెడ్డి ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుపై బృందానికి వివరించారు. ఈ సందర్భంగా వరంగల్ రూరల్ జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమల స్థాపనకు అవసరమైన సదుపాయాలన్నీ కల్పిస్తామన్నారు. రవాణా వ్యవస్థ మెరుగ్గా ఉందని, ఆరు లైన్లలో ఔటర్ రింగ్‌రోడ్డుకు పనులు జరుగుతున్నాయని తెలిపారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సారెస్పీ కాలువ ద్వారా ప్రతిరోజూ నీరందించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం హరిత, మెగా టెక్స్‌టైల్ పార్కు డైరెక్టర్ మిహిర్ పరేఖ్, టీఎస్ ఐఐసీ జోనల్ మేనేజర్ రతన్ రాథోడ్, పరిశ్రమల శాఖ జీఎం హరిప్రసాద్, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్ ఏడీ, వరంగల్ రూరల్ ఆర్డీఓ మహేందర్‌జీ పాల్గొన్నారు.

టీఆర్ఎస్‌లోనే గజ దొంగలు

- దళితులను దొంగలుగా ముద్రవేసి చంపుతున్నారు
- దళితుల ఉనికి, ఆత్మగౌరవంపై దాడులు: ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

నవతెలంగాణ–మణుగూరు



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

టీఆర్ఎస్ ప్రభుత్వంలోనే గజ దొంగలను ఉంచుకొని, దళితులను జేబు దొంగలుగా ముద్రవేసి లాకప్ డేత్ చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మందా జగన్నాథం కుమారుడి వివాహానికి గురువారం ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఎల్లారెడ్డిపేటలో బుడగ జంగాల యువకుడు వెంకటేష్‌పై థర్డ్ డిగ్రీ ప్రయోగించి ప్రాణాలు తీశారని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న గజ దొంగలను కేసీఆర్ వెనకేసుకొస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో దళితుల ఉనికి, ఆత్మగౌరవం, ప్రాతినిధ్యం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఉమ్మడి రాష్ట్రం మంత్రివర్గంలో దళితులకు ఏడుశాతం ప్రాతినిధ్యం ఉండేదన్నారు. నేడు 18 శాతం వున్న దళితులకు ప్రాతినిధ్యం లేకపోవడం దారుణమన్నారు. భారతదేశంలోనే అతి పెద్ద బడ్జెట్ శాఖ సాంఘిక సంక్షేమ శాఖ అన్నారు. ఏ రాష్ట్రంలో అయినా దళితులే సంక్షేమ శాఖకు మంత్రిగా ఉంటారన్నారు. కానీ, రాష్ట్రంలో 14 మంది దళిత ఎమ్మెల్యేలు ఉండగా అగ్రకులస్తులకు సాంఘిక సంక్షేమ శాఖను అప్పగించడం దారుణమన్నారు. ప్రభుత్వ భూముల పేరుతో 50వేల ఎకరాల భూములను లాక్కున్నారన్నారు. ఎల్లారెడ్డిపేట ఘటనపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడుల కంటే తెలంగాణలోనే ఎక్కువ జరుగుతున్నాయని ఆరోపించారు. డీజీపీ నివేదిక ప్రకారమే.. 524 దాడులు జరగాయన్నారు. రాష్ట్రంలో మూడెకరాల భూమి పంచకపోయినా, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పదవికి దళితులను నియమించాలని, ఎల్లారెడ్డిపేట ఘటనపై న్యాయ విచారణ జరపాలని, లేదంటే రాబోయే కాలంలో ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

పిల్లలతో సహా తల్లి ఆత్మహత్య

- బాసరలో విషాదఛాయలు

నవతెలంగాణ–ముధోల్/డిచ్‌పల్లి

అనారోగ్య సమస్యలతో పిల్లలతో సహా తల్లి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ముక్కుపచ్చలారని పిల్లల మృతదేహాలను చూసి పలువురు కంటతడి పెట్టుకున్నారు. ఈ హృదయ విదారక ఘటన నిర్మల్ జిల్లాలోని బాసరలో గురువారం వెలుగు చూసింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం... కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలానికి చెందిన ఆరె రాముతో నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం బర్దిపూర్‌కు చెందిన అర్చన(27)కు పదేండ్ల కింద పెండ్లైంది. ఏడాది పాటు భిక్కనూరులోనే ఉన్నారు. భర్త దుబాయ్‌కి వెళ్లడంతో పుట్టింటి వద్ద ఉంటున్నది.

అర్చన తన కొడుకు కీర్తిరాజు (4నెలలు) ఆరోగ్యం బాగాలేకపోవడంతో కూతురు దీక్షిత(7), తల్లి సుజాతతో కలిసి బుధవారం ఉదయం నిజామాబాద్ నగరంలోని ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లింది. వైద్యులు పరీక్షలు నిర్వహించగా బాలునికి నిమోనియా ఉన్నట్టు నిర్ధారించారు. తన తల్లిని కొబ్బరి బోండాలు తీసుకురావాలని సుజాత పంపించింది. తల్లి వెళ్లిపోగానే...పిల్లలను వెంటబెట్టుకుని అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఆమె తల్లి ఎంతవెతికినా కూతురు, పిల్లలు కనిపించలేదు. అదేరాత్రి 9 గంటల ప్రాంతంలో అర్చన మామ ప్రభాకర్ ఫిర్యాదు మేరకు నిజామాబాద్ వన్‌టౌన్ పోలీసులు అదృశ్య కేసు నమోదు చేశారు. గురువారం ఉదయం బాసర వద్ద గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాలు తేలాయి. విషయం తెలుసుకున్న సుజాత బంధువులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాలను చూసి తమ కుటుంబీకులేనని గుండెలు బాదుకున్నారు. గ్రామస్తులు, జాలర్ల సాయంతో మృతదేహాలను బయటకు తీశారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ముధోల్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ అందె రాములు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కొంతకాలంగా ఆమె మానసికస్థితి బాగోలేదని, భర్త బతుకుదెరువు నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లడంతో మానసికంగా కుంగిపోయిందని బంధువులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

పుతిన్ విదేశాంగ విధానాలు అదుర్స్



అమెరికా మిత్రదేశాల పౌరుల్లోనూ ఇదే అభిప్రాయం : ప్యూ రీసర్చ్ సెంటర్

మాస్కో : విదేశీ వ్యవహారాలను చక్కబెట్టే విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కంటే రష్యా అధ్యక్షుడు పుతిన్‌పైనే ఎక్కువ మందికి నమ్మకం ఉందని యూఎస్‌కు చెందిన ప్యూ రీసర్చ్ సెంటర్ పేర్కొన్నది. ఆ సంస్థ తాజా నివేదిక ప్రకారం...అమెరికా మిత్రదేశాలైన జర్మనీ, ఫ్రాన్స్, జపాన్, దక్షిణి కొరియా దేశాలు పుతిన్ విదేశాంగ విధానాల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఈయూలోని ఏడు దేశాలు రష్యా అధ్యక్షుడి విధానాలనే ఇష్టపడుతున్నాయి. మొత్తం 36 దేశాల్లో సర్వే నిర్వహించినట్టు ఆ సంస్థ తెలిపింది. 22 దేశాల్లో పుతిన్‌నే విశ్వసిస్తున్నట్టు తేలింది. కాగా.. 13 దేశాల్లోని ప్రజలు ట్రంప్‌పైన ఎక్కువ నమ్మకంగా ఉన్నారు. బ్రిటన్, భారత్, ఇజ్రాయిల్ లాంటి దేశాల్లో ట్రంప్‌ను విశ్వసిస్తున్నట్టు చెప్పారు. ఒక్క టాంజానియాలో మాత్రం ఇరువురికి సమాన ఓట్లు వచ్చాయి. కాగా, చైనాను మాత్రం ఈ దేశాల జాబితాలో చేర్చలేదు. ఫిబ్రవరి16 నుంచి మే8 మధ్య ఈ సర్వే నిర్వహించారు. కాగా అమెరికాలోనూ ఈ సర్వే నిర్వహించగా.. 23 శాతం మంది ప్రజలు పుతిన్‌ను, 53శాతం మంది ట్రంప్‌ను విశ్వసిస్తున్నట్టు చెప్పారు. రష్యాకు వ్యతిరేకంగా ఉన్న బిల్లుపై ఇటీవల ట్రంప్ సంతకం చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య సంబంధాలు బెడిసికొట్టాయి.రష్యాలోని తమ దౌత్యాధికారులను అమెరికా తగ్గించుకోవాలని ఇటీవల పుతిన్ ఆదేశించారు. అయితే దీనిపై ట్రంప్ కూడా అదే స్థాయిలో స్పందిస్తూ.. ఖర్చు తగ్గించినందుకు కృతజ్ఞతలంటూ పుతిన్‌పై విమర్శలు చేశారు.

బుర్ఖాలో సెనెట్‌కు హాజరు..ఆపై నిరసన

- ఆస్ట్రేలియాలో బుర్ఖా నిషేధించాలని సెనేటర్ హాన్సన్ డిమాండ్



సిడ్నీ : బహిరంగ ప్రదేశాల్లో బుర్ఖా పద్దతిని నిషేధించాలని మితవాద భావజాలమున్న వన్‌నేషన్ పార్టీకి చెందిన సెనేటర్ పౌలిన్ హాన్సన్ డిమాండ్ చేశారు. కేన్‌బెర్రాలోని పార్లమెంట్ భవనానికి బుర్ఖాతో వచ్చి నిరసన తెలిపారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో ప్రస్తుతం వైరల్‌గా మారింది. హాన్సన్ తీరు పట్ల నెటిజన్లు మండిపడుతున్నారు. ముస్లింల మనోభావాలను కించపరిచే విధంగా హాన్సన్ ప్రవర్తించారని విమర్శిస్తున్నారు. ఆస్ట్రేలియా సెనెట్ వెల్లడించిన వివరాల ప్రకారం..సెనెట్ భవనంలోకి హాన్సన్ బుర్ఖాతో ప్రవేశించారు. సెనెట్‌కు అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న అటార్నీ జనరల్ జార్జి బ్రాండిస్ ముందు బుర్ఖా తొలగించారు. దేశ వ్యాప్తంగా బుర్ఖాను నిషేధించాలని డిమాండ్ చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా ఆస్ట్రేలియాలో బుర్ఖా పద్దతిని నిషేధించేలా చర్యలు చేపట్టాలని అటార్నీ జనరల్‌ను కోరారు. దీనిపై స్పందించిన అటార్నీ జనరల్...హాన్సన్ తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. హాన్సన్ ప్రవర్తన ముస్లింల భావాలను అగౌరవపరిచే విధంగా ఉన్నదన్నారు.

ఖతార్ సరిహద్దును తెరవండి


- సౌదీ రాజు సల్మాన్ ఆదేశాలు



రియాద్: తీవ్ర దౌత్య సంక్షోభంలో కూరుకుపోయిన ఖతార్ ఊరట లభించింది. హజ్ యాత్రికుల కోసం ఖతార్ సరిహద్దును తెరవాలని సౌదీ అరేబియా రాజు సల్మాన్ ఆదేశించారు. అంతేగాకుండా, ఖతార్‌లోని మక్కా యాత్రికుల కోసం ప్రత్యేక జెట్ విమానాలను కూడా సౌదీ నుంచి దోహాకు పంపించనున్నట్టు చెప్పారు. దీంతో, సౌదీతో ఖతార్ దౌత్య సంబంధాలు పునరుద్ధరించుకునేందుకు తొలి అడుగు పడినట్టయింది. ఉగ్రవాదానికి మద్దతిస్తున్నారని ఆరోపిస్తూ సౌదీ అరేబియా సహా నాలుగు అరబ్ దేశాలు ఖతార్‌తో తెగదెంపులు చేసుకున్న విషయం తెలిసిందే. జూన్5 నుంచి సౌదీ, ఈజిప్టు, బహ్రెయిన్, యునైట్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) దేశాలు ఖతార్‌తో దౌత్య సంబంధాలు తెంచుకున్నాయి. ఖతార్‌తో ఉన్న అన్ని సరిహద్దులను సౌదీ మూసివేసింది. ఆ దేశానికి వెళ్లే రోడ్డు, రైలు, వైమానిక రవాణా సదుపాయాలను నిలిపివేసింది. దీంతో, అప్పటి నుంచి ఖతార్ తీవ్ర దౌత్య సంక్షోభంలో కూరుకుపోయింది. ఖతార్‌తో సంబంధాలను పునరుద్ధరించుకోవాలంటే తమ డిమాండ్లను అంగీకరించాలని సౌదీ సహా నాలుగు అరబ్ దేశాలు పేర్కొన్నాయి. అయితే, వీటికి ఖతార్ అంగీకరించలేదు. మరోవైపు తమ దేశం నుంచి మక్కాకు యాత్రికులను అనుమతించకుండా సౌదీ హజ్ యాత్రకు హాని కల్గిస్తోందని ఖతార్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో యాత్రికుల కోసం సరిహద్దును తెరవాలని సౌదీ రాజు ఆదేశించడం గమనార్హం.


మీ పని చూసుకోండి

- ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం ఇకనైనా మానుకోండి : ట్రంప్ సర్కార్‌కు ఖొమైనీ హితవు



టెహ్రాన్ : ' ముందు మీ పని చూసుకోండి. చార్లొట్స్‌విల్లే వంటి ఘటనలు అమెరికాలో పునరావృతం కాకుండా చూసుకోండి. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం ఇకనైనా మానుకోండి. మీకున్న శక్తిని దేశాన్ని చక్కబెట్టుకునేందుకు ఉపయోగించుకోండి' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఉద్దేశించి ఇస్లాం మతపెద్ద అయాతుల్లా ఖొమైనీ ట్వీట్ చేశారు. కాగా, గతవారం వర్జీనియాలోని చార్లొట్స్‌విల్లే ప్రాంతంలో నిరసనకారులపైకి కారు దూసుకుపోయిన ఘటనలో ఓ మహిళ మృతి చెందగా, 19 మంది తీవ్రంగా గాయపడ్డ సంగతి తెలిసిందే. ఈ ఘటనను ఉద్దేశించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ ఘటనలో రెండు వర్గాల తప్పుందని అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలను ఖొమైనీ విమర్శించారు. అమెరికాలో శ్వేతజాతీయులు మరో వర్గీయుల పట్ల వివక్ష కనబరుస్తున్నారని అన్నారు. అమెరికాలో జాత్యహంకార భావాలు పెరిగిపోయాయని అన్నారు. ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత యూఎస్‌లో హక్కుల ఉల్లంఘన ఘటనలు పెరిగిపోయాయని విమర్శించారు.

కిమ్ తెలివైనవారు...ట్రంప్ ప్రశంస



వాషింగ్టన్ : అమెరికా, ఉత్తరకొరియా మధ్య ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణగడంతో అమెరికా భూభాగమైన గువామ్ వైమానిక స్థావరంపై క్షిపణి దాడి చేయాలన్న ప్రణాళికలను ఉ.కొరియా విరమించుకుంది. దీంతో, ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం కాస్త కుదుటపడింది. ఈ నేపథ్యంలో ఉ.కొరియా నిర్ణయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ.. ఆ దేశాధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను ప్రశంసించారు. 'కిమ్ చాలా తెలివైన, సరైన నిర్ణయం తీసుకున్నారు. క్షిపణి దాడి ఆలోచన విపత్కరమే గాక, ఆమోదయోగ్యం కానిది కూడా' అని ట్రంప్ ట్వీట్ చేశారు. అమెరికా భూభాగమైన గువామ్‌పై క్షిపణి దాడి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఉత్తరకొరియా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా మండిపడ్డారు. ఉ.కొరియా తన తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో గువామ్‌పై క్షిపణి దాడిని వాయిదా వేయాలని కిమ్ నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఉ.కొరియా మీడియా గత మంగళవారం ప్రకటించింది. 'క్షిపణి ప్రయోగాన్ని వాయిదా వేస్తున్నాం. అమెరికా మరిన్ని నిర్లక్ష్య చర్యలు చేపట్టేంతవరకు వరకు ఎదురుచూస్తాం' అని ఉ.కొరియా మీడియా పేర్కొంది. అయితే దీనిపై తాజాగా ట్రంప్ స్పందించారు. ఉ.కొరియాతో చర్చలు సిద్ధంగానే ఉన్నామని అమెరికా విదేశాంగ మంత్రి టిల్లర్‌సన్ చెప్పడం గమనార్హం.

యెమెన్‌లో వైమానిక దాడులు పెరిగాయి

- ఈఏడాది జరిగిన దాడులు 5,676 : ప్రొటెక్షన్ క్లస్టర్ సంస్థ నివేదిక



సనా : యెమెన్‌లో వైమానిక దాడులు గతేడాది కంటే ఈఏడాది అధికమయ్యాయని ప్రొటెక్షన్ క్లస్టర్ సంస్థ (పీసీఓ) పేర్కొన్నది. సౌదీ సంకీర్ణదళాలు జరిపిన వైమానిక దాడుల్లో అమాయక ప్రజలు చనిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఏడాది జులై నాటికి 5,676 వైమానిక దాడులు జరిగినట్టు తెలిపింది. గతేడాది 3,936 దాడులు జరిగినట్టు పేర్కొన్నది. ఐరాస శరణార్థి సంస్థకు అనుబంధంగా పనిచేస్తున్నట్టు పీసీఓ తెలిపింది. కాగా, యెమెన్‌లో వైమానిక దాడులు పెరిగిపోవడంతో అక్కడి ప్రజలు ప్రాణభయంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఈ ఏడాది జులై నాటికి లక్ష మంది శరణార్థులుగా మారారు. గతేడాది అక్టోబర్‌లో సంకీర్ణదళాలు సనా నగరంలో జరిపిన వైమానిక దాడిలో 140 మంది మృతి చెందారు. 500 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇలాంటి ఘటనలు యెమెన్‌లో జరుగుతున్నాయని పీసీఓ పేర్కొన్నది. కాగా, సౌదీ సంకీర్ణదళాలకు అవసరమైన భారీ ఆయుధాలు, యుద్ధ సామాగ్రి, ఫిరంగులు లండన్ నుంచి దిగుమతి అవుతున్నాయి. సౌదీకి ఆయుధాల సరఫరాను నిలిపివేయాలని కోరుతూ క్యాంపెయిన్ అగైనెస్ట్ ఆర్మ్‌డ్ ట్రేడ్ (సీఏఏటీ) సంస్థ లండన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసును లండన్ న్యాయస్థానం కొట్టేసింది. సౌదీకి ఆయుధాలను ఎగుమతి చేస్తే తప్పేమీ లేదని స్పష్టం చేసింది.

టెక్సాస్‌లో అమానవీయ ఘటన..

వాషింగ్టన్ : టెక్సాస్‌లో జరిగిన అమానవీయ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..2015, జూన్21న 21ఏండ్ల బాధితురాలు హారిస్ కౌంటీ నగరానికి కారులో ఒంటరిగా ప్రయాణించింది. వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను చూపాలని ముగ్గురు పోలీస్ అధికారులు ఆమెను అడ్డుకున్నారు. అనంతరం యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. అయితే, అప్పట్లో ఫిర్యాదు చేసేందుకు బాధితురాలు బయపడింది. తాజాగా, సదరు పోలీస్ అధికారులు తనపై లైంగికదాడికి పాల్పడ్డారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది.

రేడియో స్టేషన్‌లో యువతిని బంధించిన వ్యక్తి అరెస్ట్

3ఎఫ్ఎం రేడియో స్టేషన్‌లో ఓ యువతిని గంటన్నరపాటు బంధించి వేధించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు నెదర్లాండ్ పోలీసులు తెలిపారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఈ ఘటన హిల్వర్‌సామ్ నగరంలో బుధవారం చోటుచేసుకున్నది. రేడియో స్టేషన్‌లోకి ఓ ఆగంతకుడు ప్రవేశించాడు. ఓ యువతిని బంధీగా మల్చుకున్నాడు. కత్తితో బెదిరించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆగంతకుడు చొరబడిన మీడియా పార్క్ భవనాన్ని చుట్టుముట్టారు. అనంతరం నిందితున్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

బ్రిటన్‌లో మార్కెట్‌లో భారీ పేలుడు


- కొనసాగుతున్న సహాయక చర్యలు

లండన్ : బ్రిటన్‌లోని గ్లాస్‌గౌ పండ్ల మార్కెట్‌లో భారీ పేలుడు సంభవించింది. భారీగా ఆస్తినష్టం జరిగినట్టు అధికారులు తెలిపారు. ప్రాణనష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటను అదుపు చేశారు. మార్కెట్‌కు సమీపంలో ఉన్న భవనాలు కూడా దగ్ధమైనట్టు అధికారులు తెలిపారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు చేపట్టామని అన్నారు.

ప్రయివేట్ దవాఖానలపై నిఘా

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టుకు తుదిమెరుగులు

- విధివిధానాల రూపకల్పనపై సర్కారు కసరత్తు ?
- అమల్లోకొస్తే అడ్డగోలు బిల్లులు, ఫీజులకు చెక్
- డయాగ్నస్టిక్ సెంటర్లపైనా నజర్
- శస్త్రచికిత్స వివరాలూ ఆన్‌లైన్‌లో నమోదు
- ఎప్పటికప్పుడు తనిఖీలు.. ఉల్లంఘిస్తే చర్యలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రయివేట్ దవాఖానలు, డయాగ్నస్టిక్ సెంటర్ల ఆగడాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్నది. ఇష్టారాజ్యంగా శస్త్రచికిత్సలు చేస్తూ రోగుల నుంచి భారీగా ఫీజులు దండుకునే ఇలాంటి వాటికి ముకుతాడు వేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నది. రాష్ట్రంలో అనవసర శస్త్రచికిత్సల సంఖ్య బాగా పెరిగిపోయింది. డబ్బుల కోసం దవాఖానల నిర్వాహకులు అవసరం లేకున్నా శస్త్రచికిత్సలు చూస్తూ రోగులను దగా చేస్తున్నారు. నిర్వహణ వ్యయం భారీగా పెరిగిపోవడంతో ఆ వ్యయాన్ని తట్టుకోవడానికి ప్రయివేట్ దవాఖానలు, డయాగ్నస్టిక్ కేంద్రాలు నైతిక విలువలు పాటించకుండా వ్యవహరిస్తున్నాయి. దీంతో మొత్తం వైద్యవ్యవస్థకే చెడ్డపేరు వస్తున్నది. గుండెకు సంబంధించిన సమస్య వస్తే అవసరం లేకున్నా స్టెంట్లు వేయడం, బైపాస్ సర్జరీలు చేయడం పరిపాటిగా మారింది. అవసరం ఉన్నా లేకున్నా వైద్యపరీక్షలు చేస్తున్నారు. రాష్ట్రంలో నమోదవుతున్న ఈ తరహా కేసుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతూనే ఉన్నది. అవసరం లేకున్నా ఆపరేషన్లు చేస్తున్న తీరుపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో దవాఖానల నియంత్రణ, పర్యవేక్షణకు ఉద్దేశించిన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (రిజిస్ట్రేషన్, రెగ్యులేషన్) చట్టాన్ని అమల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. త్వరలో ప్రయివేట్ దవాఖానాల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఈ చట్టం అమల్లోకి వస్తే అవకతవకలకు పాల్పడే ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశముంటుంది. కాగా, జాతీయ స్థాయిలో ఉన్న క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం-2010ను రాష్ట్రానికి వర్తింపజేస్తూ గత అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. చట్టరూపం దాల్చి అమలైతే రోగులకు నిర్దిష్ట ప్రమాణాల మేరకు వైద్యం, వసతులు, సేవలు అందించాల్సి ఉంటుంది. ప్రయివేట్ దవాఖానలు రోగులకు విధించే బిల్లులపై పరిమితులు పాటించాల్సి ఉంటుంది. ప్రస్తుతం దవాఖానల్లో వైద్యంతోపాటు ఫీజుల విషయంలోనూ నిర్దిష్ట మార్గదర్శకాలు లేవు. ఒకే రకమైన చికిత్స, ఆపరేషన్లకు వేర్వేరు ఆస్పత్రుల్లో వేర్వేరు ఫీజులు గుంజుతున్నారు. ఈ ఫీజులపై ప్రభుత్వానికి నియంత్రణ, పర్యవేక్షణ అధికారాలు లేవు. దీంతో ప్రయివేట్ దవాఖానలు రోగుల నుంచి ఫీజును ఇష్టారీతిలో వసూలు చేస్తున్నాయి. అలాగే అవసరం లేకున్నా వైద్య పరీక్షలు, శస్త్రకిచిత్సలు చేస్తున్నారు. ముఖ్యంగా ప్రసూతికి వచ్చే గర్భిణీలకు అవసరం లేకున్నా ఆపరేషన్లు నిర్వహించి అందినకాడికి దండుకుంటున్నారు. తద్వారా భారీ ఫీజులు చెల్లించడంతో పాటు, సదరు మహిళ ఆరోగ్యం కూడా దెబ్బతినే పరిస్థితి నెలకొంటున్నది.

ఇక, పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రయివేటు డయాగ్నస్టిక్ సెంటర్లను అనుమతి లేకుండానే నడిపిస్తున్నారు. వీటిని ప్రమాణాల మేరకు నిర్వహించడం లేదు. కొత్త చట్టం అమల్లోకి వస్తే ఈ పరిస్థితిలో కొంత మార్పు వచ్చే అవకాశం ఉన్నది. డాక్టర్లు ప్రతీ శస్త్రచికిత్సకు సరైన మార్గదర్శకాలు పాటించాల్సి ఉంటుంది. చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రస్థాయిలో ప్రత్యేక కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ కౌన్సిల్ ద్వారా ప్రయివేట్ దవాఖానాల్లో శస్త్రచికిత్సలను, వైద్య సేవలను పర్యవేక్షిస్తారు. ఫీజులను కూడా క్రమబద్ధీకరిస్తారు. ఇందుకు సీజీహెచ్‌ఎస్, ఆరోగ్యశ్రీ ప్యాకేజీల ధరలను ప్రమాణికంగా తీసుకుంటారు. రాష్ట్రంలోని అన్ని దవాఖానాలు, డయాగ్నస్టిక్ సెంటర్లు, నర్సింగ్ హోంలు వంటివి ఈ కౌన్సిల్ పరిధిలోకి వస్తాయి. ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న దవాఖానల వివరాలను ఆనలైన్‌లో ఉంచుతారు. అవసరమైతే ఆయా దవాఖానల్లో అధికారులు తనిఖీలు నిర్వహించి ప్రమాణాలను ధ్రువీకరించుకుంటారు. నిర్దిష్ట ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తీసుకుంటారు. అలాగే ఏయే వైద్య సేవలకు ఏ మేర బిల్లులు వసూలు చేసిన విషయాన్ని తనిఖీ చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ఎక్కువ బిల్లులు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదు వస్తే తనిఖీలు చేపట్టి తప్పులు ఉన్నట్టు తేలితే సదరు దవాఖానపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారు. అలాగే అవసరం లేని శస్త్రచికిత్సలు చేసినట్టు నిరూపణ అయితే సదరు ఆస్పత్రి, డాక్టర్లపైనా చర్యలు చేపడతారు. ఆయా దవాఖానల్లో ఎంత మందికి ఏయే వైద్యసేవలు అందించారనే సమాచారాన్ని కూడా ఎప్పటికప్పుడు ఆనలైన్‌లో ఉంచాలి. అలాగే దవాఖానల్లో మౌలిక సదుపాయాలు, రోగికి అవసరమైన ఇతర సదుపాయాలు సమకూర్చాలి. ఈ విషయంలో ప్రమాణాలను పాటించని దవాఖానాలపై నేరుగా చర్యల్ని తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. కాగా ఈ కొత్త చట్టం అమలు కోసం ముందుగా ప్రయివేట్ యాజమాన్యాల ప్రతినిధులతో ప్రత్యేకంగా చర్చించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఏది ఏమైనా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

మైదాన ప్రాంతాల్లో మావోయిస్టుల జోరు

- యూనివర్సిటీలు, కాలేజీలు, హాస్టళ్లనుంచి రహస్యంగా ఇంటెలిజెన్స్ ఆరా

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

మైదాన ప్రాంతాల్లో మావోయిస్టుల కార్యకలాపాలు చాపకింద నీరులా సాగుతున్నాయనే కోణంలో రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం నిశితంగా దృష్టిని సారించింది. ఇందులో భాగంగా యూనివర్సిటీలు, కొన్ని కాలేజీలు హాస్టళ్లలో అత్యంత రహస్యంగా నిఘా అధికారులు ఆరా తీస్తున్నారని విశ్వసనీయంగా తెలిసింది. దాదాపు 17 ఏండ్లుగా అటు ఉమ్మడి ఏపీలోను, విభజన అనంతరం గత మూడేండ్లుగా తెలంగాణ రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు సాగడం లేదని పోలీసు రికార్డులు చెబుతున్నాయి. అడపా దడపా తమ ఉనికిని చాటుకోవడానికి మాత్రమే కొన్ని ఘటనలకు పాల్పడుతున్న మావోయిస్టుల చర్యలు ప్రజలపై పెద్దగా ప్రభావాన్ని చూపడం లేదని నిఘా అధికారులు గతంలో ఇచ్చిన నివేదికలు చెబుతున్నాయి. అయితే గత కొంత కాలంగా మైదాన ప్రాంతాల్లో మావోయిస్టులు చాపకింద నీరులా పని చేసుకుంటూ పోతున్నారని నిఘా వర్గాలకు కొంత ఊపు అందినట్టు తెలిసింది. ముఖ్యంగా నిషేధిత మావోయిస్టు అనుబంధ సంఘాలలో కొన్నింటిని తిరిగి జవసత్వాలు పోయడానికి తీవ్ర ప్రయత్నాలు సాగుతున్నాయని అనుమానిస్తున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు పలికి కొంత బలాన్ని పెంచుకోవడానికి ప్రయత్నాలు జరిగాయని, కాని దాని వలన ఎలాంటి ఫలితాలు వచ్చిందనే సమాచారం ఇంటెలిజెన్స్‌కు స్పష్టంగా చిక్కలేదని తెలుస్తోంది. అదే వరుసలోనే మైదాన ప్రాంతంపై మావోయిస్టు అగ్ర నాయకత్వం దృష్టిని సారించి, అందుకు ఒక రహస్య ఎజెండాను రూపొందించి అమలు చేస్తున్నదని నిఘా వర్గాలకు సమాచారం ఉన్నట్టు తెలిసింది. ఈ వరుసలోనే ఇటీవలన కరీంనగర్ జిల్లా నేరెళ్లలో జరిగిన అమానుష లాఠీ చార్జీపై ప్రకటనను ఇవ్వడమే గాక, చివరికి ఈ మధ్య కాలంలో లేని విధంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు ప్రజాక్షేత్రంలో బుద్ది చెబుతామంటూ ఆ మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ ఇటీవలన ప్రకటనను విడుదల చేయడాన్ని ఇంటెలిజెన్స్‌లోని నక్సల్స్ అనాలిసిస్ విభాగం మదింపు చేసినట్టు తెలిసింది. అసలు కాలుమోపడానికి వీలు లేకుండా చర్యలు తీసుకున్నామని పోలీసు ఉన్నతాధికారులు ప్రకటనలు చేస్తుండగా ఉత్తర తెలంగాణాలోని కొన్ని మారుమూల ప్రాంతాల్లో మావోయిస్టుల పోస్టర్లు వెలియడం, అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా ఊరేగింపులు, సభలను నిర్వహించాలని మావోయిస్టు నేత పిలుపు నివ్వడాన్ని కేవలం తాటాకు చప్పుళ్ల కింద నిఘా విభాగం తీసి పారేయడం లేదని తెలిసింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని కొన్ని యూనివర్సిటీలు, కాలేజీలు, హాస్టళ్లలో విద్యార్థులు ఎవరైనా మావోయిస్టుల ప్రభావానికి లోనయ్యారా? అందులో ఎవరి చర్యలైనా తీవ్రంగా ఉన్నాయా? వారి దైనందిన చర్య ఏమిటీ మొదలైన కోణాల్లో రహస్య సమాచార సేకరణ సాగుతున్నట్టు తెలిసింది. అయితే రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు సాగక పోయినప్పటికి ముందు జాగ్రత్త చర్యగా వారికి సంబంధించిన కొన్ని కోణాలలో ఎంక్వయిరీ మాడ్యూటీలో భాగంగా కొనసాగుతుందని పోలీసు ఉన్నతాధికార వర్గాలు చెబుతున్నా ప్రస్తుతం సాగుతున్న ఆరా లో కొంత తీవ్రత ఉన్నట్టు తెలిసింది.

నవచిత్రం

అనుబంధాలకు వెండితెర రూపం



రాహుల్ విజయ్, వి.వి.వినాయక్

రాహుల్ విజయ్‌ను హీరోగా పరిచయం చేస్తూ రాము కొప్పుల దర్శకత్వంలో విఎస్ క్రియేటివ్ వర్క్స్ పతాకంపై దివ్య విజయ్ ఓ నూతన చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో జరిగింది. హీరోపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి వి.వి.వినాయక్ క్లాప్‌నివ్వగా, విజయ్ మాస్టర్ కెమెరా స్విచాన్ చేశారు. పూరీ జగన్నాథ్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా విజయ్ మాస్టర్ మాట్లాడుతూ, 'ఫైట్ మాస్టర్‌గా 30ఏండ్లు ఇండస్ట్రీలో ఉన్నాను. ఇంత కాలం దర్శక,నిర్మాతలు నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. అందుకు వారికి, ఇండస్ట్రీకి రుణపడి ఉన్నా. ఆ రుణం ఎలాగైనా తీర్చుకోవాలనిపించి మా అబ్బాయి రాహుల్‌ని హీరోగా, మా అమ్మాయి దివ్యని నిర్మాతగా పరిచయం చేస్తూ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం' అని అన్నారు.
'నేను సుకుమార్ టీమ్‌లో పనిచేశాను. 'ఆర్య 2' నుంచి సుకుమార్ దగ్గర వర్క్ చేశా. ఈ చిత్రంతో దర్శకుడిగా మారుతున్నా. ఈ ఛాన్స్ ఇచ్చిన విజయ్ మాస్టర్‌కి, దివ్యగారికి కృతజ్ఞతలు. ఇదొక లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం. తండ్రీకూతుళ్ళ మధ్య ఉన్న అనుబంధం, ఫ్రెండ్స్ మధ్య ఉన్న రిలేషన్‌షిప్‌ను తెలియజేస్తుంది. ఇందులో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. అన్ని ఎలిమెంట్స్ మేళవించిన ప్యాకేజ్డ్ చిత్రమిది. ట్రెండీగా ఉంటుంది. కచ్చితంగా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది. టైటిల్, హీరోయిన్‌ను త్వరలోనే ఫైనల్ చేస్తాం' అని దర్శకుడు అన్నారు.
నిర్మాత దివ్య విజయ్ చెబుతూ, 'ఈ నెల 21 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభి, డిసెంబర్ వరకు షూటింగ్ పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నాం' అని చెప్పారు.
'హీరో కావడం కోసం ఏడెనిమిదేండ్లుగా కష్టపడుతున్నాను. దేవదాస్ కనకాల, సత్యానంద్ వద్ద యాక్టింగ్‌లో ట్రైనింగ్ తీసుకున్నా. అలాగే లారెన్స్ మాస్టర్ దగ్గర డాన్సులు నేర్చుకున్నా. శ్రీహరిగారు మాకు ఎంతో సపోర్ట్ చేశారు' అని హీరో రాహుల్ విజయ్ తెలిపారు.



ఎన్టీఆర్

వినాయక చవితి స్పెషల్..

ఎన్టీఆర్ త్రిపాత్రాభినయం చేస్తున్న చిత్రం 'జై లవకుశ'. బాబీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రాశీఖన్నా, నివేదా థామస్ కథానాయికలు. ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై కళ్యాణ్ రామ్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఎన్టీఆర్ జై, లవ, కుశ అనే మూడు పాత్రల్లో కనిపించనున్నారు. ఇటీవల జై పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్, టీజర్‌ను విడుదల చేశారు. దీంతో జై పాత్ర నెగటివ్ షేడ్స్‌తో ఉంటుందని అర్థమవుతోంది. అలాగే తాజాగా విడుదలైన లవ పాత్ర ఫస్ట్‌లుక్ కూడా మంచి స్పందన రాబట్టుకుంది. ఈ నేపథ్యంలో లవ పాత్రకు సంబంధించిన టీజర్‌ను వినాయక చవితి పండుగ కానుకగా విడుదల చేస్తున్నట్టు చిత్ర బృందం ప్రకటించింది. కుశ ఫస్ట్‌లుక్, టీజర్‌ను ఈ నెలాఖరున రిలీజ్ చేయనున్నట్టు తెలిపారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 21న రిలీజ్ చేయబోతున్నారు. ఈ చిత్రం తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో, ఆ తర్వాత చంద్రశేఖర్ ఏలేటి దర్శకత్వంలో ఎన్టీఆర్ నటించనున్నట్టు సమాచారం.

ప్రతి రోజూ స్ట్రగుల్ పడుతూనే ఉన్నా..



తాప్సీ

"'పింక్' సినిమా తర్వాత నేను స్టార్ ఇమేజ్ అనుభవిస్తున్నానని అందరూ భావిస్తున్నారు. కానీ నేను అలా లేను. ప్రతి రోజూ స్ట్రగుల్ పడుతున్నాను' అని అంటోంది తాప్సీ. మహి వి.రాఘవ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఆనందో బ్రహ్మ'. తాప్సీ, శ్రీనివాస్‌రెడ్డి, వెన్నెల కిషోర్, తాగుబోతు రమేష్, షకలక శంకర్ ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ చిత్రం నేడు(శుక్రవారం) విడుదల కానుంది. ఈ నేపథ్యంలో గురువారం తాప్సీతో మీడియా జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు..

మళ్లీ భయపెట్టడానికి రెడీ అవుతున్నారా?

– భయపెట్టడానికి ఇది హర్రర్ చిత్రం కాదు. హర్రర్ కామెడీ చిత్రం. హర్రర్ కంటే కామెడీ ఎక్కువగా ఉంటుంది. నాకు తెలిసి 'గంగా' చిత్రం హర్రర్ కాన్సెప్ట్‌తో వచ్చి పెద్ద విజయం సాధించింది. దానికంటే మించిన సినిమా వస్తుందని భావించను. అందుకే ఆ చిత్రం తర్వాత హర్రర్ సినిమా చేయడం ఇష్టం లేదు. మహి చెప్పిన స్క్రిప్ట్ నచ్చడంతో ఓకే చేశా.

ఈ స్క్రిప్ట్‌లో మిమ్మల్ని ఎట్రాక్ట్ చేసింది ఏమిటి?

– ఇదొక డిఫరెంట్ కథా చిత్రం. ఇలాంటి కథతో మన ఇండియాలోనే సినిమా రాలేదు. దర్శకుడు మహి ఈ స్క్రిప్ట్ చెప్పినప్పుడు కొత్తగా అనిపించింది. పైగా కామెడీ బేస్డ్‌గా ఉంది. దర్శకుడు మహికి దెయ్యాలపై, దేవుడిపై నమ్మకం లేదు. అందుకే ఇలాంటి స్క్రిప్ట్ రాయగలిగాడు. మనుషులకు దెయ్యం భయపడటమనేది ఈ చిత్ర ఇతివృత్తం. అంధుడు, తాగుబోతు, పిచ్చివాడు, హార్ట్ పేషెంట్ ఇలా లోపాలున్న నలుగురు వ్యక్తులకు, దెయ్యానికి మధ్య జరిగే సన్నివేశాలు కామెడీని పుట్టిస్తాయి. ఆద్యంతం కామెడీని పంచే ఈ చిత్రం అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుంది.

మీ పాత్రకి ఉన్న ప్రత్యేకత ఉంటుంది?

– ఇదేం మహిళా ప్రధాన చిత్రం కాదు. నా పాత్ర అద్భుతంగానో, ప్రాధాన్యత కలిగో ఉండదు. చాలా రెగ్యులర్‌గా, ఆర్డినరీగా ఉండే పాత్ర నాది. కానీ అందులోనే ఓ తెలియని ఆసక్తి ఉంటుంది. దెయ్యానికి, నాకు మధ్య జరిగే కాన్వర్‌జేషన్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. ఇందులో స్టార్ హీరో లేడు కాబట్టి ప్రేక్షకుల దగ్గరకు సినిమాను తీసుకెళ్లాల్సిన బాధ్యత నాపై ఉంది. దీన్నొక బేబీలా భావించి ప్రమోషన్‌కు ఎక్కువ టైమ్ స్పెండ్ చేస్తున్నాను.

దర్శకుడు వర్కింగ్ స్టయిల్‌పై మీ కామెంట్?

– మహి చాలా క్లారిటీ ఉన్న దర్శకుడు. నిజాయితీగా ఉంటాడు. స్క్రిప్ట్‌పై నమ్మకంతో ఉన్నాడు. ఇతర దర్శకులతో పోల్చితే చాలా స్పెషల్. ఏదైన మార్పులు అవసరం అయితే వెంటనే చేస్తాడు. సన్నివేశాల్లో మార్పులకు సంబంధించి కూడా చాలా ఫ్లెక్సిబుల్‌గా ఉంటాడు. ఎలా చేస్తే బాగుంటుందో చెప్పమని అడుగుతాడు. ఇలానే చేయాలని నిబంధనలేం పెట్టడు. అందుకే ఆయనతో వర్క్ చేయడం చాలా కంఫర్ట్‌గా అనిపించింది.

'పింక్' సక్సెస్‌తో మీలో వచ్చిన మార్పు ఏంటి?

– నాపై నాకు నమ్మకం పెరిగింది. సినిమాల విషయంలో సెలక్టీవ్‌గా ఉంటున్నా. గతంలో దర్శక, నిర్మాతలకు కావాల్సిన విధంగా చేసేదాన్ని. ఇప్పుడు నాకు ఏం కావాలో, ఎలాంటి పాత్రలు చేయాలను కుంటున్నానో ఆ తరహా సినిమాలను, పాత్రలను ఎంపిక చేసుకుంటున్నా. ఛాయిస్ తీసుకుంటున్నా. అలాగని ప్రాముఖ్యత ఉన్న పాత్రలే చేయడం లేదు. నచ్చిన పాత్ర అయితే గ్లామర్‌రోల్స్, నటనకు స్కోప్ ఉన్న పాత్రలైనా చేస్తున్నా. యాక్టింగ్, గ్లామర్‌ను బ్యాలెన్స్ అయ్యేలా చూసుకుంటున్నా. 'పింక్' చిత్రం నాకు వ్యక్తిగతంగా సంతృప్తినిచ్చింది. చాలా మంది అమ్మాయిలు 'ఈ సినిమా చేసినందుకు థ్యాంక్స్' అని చెప్పారు. అది చాలా గ్రేట్ థింగ్ కదా..!

'పింక్'తో స్టార్ ఇమేజ్ రావడాన్ని ఎలా ఫీల్ అవుతున్నారు?

– నాకు స్టార్ హీరోయిన్ ఇమేజ్ లేదు. ఆ ఇమేజ్ వద్దు. స్టార్‌లకు అవకాశాలు, ఇతర అంశాలన్నీ ఈజీగా వస్తాయి. నాకు అలా లేదు. నేను ప్రతి రోజూ స్ట్రగుల్ పడుతున్నా. మంచి సినిమా కోసం స్ట్రగుల్, మంచి స్క్రిప్ట్ కోసం స్ట్రగుల్, మంచి పాత్ర కోసం స్ట్రగుల్ ఇలా ప్రతి విషయంలోనూ స్ట్రగుల్ పడుతున్నా. బాగా స్ట్రగుల్ పడుతున్నప్పటికీ కెరీర్ పరంగా చాలా సంతృప్తిగా ఉన్నాను.

నెక్స్ సినిమాల గురించి?

– తెలుగులో రెండు, మూడు ప్రాజెక్టులకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి. 'ఆనందోబ్రహ్మ' విడుదల తర్వాత దానిపై క్లారిటీ వస్తుంది. హిందీలో 'జుడ్వా 2' చేస్తున్నా. నేను నటించే సినిమాకు డబ్బులు రావాలి. ప్రేక్షకులను అలరించాలి. ఇకపై అలాంటి సినిమాలే చేస్తాను. బయోపిక్స్‌లో నటించే అవకాశం వస్తే కచ్చితంగా చేస్తాను. స్పోర్ట్స్ బేస్డ్ బయోపిక్‌లంటే ఇష్టం.

మీపై సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్‌కు ఎలా రియాక్ట్ అవుతారు?

– యాక్టర్స్ కెరీర్‌లో ఇవి కామన్. ఇటీవల రాఘవేంద్రరావుగారికి సంబంధించిన వివాదం పై కూడా చాలా మంది ఇష్టం వచ్చినట్టు రకరకాల పోస్ట్‌లు పెట్టారు. ఆ ఇష్యూకి నేను క్షమాపణలు తెలిపినప్పటికీ రెండు, మూడు రోజులు ఇబ్బంది పడ్డాను. నా బ్లాగ్‌లను బ్లాక్ చేయాలనుకున్నా. లక్కీగా కొన్ని రోజుల తర్వాత ఆ వివాదం దానికదే సద్దుమణిగింది (నవ్వుతూ). అలాగే పెళ్ళి ఎప్పుడు చేసుకుంటావ్ అని అడుగుతున్నారు. ఇప్పట్లో నాకు పెళ్ళి ఆలోచన లేదు. దానికి చాలా టైమ్ పడుతుంది. పెళ్ళి చేసుకున్న తర్వాత కూడా నటిగా కొనసాగుతాను. ఒకవేళ నా సినిమాలు ఆడకపోయినా, నా నటనను ప్రేక్షకులు తిరస్కరించినప్పుడే ఇండస్ట్రీ నుంచి తప్పుకుంటాను.

విజయదశమికి మహానుభావుడు



శర్వానంద్

శర్వానంద్, మెహరీన్ జంటగా మారుతి దర్శకత్వంలో యువి క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు నిర్మిస్తున్న చిత్రానికి 'మహానుభావుడు' అనే టైటిల్ ఖరారు చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్స్ వర్క్ జరుపుకుంటున్న ఈ చిత్రం గురించి నిర్మాతలు మాట్లాడుతూ, "రన్ రాజా రన్', 'ఎక్స్‌ప్రెస్ రాజా' తర్వాత శర్వానంద్ హీరోగా మా బ్యానర్‌లో చేస్తున్న మూడవ చిత్రమిది. మారుతి చెప్పిన క్యారెక్టరైజేషన్, దాన్నుంచి వచ్చే కామెడీ బాగా నచ్చి ఈ సినిమాను తెరకెక్కించాం. ఒక్క సాంగ్ మినహా షూటింగ్ పూర్తయ్యింది. గురువారం నుంచి డబ్బింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇటలీ, ఆస్ట్రియా, క్రోయేషియా వంటి విదేశాల్లో, పొల్లాచ్చి, ఆర్ఎఫ్‌సీతోపాటు హైదరాబాద్‌లోని పలు అందమైన లొకేషన్లలో సినిమాను షూట్ చేశాం. ఆగస్ట్ 24న ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ని, టీజర్‌ను విడుదల చేస్తాం. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి విజయదశమి కానుకగా సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. మా బ్యానర్‌లో శర్వానంద్‌కిది మరో మంచి సినిమా అవుతుంది' అని అన్నారు. 'భలే భలే మగాడివోయ్' చిత్రం తర్వాత నాకు బాగా నచ్చిన క్యారెక్టరైజేషన్‌తో చేస్తున్న చిత్రమిది. శర్వానంద్ కెరీర్‌లో ఇది బెస్ట్ చిత్రంగా నిలుస్తుందని నమ్ముతున్నాం. శర్వానంద్ చాలా బాగా యాక్ట్ చేశాడు. సినిమా ఫుల్ కామెడీగా ఉంటుంది. థమన్ సంగీతం శ్రోతలను అలరిస్తుంది. మ్యూజికల్ లవ్‌స్టోరీగా ఈ సినిమా ఉంటుంది' అని దర్శకుడు మారుతి తెలిపారు.
వెన్నెల కిషోర్, నాజర్, భద్రం, కళ్యాణి నటరాజ్, పిజ్జాబాయ్, భాను, హిమజ, వేణు, సుదర్శన్, సాయి, వెంకీ, శంకర్‌రావు, రమాదేవి, మధుమణి, రాగిణి, రజిత, అబ్బులు చౌదరి, సుభాష్, ఆర్.కె తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి ఫొటోగ్రఫీ: నిజార్ షిఫి, ఆర్ట్: రవీందర్, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు.



దీపికా పదుకొనె

దీపికా ఎక్కడా?..

ప్రియాంక చోప్రా, దీపికా పదుకొనె.. గతేడాది హాలీవుడ్‌లో సందడి చేసిన బాలీవుడ్ కథానాయికలు. ప్రియాంక చోప్రా 'క్వాంటికో' టెలివిజన్ సిరీస్‌తోపాటు 'బేవాచ్' చిత్రంలో ప్రతినాయికగా నటించి హాలీవుడ్ ప్రేక్షకుల ప్రశంసలందుకుంది. ప్రస్తుతం రెండు హాలీవుడ్ ప్రాజెక్టులను దక్కించుకుంది. అలాగే మరోవైపు నిర్మాతగానూ ప్రాంతీయ భాషా చిత్రాలను ప్రోత్సహిస్తుంది. త్వరలో డిస్ట్రిబ్యూషన్ రంగంలోకి కూడా అడుగుపెట్టబోతుంది. దీపికా సైతం గతేడాది 'ట్రిపులెక్స్: రిటర్న్ ఆఫ్ గ్జెండర్ కేజ్' చిత్రంలో నటించింది. ఈ చిత్రం బాక్సాఫీసు వద్ద బోల్తా కొట్టినా దీపిక నటనకు మాత్రం మంచి మార్కులే పడ్డాయి. ఈ చిత్రం తర్వాత రెమ్యూనరేషన్ కూడా బాగా పెంచి గతేడాది అమెరికన్ బిజినెస్ మ్యాగజైన్ ఫోర్బ్ విడుదల చేసిన జాబితాలో దీపిక అత్యంత పారితోషికం తీసుకుంటున్న టాప్ టెన్ నటీమణుల్లో పదో స్థానం దక్కించుకుంది. కానీ ఏడాది మాత్రం ఫోర్బ్ లిస్ట్‌లో స్థానాన్ని కోల్పోయింది. ఓ వైపు ప్రియాంక విభిన్న రంగాల్లో రాణిస్తూ కెరీర్ పరంగా ముందుకు సాగుతుంటే, దీపికా కెరీర్ మాత్రం డౌన్‌ఫాల్ అవుతూ వస్తోంది. 'ట్రిపులెక్స్' తర్వాత మరే హాలీవుడ్ ఆఫర్ కూడా దీపికకు వరించలేదు. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఒక్క 'పద్మావతి' చిత్రంలో మాత్రమే నటిస్తోంది. దీనికితోడు సుజిత్ సిర్కార్ దర్శకత్వంలో రూపొందబోయే 'అక్టోబర్' చిత్రంలో హీరోయిన్ దీపికా అని ఇటీవల వార్తలొచ్చాయి. తాజా సమాచారం ప్రకారం ఇందులో ఆమె హీరోయిన్ కాదని బాలీవుడ్ వర్గాలు అంటున్నాయి. ఇక 2017కుగానూ అత్యంత పారితోషికం తీసుకుంటున్న కథానాయికలకు సంబంధించి విడుదల చేసిన ఫోర్బ్ జాబితాలో 'లా లా లాండ్' చిత్రంలో నటించిన ఎమ్మాస్టోన్ మొదటిస్థానంలో నిలిచింది. జెన్నిఫర్ ఆనిస్టన్ రెండో స్థానంలో, జెన్నిఫర్ లారెన్స్ మూడో స్థానంలో, మెలిస్సా మెక్ నాలుగో స్థానంలో, మిలా కునిస్ ఐదో స్థానంలో, ఎమ్మా వాట్సన్ ఆరో స్థానంలో, చార్లీజ్ థెరోన్ ఏడో స్థానంలో కేట్ బ్లాన్‌షెట్ ఎనిమిదో స్థానంలో, జులియా రాబర్ట్స్ తొమ్మిదో స్థానంలో, అమీ ఆడమ్స్ పదో స్థానంలో నిలిచారు.



శ్రద్ధాకపూర్

ఆతృతగా ఉంది..

'టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తూనే 'సాహో'లో ప్రభాస్ వంటి స్టార్ హీరోతో కలిసి నటించడానికి చాలా ఆతృతగా ఉన్నాను' అని అంటోంది శ్రద్ధా కపూర్. 'ఆషిఖీ 2', 'ఏక్ విలన్', 'హైదర్', 'ఏబీసీడీ 2', 'బాఘీ' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించి మెప్పించిన శ్రద్ధా ప్రస్తుతం ముంబయి మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీం సోదరి హసీనా పార్కర్ జీవితం ఆధారంగా రూపొందుతున్న 'హసీనా పార్కర్' చిత్రంలో నటిస్తోంది. తాజాగా ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న 'సాహో' చిత్రంలో హీరోయిన్‌గా నటించే లక్కీ ఛాన్స్ అందిపుచ్చుకుంది. ఆ సంతోషాన్ని శ్రద్ధా ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకుంది. "సాహో' టీమ్‌లో నేనూ భాగమైనందుకు చాలా హ్యాపీగా ఉంది. తెలుగులో నాకిది మంచి డెబ్యూ ఫిల్మ్ అవుతుందని భావిస్తున్నా' అని ట్వీట్ చేసింది. సుజిత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని యువి క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు నిర్మిస్తున్నారు.

నిజం కాని నిజం నేపథ్యంలో..



విజయ్, మంచులక్ష్మి, మనోజ్, ప్రణతి తదితరులు

మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నటిస్తున్న నూతన చిత్రం ప్రారంభమైంది. విజయ్ యలంకంటిని దర్శకుడిగా పరిచయం చేస్తూ మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మంచు లక్ష్మి నిర్మిస్తున్న ఈ చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభోత్సవం జరుపుకుంది. అతిథిగా పాల్గొన్న మంచు మనోజ్, ఆయన భార్య ప్రణతి, మంచు లక్ష్మి తనయ విద్యా నిర్వాణ స్క్రిప్ట్‌ను మంచు లక్ష్మికి, దర్శకుడు విజయ్‌లకు అందించారు. ఈ సందర్భంగా మంచు లక్ష్మి మాట్లాడుతూ, 'చాలా రోజుల తర్వాత మా బ్యానర్ నుంచి వస్తున్న చిత్రమిది. నిజం కాని విషయాన్ని నిజమని భావించే ఓ యువతి కథ ఆధారంగా తెరకెక్కుతున్న ఈ సినిమా మనిషి ఎమోషన్స్, రిలేషన్‌షిప్స్ చుట్టూనే తిరుగుతుంది. దర్శకుడు విజయ్ అందించిన మంచి కథతో మీ ముందుకు వస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. విజయ్ ఇప్పటికే 'ఈగ', 'బాహుబలి 1' చిత్రాలకు రాజమౌళి వద్ద అసిస్టెంట్‌గా పనిచేశాడు. ఈ సినిమాతో కచ్చితంగా తన ప్రతిభ నిరూపించుకుంటాడు. దీంతోపాటు యప్ టీవీ ఆధ్వర్యంలో ఓ వెబ్ సిరీస్‌ను కూడా ప్రారంభించబోతున్నాం. వీటికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం' అని అన్నారు.

స్వీయ పాత్రలో..



టబు

సంజయ్‌దత్ జీవితం ఓ బయోపిక్ రూపొందుతున్న విషయం విదితమే. రాజ్‌కుమార్ హిరానీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సంజయ్‌దత్ పాత్రలో రణబీర్ కపూర్ నటిస్తున్నారు. ఇందులో టబు అతిథిగా స్వీయ పాత్రను పోషిస్తున్నారు. 2004లో 'మున్నాభాయ్ ఎంబీబీఎస్' చిత్రానికి గానూ ఉత్తమ నటుడిగా ఎంపికైన సంజయ్‌దత్‌కి టబునే అవార్డు అందించారు. అదే సన్నివేశాన్ని ఈ చిత్రంలో చూపించబోతున్నారు. ఇందులో సంజయ్‌కి అవార్డును ఇవ్వడానికి టబుని ఎంచుకున్నారు. అంతేకాదు ఆ అవార్డు ప్రదానం చేసే సమయంలో టబు ఏ చీర కట్టుకున్నారో ఇందులోనూ అదే చీరలో కనిపిస్తారని సమాచారం. టబు ప్రస్తుతం 'మిస్సింగ్', 'గోల్‌మాల్ ఎగైన్' చిత్రాల్లో నటిస్తోంది.

ఆర్టీసీలో 3,950 పోస్టులా.. ఎప్పుడిచ్చారు

(మొదటిపేజీ తరువాయి)

లేవు. ప్రభుత్వం భర్తీ చేశామని చెప్తున్న పోస్టుల్లో... జూనియర్ అసిస్టెంట్స్ (ఫైనాన్స్)-39, జూనియర్ అసిస్టెంట్స్ (పర్సనల్) 33, ట్రైనీ మెకానికల్ సూపర్‌వైజర్స్ - 123, ట్రైనీ ట్రాఫిక్ సూపర్‌వైజర్లు-84, అఫీస్ అండర్ ట్రైనీ జనరల్-33, ఆర్టీసీ కానిస్టేబుళ్లు-280, శ్రామిక్స్-742తో పాటు ఇతర పోస్టులు 2,615 ఉన్నాయి. ఇంతకు మించి ఆర్టీసీలో ఎలాంటి ఖాళీలు లేవని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది.

మాకేం సమాచారం లేదు
టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ జివి రమణారావు



ఆర్టీసీలో ఖాళీ పోస్టుల భర్తీపై మాకేం సమాచారం లేదు. 2015లో 3,950 మంది సర్వీసుల్ని రెగ్యులరైజ్ చేశాం. మరికొన్ని పోస్టులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. బహుశా వాటికేమన్నా పరిపాలనా అనుమతులు ఇచ్చారేమో తెలీదు. ఇంతకు మించి ఈ విషయంలో నేనేం మాట్లాడలేను.

పోస్టులకు శాంక్షన్స్ ఇచ్చారు
ఎమ్ థామస్‌రెడ్డి, టీఎమ్‌యు వర్కింగ్ ప్రెసిడెంట్




ఖాళీ పోస్టుల భర్తీపై యాజమాన్యం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. దానికి ఆమోదం లభించింది. గతంలో ఈ పోస్టుల్ని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. అలా వద్దని...ఖాళీలను మేమే భర్తీ చేసుకుంటామని యాజమాన్యం ప్రభుత్వానికి లేఖ రాసింది. ఇప్పుడు దానికి అప్రూవ్ చేశారు. త్వరలో నోటిఫికేషన్లు వస్తాయి.

అంతా అబద్ధం
వీఎస్ రావు, ప్రధాన కార్యదర్శి, టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్



ఆర్టీసీలో ఒక్క పోస్టుకూడా భర్తీ కాలేదు. ప్రభుత్వం చెప్పినవన్నీ తప్పుడు లెక్కలు. యాజమాన్యానికి కూడా తెలీకుండా అప్రూవల్స్ ఎప్పుడు ఇచ్చారు. నిరుద్యోగుల్ని తప్పుతోవ పట్టించే ప్రయత్నం ఇది. మూడేండ్లుగా కార్మిక సంఘాలుగా మేం ఖాళీ పోస్టుల్ని భర్తీ చేయాలని ఆందోళనలు చేస్తూనే ఉన్నాం. భర్తీ చేస్తే...నోటిఫికేషన్లు చూపమనండి.

ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదు
కె రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి, టీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్



మూడేండ్లలో ఆర్టీసీలో ఖాళీ పోస్టుల భర్తీకై ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదు. సీఎం ప్రకటన బూటకం. పోస్టులన్నీ భర్తీ చేశామని, ఆర్టీసీలో ఎలాంటి ఖాళీలు లేవని ప్రకటించడం మోసపూరితం. 2013 రెగ్యులరైజేషన్ ఒప్పందం ద్వారా క్రమబద్ధీకరణ కావల్సిన ఉద్యోగులు మరో 400 మంది వరకు ఉన్నారు.

చైర్మెన్ కూడా అబద్ధాలు చెప్తున్నారు
పి కమాల్‌రెడ్డి, అధ్యక్షులు, తెలంగాణ నేషనల్ మజ్దూర్ యూనియన్



పభుత్వాన్ని అధికారులు తప్పుతోవ పట్టిస్తున్నారు. పోస్టుల భర్తీ అబద్ధం. పరిపాలనా అనుమతులు ఇస్తే...యాజమాన్యానికి తెలీకుండా ఉంటుందా? టీఎస్ఆర్టీసీ చైర్మెన్ కూడా ఇదే తరహా అబద్ధాల్ని సంస్థలో ప్రచారం చేస్తున్నారు. బస్‌బాడీ బిల్డింగ్ యూనిట్‌ను మూసివేసి, నెలకు 50 బస్సులు తయారు చేస్తామని ఆయన స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రకటించారు. కార్మికులు ఇవన్నీ గమనించట్లేదనుకుంటే పొరపాటు.

పోస్టుల భర్తీనా...ఎప్పుడు చేశారు?
కె హనుమంతు, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్



ఆర్టీసీలో ఖాళీ పోస్టులు భర్తీ చేశామని సీఎం చేసిన ప్రకటన అవాస్తవం. చేస్తే...ఏ ప్రాతిపదికన...ఎప్పుడు చేశారో చెప్పాలి. సంస్థలో కొత్త బస్సుల ఊసే లేదు. అప్పుడప్పుడు ఇస్తున్నవి రీప్లేస్‌మెంట్ బస్సులే. సంస్థలో ఔట్‌సోర్సింగ్ నియామకాలు, అద్దెబస్సులు పెరిగాయి.

అసిస్టెంట్ విద్యుత్ ఇంజనీర్ల అభ్యర్థులకు ఊరట

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

రాష్ట్రంలోని నాలుగు విద్యుత్ సంస్థల్లో ఎలక్ట్రికల్, సివిల్ అసిస్టెంట్ ఇంజనీర్ల పోస్టుల భర్తీలో మిగిలిపోయిన 238 స్థానాలను మెరిట్ ఆధారంగా భర్తీ చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ పోస్టుల భర్తీకి తాజా నోటిఫికేషన్ జారీ చేయాలన్న హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసింది. మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించింది. సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో మెరిట్ అభ్యర్థులకు పెద్ద ఊరట లభించింది. త్వరలో వివిధ విద్యుత్ సంస్థల్లోని స్థానాల్లో మెరిట్ అభ్యర్థుల నియామకం కానున్నారు.

విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ల భర్తీ కోసం టీఎస్ఎన్‌పీడీసీఎల్(164), టీఎస్‌జెన్‌కో(856), టీఎస్ఎస్‌పీడీసీఎల్(201), టీఎస్‌ట్రాన్స్‌కో(206) పోస్టుల భర్తీకి 2015లో వేర్వేరుగా ఒకే సమయంలో నోటిఫికేషన్లు విడుదల చేశాయి. నవంబర్ మాసంలో పరీక్ష నిర్వహించాయి. ఆ తరువాత విడుదల చేసిన ఫలితాల్లో ఒక్కో అభ్యర్థి ఒకటి కన్నా ఎక్కువ సంస్థల్లో అర్హత సాధించారు. ఫలితంగా 238 పోస్టులు ఖాళీగా మిగిలాయి. దీంతో మెరిట్ ఆధారంగా సీట్ల భర్తీకి వెసులుబాటు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కొద్దిమంది హైకోర్టులో సవాల్ చేశారు. 22.02.1997 జీవో ప్రకారం ఒక్క సీటుకు 1 : 1 ప్రకారం పిలవాలని, కాబట్టి మిగిలిపోయిన సీట్లకు తాజాగా నోటిఫికేషన్ వెలువరించి భర్తీ చేయాలని హైకోర్టును అభ్యర్థించారు. ఉమ్మడి హైకోర్టు సైతం పిటిషన్‌దారులకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ మెరిట్ అభ్యర్థులు ముంజ ప్రవీణ్, శ్రీధర్ తదితరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును పలుమార్లు విచారించిన సర్వోన్నత న్యాయస్థానం.. మెరిట్ అభ్యర్థులకు అనుకూలంగా గురువారం తీర్పు వెలువరించింది.

జీవో నెం. 1997ను ఉమ్మడి హైకోర్టు అపార్థం చేసుకుందని జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తా నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఆ జీవో ప్రకారం వ్యక్తులు సంబంధిత పోస్టులను వీడిపోయిన సమయంలో ఖాళీలు ఏర్పడితే తాజా నోటిఫికేషన్ ప్రకారం భర్తీ చేయాలని న్యాయస్థానం పేర్కొంది. కానీ ఈ కేసులో పరిస్థితి పూర్తి విరుద్ధంగా ఉందని తెలిపింది. ఒకటి కన్నా ఎక్కువ సంస్థల్లో అర్హత సాధించిన అభ్యర్థులను వెరిఫికేషన్ కోసం ఆహ్వానించారని, కానీ ఇప్పటి వరకు అపాయింట్‌మెంట్ లేఖలు ఇవ్వలేదని తీర్పులో పేర్కొన్నారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మెరిట్ ఆధారంగా సీట్ల భర్తీకి స్పష్టతనిస్తూ లేఖ విడుదల చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ లేఖలో తమకు తప్పేమీ కనిపించడం లేదని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. పైగా రాష్ట్ర ప్రభుత్వంతో పాటు విద్యుత్తు సంస్థలు సైతం మెరిట్ అభ్యర్థులకు మద్దతుగా నిలుస్తున్నాయని తెలిపారు. తాజా నియామక ప్రక్రియ చేపడితే చాలా పోస్టులు ఖాళీగా మిగిలిపోతాయని, పైగా భర్తీ ప్రక్రియ ఆలస్యమవుతుందని న్యాయస్థానం పేర్కొంది. ఇక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన అభ్యర్థులు మెరిట్ అభ్యర్థుల కన్నా దిగువస్థానంలో ఉన్నారని కోర్టు స్పష్టం చేసింది. తమకన్నా మెరిట్ స్థాయిలో ఉన్న అభ్యర్థులను ఎంపిక చేయరాదని, తాజా నియామకాలు చేపట్టాలని కోరలేరని కోర్టు స్పష్టం చేసింది. పైగా ఉమ్మడి హైకోర్టు 'ఏపీ ప్రభుత్వం వర్సెస్ భాగం దోరసనమ్మ' కేసులో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును పరిగణలోకి తీసుకోలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. పైవన్నీ కారణాలను పరిగణలోకి తీసుకున్న అనంతరం.. ఉమ్మడి హైకోర్టులో కొంతమంది వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్టు న్యాయస్థానం పేర్కొంది. మెరిట్ ఆధారంగా భర్తీ చేయాలని విద్యుత్తు సంస్థలకు ఆదేశించింది.

మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిపై చర్యలకు ఆవాజ్ డిమాండ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నాగర్‌కర్నూల్ జిల్లాలో మైనారిటీ గురుకుల నిధులను దుర్వినియోగం చేస్తూ అక్రమాలకు పాల్పడుతునన మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సప్తగిరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆవాజ్ రాష్ట్ర శాఖ డిమాండ్ చేసింది. ఎలక్ట్రానిక్ పరికరాలు, గుడ్లు, చికెన్, కూరగాయాలు, నిత్యావసరాలు వంటి వాటి టెండర్ల కేటాయింపులో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని ఆవాజ్ తెలంగాణ శాఖ ఉపధ్యక్షులు మహ్మద్ అబ్బాస్ డిమాండ్ చేశారు. గురుకులాలను సక్రమంగా నిర్వహించి విద్యార్థులకు మంచి పోషక ఆహారం, వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

14 పాఠశాలలకు జాతీయ స్వచ్ఛ పురస్కారాలు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలోని 14 పాఠశాలలు జాతీయ స్వచ్ఛ పురస్కారాలకు ఎంపికయ్యాయి. ఈ వివరాలను ఎంహెచ్ఆర్డీ గురువారం ప్రకటించింది. తెలంగాణలో 40 పాఠశాలలను రాష్ట్రస్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలకు పాఠశాల విద్యాశాఖ ఎంపిక చేసింది. వీటన్నింటినీ జాతీయస్థాయి పురస్కారాల ఎంపిక కోసం పంపించింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పాఠశాలల్లో దేశవ్యాప్తంగా 172 పాఠశాలలు స్వచ్ఛ పురస్కారాలకు ఎంపికయ్యాయి. వీటిలో తెలంగాణ రాష్ట్రం నుంచి 14 పాఠశాలలు ఉండటం గమనార్హం. పాఠశాలల్లో వివిధ సౌకర్యాలను బట్టి ఈ పురస్కారాలకు ఎంపిక చేశారు. ఖమ్మం జిల్లా నుంచి టీఎస్ఎంస్ కారేపల్లి, ఎంపీపీఎస్ మల్లారం, టీఎస్ఎస్‌డబ్ల్యుఆర్ఈఐఎస్ సింగారెడ్డిపల్లెం, ఎంపీయూపీఎస్ గడగలపాడు, కరీంనగర్ జిల్లా నుంచి టీఎస్ఎంస్ గంగధర, యూపీఎస్ కొత్తపల్లి, ఆదిలాబాద్ జిల్లా నుంచి యూపీఎస్ బండల్‌నాగపూర్, మంచిర్యాల నుంచి టీఎస్ఎస్‌డబ్ల్యుఆర్ఎస్(బాలుర) బెల్లంపల్లి, జగిత్యాల జిల్లా నుంచి జెడ్పీహెచ్ఎస్ అంబరిపేట, సిద్దిపేట జిల్లా నుంచి యూపీఎస్ ఇబ్రహీంపూర్, వికారాబాద్ జిల్లా నుంచి ఎంపీపీఎస్ బుద్దారం, మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఎంపీపీఎస్ చౌడగడ్డతండా, సూర్యాపేట నుంచి జెడ్పీహెచ్ఎస్ అనంతరామ్, జయశంకర్ జిల్లా నుంచి జెడ్పీహెచ్ఎస్ తిమ్మాపేట పాఠశాలలు ఎంపికయ్యాయి. ఈ పాఠశాలలకు సెప్టెంబర్ 1న ఢిల్లీలో రూ.50వేల నగదుతో పాటు ప్రశంసపత్రాన్ని అందివ్వనున్నారు.

సేల్స్ ప్రమోటర్లకూ చట్టాలు వర్తింపచేయాలి

ఎఫ్ఎంఆర్ఏఐ జాతీయ ప్రధాన కార్యదర్శి శంతనూచటర్జీ



నవతెలంగాణ - హైదరాబాద్ సిటీబ్యూరో

సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్‌తో పాటు ఇతర కార్మిక చట్టాలన్నింటినీ అమలు చేయాలని ఫెడరేషన్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేషన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి శంతనూచటర్జీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ చట్టం ద్వారా సేల్స్ ప్రమోషన్ ఉద్యోగులందరికీ నియామక ప్రతాలు ఇవ్వాలన్నారు. మెడికల్ అండ్ సేల్స్ ప్రమోటర్స్ అందరికీ కార్మిక చట్టాలు అమలు చేయాలని కోరుతూ హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో గురువారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందుల రంగంలో పనిచేసే సేల్స్ ప్రమోటర్ ఎంప్లాయిస్‌ను హైస్కిల్డ్ ఎంప్లాయిస్‌గా గుర్తించి, వారికి రూ.26,797 కనీస వేతనం ఇవ్వాలనీ, ఇతర రంగంలో పనిచేసే సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్‌కి రూ.24,564 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా కంపెనీలు సేల్స్ ప్రమోషన్స్ ఎంప్లాయిస్‌కు కనీసం గుర్తింపు కార్డులు కూడా ఇవ్వడం లేదని అన్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వడం ద్వారా మార్కెట్‌లో నకిలీ మందుల విక్రయాలను నిరోధించొచ్చని చెప్పారు. మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.రాజుభట్ మాట్లాడుతూ.. రాజ్యాంగం ద్వారా కార్మికులకు వర్తింపచేయాల్సిన చట్టాలన్నింటినీ వర్తింపచేయాలన్నారు. వీరికి ప్రమాద, ఆరోగ్య బీమాను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

ధర్నాకు అధ్యక్షత వహించిన టీఎంఎస్ఆర్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మురళి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు బహుళజాతి సంస్థల, గుత్తాధిపత్య సంస్థల కనుసన్నల్లోనే పనిచేస్తున్నాయని విమర్శించారు. కంపెనీ యాజమాన్యాల కోసం చట్టాలను సవరించి కార్మికుల సంక్షేమాన్ని నిర్వీర్యం చేస్తూ, శ్రమను దోపిడీ చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కార్మిక శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎఫ్ఎంఆర్ఏఐ జాతీయ కార్యదర్శి కామేశ్వరరావు, నాయకులు సునీల్‌కుమార్, ఏజీ రాజమోహన్, టీఎంఎస్ఆర్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ముకుంద్ కులకర్ణి, కార్యదర్శులు పీవీఎస్‌ఏ ప్రసాద్, జి.విద్యాసాగర్, మహేష్ కులకర్ణి, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్పెయిన్..బార్సిలోనాలో ఉగ్రదాడి



మాడ్రిడ్: స్పెయిన్ నగరం బార్సిలోనాలో ఉగ్రదాడి జరిగింది. ఫుట్‌పాత్‌పై నడుచుకుంటూ వెళ్తున్న పాదచారులను వ్యాన్‌తో ఢీకొట్టడంతో 13మంది మృతి చెందగా, యాభై మందికి పైగా గాయపడ్డారు. నగరంలో రద్దీగా ఉండే లాస్ రాంబ్లాస్ వీధిలో గురువారం ఈ సంఘటన జరిగింది. వ్యాన్‌ను పాదచారులపైకి నడిపిన దుండగుడు సమీపంలోని ఓ బార్‌లో దాక్కున్నట్టు ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. అయితే, దాడికి పాల్పడింది ఇద్దరు ఉగ్రవాదులుగా స్థానిక పోలీసులు చెబుతున్నారు. ఓ ఉగ్రవాదిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఆ దాడి ఘటనలో భారతీయులెవరు గాయపడలేదని కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్ తెలిపారు.

అక్రమంగా రూ.1500 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

బినామీ కంపెనీని అందుకు మధ్యవర్తిగా ఉపయోగించినట్టు ఆ పత్రిక తెలిపింది.

మహారాష్ట్ర నుంచి దుబాయ్‌కి..వయా దక్షిణ కొరియా

బుధవారం వెల్లడించిన డీఆర్ఐ నివేదికలో ప్రత్యేకించి ఎంఈజీపీటీసీఎల్‌కు సంబంధించిన అక్రమాలను బహిర్గతపరిచారు. విదేశాలకు డబ్బు తరలించడంలో ఎంఈజీపీటీసీఎల్, ఈఐఎఫ్, పీఎంసీ, శ్రీవినోద్‌శాంతిలాల్ అదానీ కంపెనీలు కుట్రపూరితంగా వ్యవహరించాయని డీఆర్ఐ పరిశోధక నివేదికలో ప్రస్తావించారు. విద్యుత్ ప్రాజెక్టుల కోసం దిగుమతి చేసుకునే పరికరాల విషయంలో కస్టమ్స్ సుంకాలు అతి తక్కువ లేదా జీరోగా ఉంటాయన్నది గమనార్హం. దాంతోపాటు అధిక ధరల్లో చూపిన మొత్తాన్ని విదేశాలకు తరలించడంలో వినియోగించేది పన్ను ఎగవేత డబ్బుగా అర్థం చేసుకోవాలి. ఈ కుట్రను ఎలా అమలు చేశారు..? నివేదిక ప్రకారం మూడు సంస్థలు ఇందులో భాగస్వామ్యమయ్యాయి. ఎంఈజీపీటీసీఎల్, దుబాయ్‌లోని దాని అనుబంధ కంపెనీ ఎలక్ట్రోజెన్ ఇన్‌ఫ్రా ఎఫ్‌జీఈ(ఈఐఎఫ్), కాంట్రాక్టర్ కంపెనీ పీఎంసీ ప్రాజెక్ట్స్(ఇండియా)ప్రయివేట్...డీఆర్ఐ తెలిపిన ప్రకారం పీఎంసీ కూడా అదానీ గ్రూప్ నియంత్రణలోని సంస్థే. పరికరాల సేకరణ కోసం ఈఐఎఫ్‌ను ఎంఈజీపీటీసీఎల్ ఉపయోగించుకున్నది. ఆ ప్రక్రియకు ముందు పరికరాల వాస్తవ తయారీ సంస్థ(వోఈఎం)ల నుంచి పీఎంసీ ద్వారా ఈఐఎఫ్‌కు అవి బదిలీ అయ్యేలా ఏర్పాటు. దక్షిణ కొరియా, చైనాలోని వోఈఎంల నుంచి పరికరాలను సేకరించడం కోసం ఈఐఎఫ్ మధ్యవర్తిగా వ్యవహరించింది. డీఆర్ఐ నివేదిక ప్రకారం దిగుమతైన పరికరాలకు సంబంధించి అదనంగా చూపిన విలువ దాదాపు రూ.1500 కోట్లుగా ది గార్డియన్ పేర్కొన్నది.

తరలించిన డబ్బు ఎటు వెళ్తుంది..?

అక్రమంగా విదేశాలకు తరలించిన రూ.1500 కోట్లు ఎటు వెళ్తుంది..? ఈఐఎఫ్‌ను ఎవరు నియంత్రిస్తున్నారు అన్న ప్రశ్నలకు కూడా డీఆర్ఐ నివేదికలో సమాధానాలున్నాయి. ఈఐఎఫ్‌ను అదానీ గ్రూప్ సన్నిహితులు, ఆ సంస్థ మాజీ ఉద్యోగులతో ఏర్పాటు చేసినట్టుగా ఆ నివేదిక తెలిపింది. ఈఐఎఫ్ అనేది ఎలక్ట్రోజెన్ ఇన్‌ఫ్రా హోల్డింగ్ ప్రయివేట్ లిమిటెడ్(ఈఐహెచ్) అనే మరో సంస్థకు చెందినది. ఈఐహెచ్ యాజమాన్యం మారిషస్‌లోని వినోద్ అదానీ నేతృత్వంలోని ఓ ట్రస్ట్‌దని డీఆర్ఐ తన నోటీస్‌లో తెలిపింది. ఈ అంశాన్ని ఆ కంపెనీ భారత్‌లోని ఓ బ్యాంక్‌కు రాసిన లెటర్ ద్వారా నిర్ధారించింది. బ్యాంక్‌కు ఈఐఎఫ్ ఇచ్చిన లెటర్ ద్వారా దాని కార్యకలాపాలన్నీ వినోద్‌అదానీ నేతృత్వంలోని అసంఖ్యా రిసోర్సెస్ ఫ్యామిలీ ట్రస్ట్ నియంత్రణలోనే ఉంటాయని డీఆర్ఐ పరిశోధనలో వెల్లడైంది. తమ కంపెనీపై వచ్చిన అదనపు విలువకు సంబంధించిన ఆరోపణల్లో నిజం లేదని గత మూడేండ్లుగా అదానీగ్రూప్ ఖండిస్తూనే ఉన్నది. నిబంధనలకు అనుగుణంగానే తమ లావాదేవీలున్నాయని ది గార్డియన్‌కు ఇచ్చిన ఓ ప్రకటనలో ఆ కంపెనీ తెలిపింది. డీఆర్ఐ పరిశోధన గురించి తమకు తెలుసని, దర్యాప్తు సంస్థలకు తాము సంపూర్ణంగా సహకరించామని, తమ సహకారం మున్ముందు కూడా కొనసాగిస్తామని అదానీ కంపెనీ చెబుతోంది.

విధుల్లో చేర్చుకోనందుకు..

(మొదటిపేజీ తరువాయి)

తీసుకువచ్చాడు. సంస్థ పెడచెవిన పెట్టింది. దీంతో చేసేది లేక ఆ ఉద్యోగి అంతకుముందే తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు. కాగా, మల్కాజ్‌గిరి, పరకాల, ఉప్పల్ ఇతర అనేక ప్రాంతాల్లో వాహనాలు ప్రమాదాలకు గురయ్యాయి. ఈ ఫైలట్లను కొన్నాళ్లు పక్కనబెట్టిన సంస్థ ఇటీవలే మళ్లీ విధుల్లోకి తీసుకోవడం గమనార్హం. ఉద్యోగుల పట్ల సంస్థ ఎలాంటి వివక్ష చూపిస్తున్నదో దీనిని బట్టి తెలుస్తున్నది.

రోజుకు 12 గంటల పని

మరోవైపు, 108లో పనిచేస్తున్న ఉద్యోగులు రోజుకు 12 గంటల పనివిధానాన్ని వ్యతిరేకిస్తూ గురువారం కార్మికశాఖ, రంగారెడ్డి జిల్లా జాయింట్ సెక్రటరీ చంద్రశేఖర్‌తో చర్చలు జరిపారు. ఈ చర్చల్లో సుమారు 200 మంది ఉద్యోగులు, జీవీకే అధికారులు పాల్గొన్నారు. తాము రోజుకు 12 గంటలు పనిచేస్తున్నామని, ఇది చట్టానికి విరుద్ధమని, దీనిని 8 గంటలకు కుదించాల్సిందిగా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా 2009 నుంచి 12 గంటలు విధులు నిర్వహిస్తున్నామని, అందువల్ల అదనంగా చేసిన 4 గంటలను ఆ ఏడాది నుంచి అదనపు వేతనంగా తమకు ఓటీగా చెల్లించాల్సిందిగా సంస్థను ఆదేశించాలని కోరారు. ఇదే విషయమై అధికారులు జీవీకే సీఈఓ బ్రహ్మానందరావును వివరణ కోరగా.. ఉద్యోగులందరూ 8 గంటల పని విధానంపై సంతకాలు చేసి నివేదిక సమర్పిస్తే అమలు చేస్తామని చెప్పడం గమనార్హం. ఇక సంస్థ 25 మంది ఉద్యోగులను వివిధ కారణాల వల్ల విధుల నుంచి తప్పించింది.

వారిని తీసుకోవాల్సిందిగా 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లె అశోక్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. జీవీకేను సంప్రదించగా నిరాకరించింది. విషయాన్ని కోర్టులో తేల్చుకోవాల్సిందిగా ఉద్యోగులకు అధికారులు సూచించారు.

కార్పొరేట్ల డార్లింగ్ బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)

పొందిన మొత్తం కార్పొరేట్ విరాళాల్లో 2014-15 ఆర్థిక సంవత్సరంలో 60 శాతం ఉన్నట్టు తెలిపింది.

అగ్రభాగంలో ఉన్న కార్పొరేట్ దాతలు

సత్య ఎలక్టోరల్ ట్రస్ట్ అగ్రశ్రేణి దాతగా నిలిచింది. 2012-16 మధ్యకాలంలో ఈ కంపెనీ బీజేపీకి రూ. 192.6 కోట్లు, కాంగ్రెస్‌కు రూ. 57.25 కోట్లు, ఎన్‌సీపీకి రూ. 10 కోట్లు విరాళంగా అందచేసింది. జనరల్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి బీజేపీకి రూ. 70.7 కోట్లు ముట్టాయి. 2013లో ప్రభుత్వం ఈ ఎలక్టోరల్ ట్రస్టును ప్రారంభించిన విషయం తెలిసిందే. నిబంధనల ప్రకారం... ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు)లో రూ. 20 వేలకు పైగా విరాళాలిచ్చిన దాతల వివరాలను ఎన్నికల కమిషన్‌కు రాజకీయ పార్టీలు అందచేయాలి.

ఆర్ఎస్ఎస్ చీఫ్ పై చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో మంగళవారం ఉదయం 9 గంటలకు మోహన్ భగవత్ జాతీయ జెండాను ఎగురవేశారు. జాతీయ గీతానికి బదులు వందేమాతరాన్ని ఆయన ఆలపించారు. ఇతరులు గుర్తు చేసిన తర్వాత జాతీయ గీతాన్ని ఆలపించారని కలెక్టర్ నివేదిక ఆధారంగా విజయన్ ఆ రాష్ట్ర అసెంబ్లీకి తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించినట్టు కలెక్టర్ నివేదిక తెలిపింది. స్వాతంత్ర్య వేడుకల నిర్వహణపై ఈ నెల 3న ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మార్గదర్శకాలను జారీ చేశారు. ఆ ఆదేశాల ప్రకారం ఎన్నికైన ప్రజాప్రతినిధులు లేదా ఆ పాఠశాల నిర్వాహకులు మాత్రమే జాతీయ జెండాను ఎగురవేయాలి. ఈ నిబంధనను మీడియా గుర్తు చేసిన తర్వాత ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కూడా జాతీయ జెండాను ఎగురవేశారు.

శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే అభివృద్ధి

- డ్రగ్స్, నకిలీ నోట్లు, ఉగ్రవాదం, సీమాంతర ఉగ్రవాదానికి అడ్డుకట్టవేయాలి : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఏదేశమైనా అభివృద్ధి చెందుతూ ప్రగతి పథంలో ముందుకు సాగాలంటే శాంతిభద్రతల పరిరక్షణ ఎంతైనా అవసరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజూ అన్నారు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ తార్నాకలోని ఐఐసీటీలో నెహ్రూ యువకేంద్రం, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా 'జాతీయ భద్రత, ప్రధాని నరేంద్ర మోడీ కార్యాచరణ విజయాలు' అనే అంశంపై గురువారం ఏర్పాటు చేసిన జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా రిజిజూ మాట్లాడుతూ భారతదేశం ఎంతో కాలం అభివృద్ధి చెందుతున్న దేశంగానే మిగిలిపోకూడదని, దేశం పురోగమించడానికి ఇది సరైన సమయమన్నారు. దేశ జనాభాలో 65 శాతం మంది యువవయస్సు కలిగిన వారేనని, ఈ కారణంగా సవాళ్లను స్వీకరించి దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇదే యువకులు వృద్ధులయ్యేలోపే మన దేశం సంపన్న దేశంగా ఆవిర్భవించాలని ఆయన ఆకాంక్షించారు. సీమాంతర ఉగ్రవాదం, మత్తు మందుల అక్రమ రవాణా, దొంగనోట్లు వంటి వివిధ రకాల సవాళ్లను ఎదుర్కొవడానికి పటిష్టమైన భద్రత వ్యవస్థ ఉండి తీరాలన్నారు. ఉగ్రవాదం తదితర ముప్పులను ప్రతి అంతర్జాతీయ వేదికపైన సమర్థవంతంగా ఎదర్కొవడానికి అనేక దేశాలు రహస్య సమాచారాన్ని అందిపుచ్చుకోవాలని మన దేశం ఎప్పుడూ చెబుతూనే వస్తుందన్నారు. ఒక వ్యక్తి సాధించిన విజయానికి కొలమానంగా డబ్బునో, పదవినో ఉపయోగించకూడదని చెబుతూ అర్థవంతమైన ఉపాధిని అన్వేషించడంలో సఫలం కావాలన్నారు. పౌరులు సంతృప్తికరమైన, అర్థవంతమైన జీవనం గడపాలని, తద్వారా ఈ పరిస్థితిని తారుమారు చేయాలన్నారు. కేంద్ర పౌర ప్రధానమైన కార్యక్రమాలను రూపొందిస్తుందని, ప్రతి పౌరుడిని సంతోషంగా ఉంచడమే ఇందులోని ఉద్దేశమని మంత్రి చెప్పారు.

విద్యార్థి జీవితానినతానెంతగానో ఇష్టపడతానని కిరణ్ రిజిజూ అన్నారు మన దేశంలో నావికా దళం అత్యంత పటిష్టంగా ఉందన్న ఆయన నిధులు సరిపడినంతగా లేకపోయినప్పటికీ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ చేసే ప్రతి పని ప్రజలకు ఉపయోగపడాలని కోరుకుంటారని చెప్పారు. పొరుగు దేశాలతో సత్సంబంధాలు ఏర్పరచుకుంటే సరిహద్దు సమస్యలు శాంతియుతంగా పరిష్కరించుకోవచ్చన్నారు. అంతకు ముందు నెహ్రూ యువక కేంద్ర సంఘటన్ వైస్ ఛైర్మెన్ శేఖర్‌రావు తదితరులు మంత్రికి స్వాగతం పలికారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

- కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ ప్రభుత్వ కాలేజీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు జి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్, ప్రచార కార్యదర్శి జబీఉల్లా గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. క్రమబద్ధీకరణ ప్రక్రియ ఆలస్యం అవుతుండడంతో కాంట్రాక్టు అధ్యాపకుల కుటుంబాలు మానసిక క్షోభకు గురవుతున్నాయని తెలిపారు. అసెంబ్లీలో చట్టం చేసి క్రమబద్ధీకరించాలని కోరారు. పంజాబ్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో చేసినట్టుగా ఉద్యోగ భద్రత కల్పించాలని సూచించారు. ఉద్యోగ విరమణ వరకు బేసిక్ జీతం, డీఏ, హెచ్ఆర్ఏ ఇస్తూ ఉద్యోగ భద్రత కల్పిస్తామని విధానపరమైన నిర్ణయం ప్రకటించాలని తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలవుతున్నా ఇంకా జీతం అందలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలు పెరగడంలో కాంట్రాక్టు అధ్యాపకుల పాత్ర గణనీయంగా ఉందని తెలిపారు. సీఎం కేసీఆర్ స్పందించి ఉద్యోగ భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సరుకు రవాణాకు ప్రత్యేక రైల్వేలైన్లు

- అందుబాటులోకి బుల్లెట్ రైళ్లు: రైల్వే శాఖ సహాయ మంత్రి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



సరుకు రవాణకు ప్రత్యేక రైల్వేలైన్లు, ప్రయాణీకుల సౌకర్యార్థం దేశంలోని ప్రధాన నగరాల్లో బుల్లెట్ రైళ్ల సదుపాయాన్ని అందుబాటులోకి తేవడం, రైల్వేలైన్ల విద్యుదీకరణ, డబ్లింగ్ పనులు వేగవంతం చేసే కార్యక్రమాలపై దృష్టి సారించినట్టు రైల్వే శాఖ సహాయ మంత్రి రాజెన్ గోహైన్ చెప్పారు. ప్రధాని నరేంద్రమోడీ స్వచ్ఛ భారత్ మిషన్‌ను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లారని, స్వచ్ఛ భారత్ కార్యక్రమం వల్ల దేశవ్యాప్తంగా పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం వచ్చిందన్నారు. సుందరమైన రవాణా సదుపాయాలను ప్రయాణీకులకు కల్పించడమే తమ లక్ష్యమని చెప్పారు. అన్నారు. గురువారం ఆయన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని స్వచ్ఛభారత్-స్వచ్ఛ రైల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్‌ను దక్షిణ మధ్య రైల్వే అధికారులు చక్కగా అమలుచేస్తున్నారని ఆయన ప్రసంశించారు. రైళ్లను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవడం, చెత్తాచెదారంలేకుండా రైల్వే స్టేషన్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రతపై దక్షిణ మధ్య రైల్వే తీసుకుంటున్న చర్యలను మంత్రి ప్రశసించారు. రైల్వే ప్లాట్‌ఫాంలు, మరుగుదొడ్లు, రైల్వే ట్రాక్‌లు శుభ్రంగా ఉంచడం, రైళ్లల్లో బయోమెట్రిక్ పద్ధతులను అందుబాటులోకి తీసుకువచ్చి అన్ని జోన్ల కంటే దక్షిణ మధ్య రైల్వే ముందుందని ప్రసంశించారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ సికింద్రాబాద్-గుహవాటి, తిరుపతి-బెనారస్ మార్గాల్లో కొత్త రైళ్లు నడిపేందుకు ప్రతిపాదనలు రైల్వే శాఖకు పంపామని, అక్కడి నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే కొత్త రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

కుంతియా వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల్లో భిన్నస్వరాలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కొత్తగా కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన ఏఐసీసీ కార్యదర్శి రామచంద్రకుంతియా తొలి పర్యటనపై పార్టీ నేతల్లో భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. ఆయనను ఇన్‌చార్జిగా ప్రకటించగానే కొంత మంది తాత్కాలికమేంటూ, మరికొంత మంది శాశ్వత ఇన్‌చార్జి అన్న చర్చలు జరిగాయి. తాత్కాలికమా? శాశ్వతమా? అన్నది ఇప్పటికీ పార్టీ నేతల్లో ప్రశ్నగానే మిగిలిపోయింది. ఇటీవల ఆయన రాష్ట్రానికి వచ్చిన సమయంలో పార్టీ నేతలు స్వాగతం పలికింది మొదలు...తిరుగు పయనం వరకు హడావుడి చేయలేదు. రాష్ట్రానికి డిగ్గీ వస్తే ఎంతో ఆర్భాటం చేసే నాయకులు కేవలం ఐదారుగురు నేతలను మాత్రమే వెళ్లి స్వాగతం పలికారు. కుంతియా రాక ముందు నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు ఆయన వెళ్లిన తర్వాత ఒక్కొక్కటి బయటపడుతున్నాయి. మొత్తంగా ఆయన పార్టీలో కుంపట్లు రాజేసిపోయారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. మూడు రోజుల పర్యటనలో ఆయన చేసిన ముఖ్యమైన కామెంట్...వచ్చే ఎన్నికల వరకు రాష్ట్ర నాయకత్వంలో మార్పులు ఉండవ్... రానున్న ఎన్నికలు ఉత్తమ్ ఆధ్వర్యంలోనే జరుగుతాయంటూ కుంతియా మీడియాకు లీకులు ఇవ్వడంతో ఈ చర్చ తారాస్థాయికి చేరింది. ఏఐసీసీ నుంచి వచ్చిన వారెవరూ గతంలో ఈ విధంగా చెప్పుకోలేదు...చెప్పలేదని అలా చెప్పడానికి కాంగ్రెస్ ప్రాంతీయ పార్టీ కాదని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఉత్తమ్ అధ్యక్షుడిగా కొనసాగుతారా? లేక కొత్త వారు వస్తారా? అంటూ ఎవరు కుంతియాను అడగలేదు. అయితే పార్టీ నాయకత్వ మార్పు ఉంటుందని పార్టీలోనూ, ఇటు బయట చర్చ జరుగుతున్న మాట వాస్తవమైనా కుంతియా తొలి పర్యటనతో ఈ చర్చకు దారితీయడం పట్ల పార్టీ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కుంతియా సామాన్య కార్యకర్తను సైతం కలిసేందుకు అవకాశం ఇస్తారని ఒక గ్రూప్ అంటున్నది. జిల్లాల్లో ఉన్న గ్రూపులను తగ్గించి, అటువంటి నేతలతో వన్ టూ వన్ మాట్లాడేందుకు ఆయన సిద్ధమవుతున్నట్టు తెలిసింది. పార్టీ బలోపేతానికి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాలని పార్టీ నేతలకు సూత్రప్రాయంగా ఆయన సంకేతాలిచ్చారు.

ఇవన్నీ ఆయన సామర్థ్యాన్ని తెలియజేసినా...ఆ నలుగురిపై (ఉత్తమ్, జానారెడ్డి, భట్టి, షబ్బీర్‌అలీ)పై పొగడ్తలతో ముంచెత్తడం పట్ల మహబూబ్‌నగర్ చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నాయకులంటే వారేనా? అంటూ పెదవి విరిచారు. ఎన్నికల కెప్టెన్ ఉత్తమ్ అంటూ కుంతియా చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎట్లాగో నాయకత్వ మార్పు తప్పదు...మారుతాడని చెప్పి తానేందుకు బదనాం కావాలని కుంతియా వ్యూహాత్మకంగానే ఈ వ్యాఖ్యలు చేసినట్టు వరంగల్ జిల్లాకు చెందిన నేత ఒకరు చెప్పారు. గతంలో రాష్ట్ర ఇన్‌చార్జిగా ఉన్న దిగ్విజయ్‌సింగ్‌కు కూడా చెప్పలేనివి...ఆనాడు కుంతియాకు చెప్పుకునేవారు. వాటిపై ఆయనకు అవగాహన ఉందని సీనియర్ నేత అంటున్నారు.

సెన్సెక్స్ ▲ 25	నిఫ్టీ ▲ 7	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
31,795	9,904	64.14	రూ. 29,668	రూ. 42,200

కోడిగుడ్లు

హైదరాబాద్	320	విజయవాడ	320
ఒక్కగుడ్డుకు	3.80	చెన్నై	355
వరంగల్	322	ముంబయి	365

మార్కెట్లోకి సియాజ్ స్పోర్ట్స్ కారు



న్యూఢిల్లీ: మారుతీ సుజుకీ సియాజ్ స్పోర్ట్స్ వెర్షన్ కారును 'సియాజ్ ఎస్' పేరుతో మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ సరికొత్త కారు పెట్రోల్, డీజిల్ వర్షన్‌లో లభించనుంది. ధర రూ.9.39 లక్షలు గాను.. డీజిల్ వర్షన్ ధరను రూ.11.55 లక్షలుగాను (ఎక్స్‌షోరూమ్, ఢిల్లీ) కంపెనీ నిర్ణయించింది. సియాజ్ ఎస్' డీజిల్ కారును సరికొత్త ప్రీమియం బ్లాక్ ఇంటిరియర్స్‌తో గ్రే క్రోమ్ ఫినిషింగ్‌తో అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపింది. అలాగే డ్యుయల్ ఎయిర్ బ్యాగ్స్, యాంటీ బ్రేకింగ్ సిస్టమ్, ఈబీడీ, ఐసోఫిక్స్ (చైల్డ్ రెసిట్రెంట్ సిస్టమ్) లాంటి ఫీచర్లతో లభించనున్నట్టు పేర్కొంది. స్మార్ట్ హైబ్రీడ్ టెక్నాలజీతో లభించే డీజిల్ వెరియంట్ లీటర్‌కు 28.09 కిలోమీటర్లు ఇవ్వనుందని కంపెనీ తెలిపింది.

ఆడి నుంచి మరో ఖరీదైన కారు..!



న్యూఢిల్లీ: జర్మన్ కార్ల కంపెనీ ఆడి సంస్థ డిజైన్ ఎడిషన్‌లో స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ క్యూ7, సెడాన్ ఏ6ను మార్కెట్లోకి విడుదల చేసింది. వీటి ధరల శ్రేణి రూ.81.99 లక్షలు, రూ.56.78 లక్షలు (ఎక్స్‌షోరూమ్, ఇండియా)గా కంపెనీ నిర్ణయించింది. ఆడీ క్యూ7 కారు 3 లీటర్ల డీజిల్ ఇంజిన్, 249 హెచ్‌పీ పవర్ సామర్థ్యంతో గంటకు 234 కి.మీవేగంతో దూసుకుపోతుందని కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. అలాగే ఆడీ ఏ6 రెండు లీటర్ల డీజిల్ ఇంజిన్, 190 హెచ్‌పీ పవర్‌తో పాటు సెవెన్ స్పీడ్ ట్రాన్స్‌మిషన్‌తో అందుబాటులోకి రానుందని పేర్కొంది. కంపెనీకి చెందిన సెడాన్ కార్లలో ఆడీ ఏ6 ఇండియాలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా అత్యంత ప్రజాదరణ పొందిందని కంపెనీ తెలిపింది. కాగా లగ్జరీ కార్ల ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో ఆడీ క్యూ7 కారుకు మంచి ఆదరణ లభించగలదని కంపెనీ విశ్వాసం వ్యక్తం చేసింది.

వడ్డీ రేట్లు తగ్గించిన హెచ్‌డీఎఫ్‌సీ

న్యూఢిల్లీ : బ్యాంకులు వరుసగా సేవింగ్స్ ఖాతాలపై వడ్డీ రేట్లకు కోత పెడుతునే ఉన్నాయి. తాజాగా మరో ప్రయివేటు రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కూడా పొదుపు ఖాతాల్లో నగదు నిల్వలపై చెల్లించే వడ్డీని తగ్గించినట్లు గురువారం ప్రకటించింది. రూ.50లక్షల లోపు డిపాజిట్లపై 0.5శాతం వడ్డీని తగ్గిస్తూ 3.5శాతానికి కుదించింది. రూ.50లక్షల పైబడిన డిపాజిట్లపై యథావిధిగా 4శాతం వడ్డీని చెల్లించనున్నట్లు పేర్కొంది. సవరించిన వడ్డీ రేట్లు ఆగస్టు 19 నుంచి అమల్లోకి వస్తాయని బ్యాంకు తెలిపింది. నోట్ల రద్దుతో బ్యాంకుల వద్ద మిగులు నిల్వలు ఉండటం, ద్రవ్యోల్బణం దిగి రావడంతో వడ్డీ రేట్లను బ్యాంకులు తగ్గించేస్తున్నాయని బ్యాంక్ వర్గాలు పేర్కొంటున్నాయి.

బంకుల్లో బహుముఖ సేవలు!

చౌక ధరలకే జనరిక్ మందుల విక్రయాలు

- ఎల్‌ఈడీ బల్బులు, ట్యూబ్‌లు, ఫ్యాన్‌లు కూడా..
- పాన్, ఆధార్‌తో సహా ఇతర 'కార్డు' సేవలు..
- బిల్లు చెల్లింపులు, బ్యాంకుసేవల విస్తరణకు అవకాశం

నవతెలంగాణ, వాణిజ్య విభాగం: దేశంలో ప్రస్తుతం చమురు అవసరాలను మాత్రమే తీరుస్తూ వస్తోన్న పెట్రోలు బంకులు రానున్న రోజుల్లో బహుముఖ సేవా కేంద్రాలుగా మారనున్నాయి. దేశ వ్యాప్తంగా ఉన్న బంకుల ద్వారా చౌక ధరలకే జనరిక్ మందులను విక్రయించనున్నారు. దీనికి తోడు తక్కువ విద్యుత్తు వాడకంతో మేటిగా పని చేసే ఎల్‌ఈడీ బల్బులను, ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్లను కూడా బంకుల ద్వారా ప్రజలకు చేరువ చేయాలని సర్కారు యోచిస్తోంది. ఇందుకు సంబంధించి ఒప్పందాలను కుదుర్చుకుంటోంది. దేశంలో అత్యధిక పెట్రోలు బంకులను ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఆయిల్, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం సంస్థలు నిర్వహిస్తున్నాయి. ఈ మూడు చమురు మార్కెటింగ్ సంస్థలకు దేశ వ్యాప్తంగా దాదాపుగా 55,000 పైగా బంకులు ఉన్నాయి. నిత్యం ఈ బంకులకు చమురు అవసరాల నిమిత్తం 3.5 కోట్ల మంది వచ్చిపోతుంటారని సర్కారు లెక్కలు చెబుతున్నాయి. దీంతో ప్రజా అవసరమైన సేవలను, కీలక పథకాలను ఇక్కడి నుంచే ప్రజలకు చేరువ చేయాలని సర్కారు భావిస్తున్నట్టుగా తెలుస్తోంది.

తక్కువ ధరకే కీలక ఔషధాలు..

దేశ వ్యాప్తంగా ప్రజలకు విరివిగా చౌక ధరలకు ఔషధాలను అందుబాటులో ఉంచాలనే యోచనతో బంకుల్లో 'జనఔషధి' స్టోర్స్ ఏర్పాటు చేయనున్నట్టుగా ప్రభుత్వం వెల్లడించింది. వివిధ సంస్థల వారితో జట్టు కట్టడం ద్వారా బంకుల్లో చమురుయేతర రిటైల్ వ్యాపారాన్ని విస్తరించే దిశగా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సన్నాహాలు చేస్తున్నట్టుగా ప్రభుత్వం వెల్లడించింది. రసాయనాలు మరియు ఎరువుల శాఖలోని ఫార్మాస్యూటికల్ డిపార్ట్‌మెంట్ భవిష్యత్తులో పెట్రోలు విక్రయ కేంద్రాల్లో మెడికల్ స్టోర్స్‌ను ఏర్పాటు చేస్తాయని ప్రభుత్వం తెలిపింది. నిబంధనల ప్రకారం మందుల విక్రయపు స్టోర్స్‌లో అనుభవజ్ఞుడైన ఫార్మాసిస్టులను నియమించాల్సి ఉంటుంది. ఈ సమస్య కారణంగానే బంకుల్లో స్టాల్స్ ఏర్పాటు విషయంలో కాస్త జాప్యం జరుగుతున్నట్టు సమాచారం. అయితే ఈ సమస్యకు ఒక పరిష్కారం కనుగోనే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని సర్కారు వర్గాలు చెబుతున్నాయి.



బల్బులు.. ట్యూబ్‌లు.. ఫ్యాన్‌లు సైతం..

విద్యుత్తు ఆదా చర్యలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుపోవాలని యోచిస్తున్న సర్కారు ఇందుకు బంకులను వేదికగా చేసుకోవాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా ఎక్కువ విద్యుత్తును వినియోగించే సీఎఫ్ఎల్ బల్బుల స్థానంలో ఎల్‌ఈడీ బల్బులను, ఎల్‌ఈడీ ట్యూబ్‌లను, ఫ్యాన్లను బంకుల ద్వారా ప్రజలకు చేరువ చేయాలని చూస్తోంది. 'ఉజాలా' పథకంలో భాగంగా వీటిని బంకుల్లో అందించేందుకు పెట్రోలియం శాఖ 'ఎనర్జీ ఎఫిషియెంట్ సర్వీసెస్' (ఈఈఎస్–ఎల్) సంస్థతో అవగాహన ఒప్పందం కూడా కుదుర్చుకుంది. ఉజాలా పథకం ద్వారా 2019 నాటికి దేశంలో ఉన్న అన్ని సీఎఫ్ఎల్ బల్బుల స్థానంలో ఎల్‌ఈడీ బల్బులను తీసుకువచ్చేందుకు ఈఈఎస్ఎల్ కృషి చేస్తోన్న సంగతి తెలిసిందే.

వివిధ రకాలు ప్రభుత్వ సేవలు కూడా..!

బంకులను బహుముఖంగా విస్తరించాలని యోచిస్తున్న సర్కారు ఇందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను అన్వేషిస్తోంది. ఈ ప్రక్రియలో భాగంగా రానున్న రోజుల్లో బంకులను 'కామన్ సర్వీస్ సెంటర్'గా మార్చే ప్రతిపాదన కూడా పరిశీలిస్తోంది. ఈ కేంద్రాల ద్వారా పాన్ కార్డు, ఈ–ఆధార్ కార్డు సేవలు, కరెంటు బిల్లు, ఫోన్ బిల్లులతో పాటు ఇతర ప్రభుత్వ సేవలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు, చిన్నచిన్న బ్యాంకింగ్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు గల అవకాశాలను చమురు మంత్రుత్వ శాఖ పరిశీలిస్తోంది. ఇందుకు గాను అవసరమైన భాగస్వాములతో చర్చలు జరుపుతోంది. ప్రభుత్వ ప్రయత్నాలు కొలిక్కి వస్తే పెట్రోలు బంకులన్ని రానున్న రోజుల్లో బహుముఖ సేవా కేంద్రాలుగా మారిపోనున్నాయి.

పరుగులు పెడుతోన్న ఫండ్లు

- ఈక్విటీల వైపు 'ఇన్వెస్టర్ల' దృష్టి
- వన్నె తగ్గిన పసిడి, స్థిరాస్తి రంగం
- భారీగా నిధులను తరలిస్తున్న ఫండ్స్
- మూడు నెలల్లో రూ.30, 000 కోట్ల పెట్టుబడులు



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: సంప్రదాయక పెట్టుబడి సాధనాలైన బంగారం, స్థిరాస్తి రంగాల్లో నెలకొన్న స్తబ్దత స్టాక్ మార్కెట్ల ర్యాలీకి బాగా కలిసివస్తోంది. పసిడి ధరలు తక్కువ స్థాయుల వద్ద తచ్చాడుతుండడం, స్థిరాస్తి రంగంలో నెలకొన్న స్తబ్దత నేపథ్యంలో మదుపరులకు వీటిపై ఆసక్తి తగ్గుతూ వస్తోంది. దీంతో వారు తిరిగి స్టాక్ మార్కెట్లలో వైపు దృష్టి సారిస్తున్నారు. గత కొన్ని రోజులుగా మార్కెట్లు రికార్డు స్థాయిలకు చేరి పరుగులు పెడుతుండడం కూడా ఎక్కువ మందిని ఊరిస్తోందని దీంతో ఎక్కువ మంది ఈ దిశగా దృష్టి సారిస్తున్నట్టుగా మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి నాలుగు నెలల కాలంలో బీఎస్ఈ సూచీ సెన్సెక్స్ దాదాపు 10 శాతం మేర పెరిగింది. ఇటీవలే రికార్డు స్థాయిలో 32,000 పాయింట్ల స్థాయిని కూడా తాకింది. ఈ అంశాలు మదుపరులు బాగా ప్రభావితం చేస్తూ వస్తున్నాయి.

రూ.20 లక్షల కోట్లకు విస్తరణ...

ఈక్విటీలు రికార్డు స్థాయిల వద్ద నమోదవుతూ వస్తుండడంతో 'మ్యూచువల్ ఫండ్' (ఎంఎఫ్) మేనేజర్లు దేశీయ మార్కెట్లలోకి భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి నాలుగు నెలల కాలంలో (ఏప్రిల్–జులై మధ్య కాలంలో) ఎంఎఫ్‌లు దాదాపు రూ.30,264 కోట్ల మేర పెట్టుబడులు పెట్టినట్టుగా మార్కెట్ నియంత్ర సంస్థ సెబీ వెల్లడించింది. వివిధ విభాగాల్లో విడివిడిగా పెట్టుబడులు పెట్టే విదేశీ ఎఫ్‌పీఐ మదుపరులను కూడా మించి వీరు మార్కెట్లకు నిధులను తరలిస్తుండడం విశేషం. ఈ ఏడాది మొదటి మూడు నెలల కాలంలో ఎఫ్‌పీఐలు ఈక్విటీల్లో కేవలం రూ.21,000 కోట్ల పెట్టుబడులు మాత్రమే పెట్టినట్టుగా సమాచారం. ఏప్రిల్‌లో రూ.11,244 కోట్లుగా ఉన్న ఎంఎఫ్ పెట్టుబడులు మే నెలలో రూ.9,106 కోట్లుగాను, జూన్ నెలలో రూ.11,800 కోట్లుగాను నమోదు అయ్యాయి. దీంతో దేశీయంగా మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ పరిధి రూ.20,00,000 కోట్ల రికార్డు స్థాయికి చేరువైంది.

మిస్త్రీకి పూర్తిగా 'టాటా' చెప్పేదాం..



న్యూఢిల్లీ : ఉద్వాసనకు గురైన మాజీ చైర్మెన్ సైరస్ మిస్త్రీతో టాటా సంస్థలకు ఉన్న అన్ని సంబంధాలను తెగతెంపులు చేసుకోవాలని టాటా గ్రూపు నిర్ణయించింది. టాటా గ్రూపు ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ఈ సంచలన నిర్ణయానికి వీలుగా బోర్డు సభ్యులకు సూచనలు చేశారని సమాచారం. టాటా సన్స్ బోర్డు, టాటా గ్రూప్‌లోని మేజర్ ఆపరేటింగ్ సంస్థల ప్రమోటర్లు గత నెలలో సమావేశమయ్యాయని, ఈ మీటింగ్‌లో షాపూర్జీ పల్లోంజి గ్రూప్‌తో ఉన్న అన్ని వ్యాపార సంబంధాలను తెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు ఈటీ ఒక కథనాన్ని ప్రచురించింది. టాటా సన్స్ చైర్మన్‌గా వ్యవహారించిన మిస్త్రీకి గతేడాది బోర్డు సభ్యులు అర్థాంతరంగా ఉద్వాసన పలికిన సంగతి తెలిసిందే. ఈ హఠాత్తు పరిణామం అనంతరం నుంచి టాటా సన్స్‌కు, మిస్త్రీకి తీవ్ర వాదోపవాదనలు జరుగుతూనే ఉన్నాయి. అప్పటి నుంచి మిస్త్రీ నుంచి టాటా గ్రూపునకు ఏదో విధంగా తలనొప్పులు వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే టాటా గ్రూప్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. సైరస్ మిస్త్రీ కుటుంబానికి చెందిన అన్ని సంస్థలతో ఉన్న ఒప్పందాలు, భాగస్వామ్యాలను రద్దు చేసుకోవాలని నిర్ణయించారు.

12 ఏండ్ల బాలికకు గుండె మార్పిడి

కాంటినెంటల్ ఆస్పత్రి డాక్టర్ల అరుదైన చికిత్స



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంటినెంటల్ ఆస్పత్రి డాక్టర్లు 12 ఏండ్ల బాలికకు గుండె మార్పిడి శస్త్రచికిత్స చేసి అరుదైన ఘనత సాధించారు. ఆదిలాబాద్‌కి చెందిన త్రిష శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. ఆమెకు పరీక్షలు నిర్వహించగా 'డిస్ప్నీయా' అనే వ్యాధి అని తేలింది. ఆస్పత్రి వైద్యులు బాలిక రెండేండ్లుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్టు నిర్ధారించారు. ప్రతి లక్ష మందిలో ఒకరిద్దరికి మాత్రమే ఇలాంటి వ్యాధి సోకుతుంది. కాగా, ఆరోగ్యవంతంగా ఉన్న పిల్లలకు గుండె పంపింగ్ సామర్థ్యం ద్వారా శరీరమంతా రక్తం సరఫరా శాతం 60 నుంచి 70 శాతం ఉండాలి. కానీ త్రిషకు కేవలం 10 నుంచి 15 శాతం మాత్రమే పంపింగ్ అవుతున్నది. ఈ సమస్యకు పరిష్కారం గుండె మార్పిడి ఒక్కటే. భారీగా ఖర్చయ్యే శస్త్రచికిత్స చేయించేందుకు దినసరి కూలీలైన తల్లిదండ్రులకు స్థోమత లేదు. దీంతో ఆరోగ్య శ్రీ పథకం తమ కుమార్తెకు శస్త్రచికిత్స చేయాల్సిందిగా డాక్టర్లను అభ్యర్థించారు. ఆస్పత్రి డాక్టర్లు జీవన్‌దాన్‌ను సంప్రదించారు. కొన్నాళ్లకు ఎల్‌బీనగర్ గ్లోబల్ ఆస్పత్రిలో సరిపడా దాత ఉందని కాంటినెంటల్ డాక్టర్లకు తెలియడంతో వైద్యబృందం అక్కడికి వెళ్లి ఈ అరుదైన శస్త్రచికిత్సను చేసింది. 24 కి.మీ. దూరంలో ఉన్న గుండెను ప్రత్యేక ఏర్పాట్లు చేసి ద్వారా గంట వ్యవధిలో కాంటినెంటల్ ఆస్పత్రికి తీసుకొచ్చి శస్త్రచికిత్స చేసి విజయం సాధించారు. ప్రస్తుతం త్రిష ఆరోగ్యంగా ఉందని డాక్టర్లు తెలిపారు.

27 నంచి 31వరకు ఉద్యాన మహోత్సవం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ నెల 27 నుంచి 31 వరకు 'ఉద్యాన మహోత్సవం 217' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఉద్యాన శాఖ కమిషనర్ ఎల్. వెంకట్‌రామ్‌రెడ్డి చెప్పారు. నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహించే ఏర్పాట్లపై వివిధ కమిటీ చైర్మెన్‌లు, సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి వ్యవసాయ ముఖ్య కార్యదర్శి సీ. పార్థసారధి హాజరయ్యారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

నవతెలంగాణ–తిమ్మాజిపేట

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం అమ్మపల్లిలో గురువారం జరిగింది. ఎస్ఐ గురుస్వామి వివరాల ప్రకారం...అమ్మపల్లికి చెందిన నారాయణరెడ్డి(53)కి మూడున్నరెకరాల భూముంది. అందులో పత్తి, మొక్కజొన్న సాగు చేశాడు. పంట సాగు కోసం రూ.3 లక్షలకుపైగా అప్పు చేశాడు. వర్షాలు కురవక దిగుబడి రాలేదు. ఈ క్రమంలో అప్పుల వారి బాధలూ ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో మనస్థాపానికి గురైన నారాయణ రెడ్డి తన పొలంలోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను బాదేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెఇపారు.

ప్రమాదంలో ఆరోగ్య రంగం

ప్రముఖ విద్యావేత్త చుక్కారామయ్య ఆందోళన

- ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో ఎఫ్ఎంఆర్ఏఐ సమావేశం
- హాజరుకానున్న 400 మంది ప్రతినిధులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆరోగ్య రంగం ప్రమాదంలో ఉందని ప్రముఖ విద్యావేత్త ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వాస్పత్రులు చేతులెత్తేశాయని, ప్రయివేటు డాక్టర్లు అందినకాడికి దండుకున్నారని చెప్పారు. రెండుమూడు మందులకు బదులు చాంతాడంత చీటీ రాస్తున్నారని విమర్శించారు. ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎంఆర్ఏఐ) జనరల్ కౌన్సిల్ సమావేశం ఫిబ్రవరి 9 నుంచి 11 వరకు హైదరాబాద్‌లో జరుగనుంది. ఈ నేపథ్యంలో సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించేందుకుగాను వివిధ రంగాలకు చెందిన ప్రముఖ వ్యక్తులు, డాక్టర్లు, ఫార్మరంగ యాజమాన్యాలు, వివిధ కార్మిక సంఘాలతో గురువారం సుందరయ్య కేంద్రంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఎంఆర్ఏఐ జీసీఎం–2018 రిసీప్షన్ కమిటీ చైర్మెన్ కూడా అయిన చుక్కరామయ్య మాట్లాడుతూ.. ప్రతి ముగ్గురిలో ఒకరికి క్యాన్సర్ సోకుతున్నా ప్రభుత్వాస్పత్రుల్లో మందులు దొరకడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎఫ్ఎంఆర్ఏఐ జీసీఎం–2018 రిసీప్షన్ కమిటీ వైస్ చైర్మెన్ ఎంకే బోస్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో కనీస వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్మికులను చిన్నచూపు చూస్తు అణగదొక్కేందుకు యత్నిస్తున్నదని విమర్శించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వీఎస్ రావు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై ప్రజలు అసహనంతో ఉన్నారని అన్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడిన ప్రసంగాన్ని కూడా ప్రసారం చేయకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (టీఎంఎస్ఆర్‌యూ) ఐక్యంగా ఉండటంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి కేఎన్ ఆశాలత, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు ప్రకాశ్‌గౌడ్, ఎఫ్ఎంఆర్ఏఐ ప్రధాన కార్యదర్శి శంతనూ చటర్జీ, కార్యదర్శి టీ.కామేశ్వర్‌రావు, కార్యవర్గ సభ్యులు కే.సునీల్‌కుమార్, ఏజీ రాజమోహన్, టీఎంఎస్ఆర్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీ.మురళీ, ఐ.రాజీవ్‌భట్, ఉపాధ్యక్షులు కే.నాగేశ్వర్‌రావు తదితరులు భారీగా పాల్గొన్నారు. కాగా, ఫిబ్రవరిలో జరిగే సమావేశంలో దేశం నలుమూలల నుంచి సుమారు 40 0 మంది జరిగే జనరల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొననున్నారు. వైద్యఆరోగ్యం, మందుల రంగానికి సంబంధించిన అనేక అంశాలతోపాటు భారతీయ పేటెంట్ చట్ట సవరణ – 1970, హేతుబద్ధమైన మందుల విధానం, మందులరంగంపై జీఎస్‌టీ ప్రభావం, ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను మందుల రంగంలోకి ఆహ్వానించడం, మందుల పరిశ్రమలో జరుగుతున్న విలీనం, స్వాధీనంపై సమీక్షించి భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటారు.



మాట్లాడుతున్నా చుక్కారామయ్య

పాతజిల్లాల ప్రకారమే డీఎస్సీ నిర్వహించాలి

- విద్యాశాఖ డైరెక్టరేట్ ఎదుట అభ్యర్థుల ధర్నా

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్ ఉమ్మడి(పాత) జిల్లాల ప్రకారమే ఇవ్వాలని డీఈడీ, బీఈడీ అభ్యర్థుల సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు గురువారం పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ఎదుట అభ్యర్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు రామ్మోహన్‌రెడ్డి, శ్రీనునాయక్ మాట్లాడుతూ... ఐదేండ్లుగా ఐదు లక్షల మంది అభ్యర్థులు ఐదేండ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాల్లో ఖాళీలు ఎక్కువగా ఉన్నాయనీ, కొత్త జిల్లాల కేవలం నాలుగైదు జిల్లాల వారికే లబ్ధి చేకూరుతుందని చెప్పారు. అందరికీ న్యాయం జరగాలంటే ఉమ్మడి జిల్లాల ప్రకారమే నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. రెండురోజుల క్రితం విడుదలైన అటవీశాఖ ఉద్యోగాలకు పాత జిల్లాల ప్రకారమే నోటిఫికేషన్ ఇచ్చారని వారు గుర్తుచేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 13వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరీక్షకు కనీసం 60నుంచి 75రోజుల సమయం ఇవ్వాలన్నారు. ధర్నా అనంతరం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్‌కు, టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ ఘంటా చక్రపాణికి వేర్వేరుగా వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు రవి, భాను, నవీన్, సరస్వతి, కోటేశ్, నరేశ్, బాలు, రమ్య, స్వప్న, శ్రీకాంత్, నవనీత తదితరులు పాల్గొన్నారు.



కొత్త ప్రాజెక్టుల డీపీఆర్‌లు ఇవ్వండి...

తెలంగాణ, ఏపీలకు కృష్ణా బోర్డు లేఖ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కృష్ణా నదిపై వివిధ ప్రదేశాల్లో తెలంగాణ ఏపీ రాష్ట్రాలు నిర్మిస్తున్న కొత్త ప్రాజెక్టుల డీపీఆర్‌లను ఇవ్వాలని కృష్ణా బోర్డు కోరింది. ఈ మేరకు బోర్డు కార్యదర్శి సమీర్ ఛటర్జీ గురువారం రెండు రాష్ట్రాలకు లేఖలు రాశారు. శ్రీశైలం నుంచి నీటిని తరలించే ముచ్చుమర్రి సహా తొమ్మిది ఎత్తిపోతల పథకాలను ఆంధ్రప్రదేశ్ నిర్మిస్తున్నదని కృష్ణా బోర్డుకు తెలంగాణ ఫిర్యాదు చేసింది. పాలమూరు–రంగారెడ్డి, డిండి, తుమ్మిళ్ళ, భక్తరామదాసు సహా ఆరు ఎత్తిపోతల పథకాలను తెలంగాణ నిర్మిస్తున్నదని ఏపీ ఆరోపించింది. గతంలో జరిగిన బోర్డు సమావేశాల్లోనూ, ఢిల్లీలో జరిగిన అపెక్స్ కమిటీ సమావేశంలో ఈ ప్రాజెక్టులపై చర్చ జరిగింది. బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌లో లేని ప్రాజెక్టులు, రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొనని ప్రాజెక్టులను కొత్త ప్రాజెక్టులుగా కృష్ణా బోర్డు భావిస్తున్నది. కొత్తగా నిర్మిస్తున్న ప్రాజెక్టులకు కృష్ణా బోర్డు నుంచి కానీ కేంద్ర జలసంఘం నుంచి కానీ అనుమతులు తీసుకోలేదని రెండు రాష్ట్రాలూ పరస్పర ఆరోపణలు చేసుకున్నాయి. ఆ ప్రాజెక్టుల డీపీఆర్‌లు కావాలని కృష్ణా బోర్డుపై ఒత్తిడి పెంచాయి. రాష్ట్రంలో నిర్మిస్తున్న పాలమూరు రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులు కొత్తవి కావని గతంలో ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైనవేనని తెలంగాణ పలుమార్లు స్పష్టం చేసింది.

ఏకే రూపన్‌వాలా దిష్టిబొమ్మ దహనం చేసిన టీమాస్

నవతెలంగాణ బ్యూరో –హైదరాబాద్

హెచ్‌సీయూ పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్‌వేముల ఆత్మహత్యపై ఏకే రూపన్‌వాలా ఏకసభ్య కమిషన్ ఇచ్చిన రిపోర్టును టీమాస్ ఫోరం రాష్ట్రకమిటీ తప్పుబట్టింది. గురువారం హైదరాబాద్‌లో రూపన్‌వాలా దిష్టిబొమ్మకు చెప్పులదండవేసి, దహనం చేసింది. ఈ సందర్భంగా టీమాస్ ఫోరం స్టీరింగ్ కమిటీ సభ్యులు జాన్‌వెస్లీ మాట్లాడుతూ... ప్రపంచ పరిణామాలపై బాధపడి, వ్యక్తిగత ఇబ్బందులతో రోహిత్ ఆత్మహత్య చేసుకున్నారని రిపోర్టు ఇవ్వడం సమస్యను పక్కదారి పట్టించడమేనని అన్నారు. రోహిత్ ఆత్మహత్యకు కారకులపైన కేంద్రమంత్రులు స్మృతి ఇరానీ, దత్తాత్రేయను రక్షించే విధంగా రిపోర్టు ఉన్నదనీ, రోహిత్ ఎస్సీ కాదు బీసీ అని చెప్పడం కమిషన్ పనికాదని తెలిపారు. కులం పేరిట వివక్ష ఎదుర్కొని, వేధింపులకు గురై ఆత్మహత్య చేసుకున్నట్టు ఆధారాలు ఉన్నా వాటన్నింటినీ తుంగలో తొక్కారని విమర్శించారు. ఈ నివేదికను తిరస్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో టీమాస్ ఫోరం సభ్యులు కోల జనార్ధన్, కిల్లె గోపాల్, శ్రీరాంనాయక్, నాగేశ్వర్‌రావు, అబ్బాస్, శోభన్‌నాయక్, నగర నాయకులు సహదేవ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



బూటకపు రిపోర్టు: ఎస్ఎఫ్ఐ

రోహిత్‌వేముల మృతిపై రూపన్‌వాలా కమిటీ ఇచ్చిన నివేదికపూర్తి బూటకమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ అభిప్రాయపడింది. ఈమేరకు గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం నాగేశ్వర్‌రావు, కోట రమేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. రోహిత్ కుల వివక్ష, వేధింపుల ఆధారంగానే ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. బీజేపీ మంత్రులు, వీసీ అప్పారావును రక్షించేందుకే ప్రభుత్వం కావాలని తప్పుడు రిపోర్టులు ఇప్పించిందని మండిపడ్డారు.

రిపోర్టుపై రాష్ట్ర ప్రభుత్వం వైఖరి చెప్పాలి: కేవీపీఎస్

బీజేపీ మంత్రులు, నేతలను రక్షించేందుకే రూపాన్‌వాలా ప్రయాసపడ్డారని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ అభిప్రాయపడింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కాడిగల్ల భాస్కర్, టి స్కైలాబ్‌బాబు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రోహిత్ దళితుడేనని స్థానిక జిల్లా కలెక్టర్, జాతీయ ఎస్సీ కమిషన్ చెప్పారనీ, కానీ రూపాన్‌వాలా మాత్రం బీసీ అని పేర్కొనడం సరికాదని అన్నారు.

రక్ష



మెమరీ ఖ'లాస్'

యాభై ఏండ్ల తర్వాత ఎక్కువ మందిలో వచ్చే సమస్య మతిమరుపు. దీన్ని కొన్ని మందులతో నయం చేసుకోవచ్చు. అయితే.. మందులతో నయం కాని మతిమరుపు సమస్యలు కొన్ని ఉంటాయి. అవి అల్జీమర్స్ డిమెన్షియా, లెవీ బాడీ డిమెన్షియా, ఫ్రంటో టెంపరల్ డిమెన్షియా, పిక్ డిసీజ్, మల్టీ ఇన్‌ఫార్క్ట్ డిమెన్షియా. డిమెన్షియా వచ్చిన రోగుల్లో 50-60 శాతం మందికి అల్జీమర్స్ డిమెన్షియా, లెవీ బాడీ డిమెన్షియా, ఫ్రంటో టెంపరల్ డిమెన్షియాలో ఏదోకటి ఉంటుంది. అన్నింటికంటే అల్జీమర్స్ డిమెన్షియా ఎక్కువ మందికి వస్తుంది.

మనందరం ఏదో ఒక విషయాన్ని మరచిపోతుంటాం. ఇలా మరచిపోవడం వల్ల కలిగే నష్టం తాత్కాలికంగా ఇబ్బంది కలిగించినా దాని వల్ల మన రోజువారీ పనులకు ఏ మాత్రం ఆటంకం ఉండదు. కాస్త వయసు పైబడ్డ తర్వాత మతిమరపు వచ్చిందనుకోండి. దానివల్ల కొన్ని నష్టాలున్నా జీవితం పెద్దగా అస్తవ్యస్తం కాదు. కానీ అల్జీమర్స్ అలా కాదు. మరపు, మతిమరపు తారస్థాయికి చేరుకుంటే వచ్చే రుగ్మత ఇది. అల్జీమర్స్ రోగుల్లో మెదడు క్రమంగా కుంచించుకుపోతుంటుంది. దాంతో మెదడు కణాలు క్రమంగా నశించిపోతాయి. అయితే.. ఎందుకిలా జరుగుతుందన్న అంశంపై ఇప్పటికీ పూర్తి స్పష్టత లేదు. ఈ విషయంపై పరిశోధనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు లభ్యమైన ప్రాథమిక సమాచారాన్నిబట్టి పర్యావరణ అంశాలతో పాటు జన్యుపరమైన కారణాలూ ఈ వ్యాధికి దోహదపడుతున్నాయని కొందరు నిపుణులు అంటున్నారు.



గుర్తించడమెలా?

మతిమరపునకు చాలా కారణాలు దోహదం చేస్తాయి. ఉదాహరణకు పక్షవాతం, మెదడులో గడ్డలు (ట్యూమర్స్), మెదడులో రక్తస్రావం (హ్యామరేజ్) వంటివి. అయితే రోగికి వచ్చిన మతిమరపు అన్నది అల్జీమర్స్ కారణంగానే అని నిర్ధారణ చేయడం ఒకింత కష్టమైన ప్రక్రియ. దీనికి సీటీ స్కాన్, ఎమ్మారై (బ్రెయిన్) వంటి పరీక్షలు దోహదపడతాయి. ఇందులో మెదడు కుంచించుకుపోయినట్టుగా కనిపించడాన్నిబట్టి అల్జీమర్స్‌ని గుర్తించొచ్చు. అలాగే రోగి చెప్పే లక్షణాలతో, వైద్యపరీక్షల ఫలితాలను సరిపోల్చి దీన్ని నిర్ధారణ చేయొచ్చు.

నివారణ

పక్షవాతాన్ని, డయాబెటిస్‌ని నివారించడానికి అనుసరించే సాధారణ జీవనశైలి సూచనలే అల్జీమర్స్‌ని నివారిస్తాయి. ఆరోగ్యకరమైన జీవనశైలి, పొగతాగడం, మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉండటం, శరీరానికి అలసట రాని విధంగా తేలికపాటి వ్యాయామం (నడక వంటివి) చేయడం ద్వారా దీన్ని నివారించొచ్చు. అలాగే సాధారణంగా కలిగే ఒత్తిళ్ల నుంచి దూరంగా ఉండాలి. స్నేహితులతో, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపటం కూడా అల్జీమర్స్ వ్యాధికి మంచి నివారణ.

చికిత్స

ప్రస్తుతం అల్జీమర్స్ వ్యాధి వచ్చేందుకు పట్టే సమయాన్ని, ఒకవేళ వస్తే దాని తీవ్రత ముదరడానికి పట్టే సమయాన్ని వీలైనంతగా ఆలస్యం చేసేందుకు మాత్రమే మందులు ఉన్నాయి. అల్జీమర్స్‌ని పూర్తిగా తగ్గించే మందుల కోసం ఇంకా పరిశోధనలు కొనసాగుతున్నాయి. అల్జీమర్స్ అసలు రాకుండానే నివారించడం కోసం వ్యాక్సిన్‌ను రూపొందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

జాగ్రత్తగా చూసుకోవాలి

మతిమరుపు సమస్య రావడానికి ముఖ్య కారణాలు కొన్ని ఉంటాయి. మూత్రపిండాలు సరిగా పనిచేయక మలిన పదార్థాలు శరీరంలో మిగిలిపోయి కాలేయం సరిగా పనిచేయకపోవడం వల్ల, దానికి సంబంధించిన మలినాలు శరీరంలో మిగిలిపోవడం వల్ల మతిమరుపు వస్తుంది. ఒక్క శాతం మందికి మాత్రమే వంశపారంపర్యంగా ఇది సంక్రమిస్తుంది. పురుషుల కంటే మహిళల్లో మూడింతలు ఎక్కువ. అల్జీమర్స్ ఉన్నవారు తక్కువగా ఉపయోగించే పదాలు మొదట మరిచి పోతారు. చెప్పిన మాటలే పదే పదే మాట్లాడుతూ ఉంటారు. 5-10 నిమిషాల ముందు జరిగిన విషయాలు కూడా మరచిపోతారు. వయసుతో పాటు పెద్దవారిలో వచ్చే ఈ సమస్యను కుటుంబ సభ్యులు అర్థం చేసుకోవాలి. న్యూరో ఫిజీషియన్లు చెప్పే సూచనలను పూర్తిగా పాటించాలి. రోగులను ఎప్పుడూ ఒంటరిగా ఉండనివ్వకూడదు. వారిని జాగ్రత్తగా కనిపెట్టుకుని ఉండాలి.



– డాక్టర్ ఎం. చంద్రశేఖర్ రెడ్డి, న్యూరో ఫిజీషియన్


తల్లి ఏది తీసుకుంటే బిడ్డ అదే!

గర్భిణులు తీసుకునే ఆహార పదార్థాల రుచులు పుట్టబోయే శిశువుల ఆసక్తులను నిర్దేశిస్తాయట. యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో చేసిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. గర్భిణులు తీసుకునే ఆహారాన్నిబట్టే భవిష్యత్తులో శిశువులు ఆహార పదార్థాలను ఇష్టపడటం ఉంటుందని తేలింది. గర్భిణులు ఎంత పోషకాహారం తీసుకుంటే శిశువు తెలివితేటలు అంతగా వృద్ధి చెందుతాయని పరిశోధకులు గుర్తించారు. పరిశోధనలో భాగంగా గర్భంతో ఉన్న ఎలుకలను ఎంచుకున్నారు. వాటిని మూడు గ్రూపులుగా విభజించారు. ఒక బృందానికి రుచులు లేని సాధారణ ఆహారం, మరో బృందానికి అన్ని రకాల రుచులు, మూడో బృందానికి ఘాటు రుచుల ఆహారాన్ని పెట్టారు. ఆ ఎలుకలు ప్రసవించిన తర్వాత వాటి పిల్లలు తీసుకునే ఆహారాన్ని పరిశీలించారు. తల్లి గర్భంతో ఉన్నప్పుడు తీసుకున్న ఆహారాన్నే అవి తీసుకోవడాన్ని గుర్తించారు. దీన్నిబట్టి గర్భిణులుగా ఉన్న సమయంలో తీసుకునే ఆహారం బిడ్డ ఇష్టాయిష్టాలను నిర్దేశిస్తుందని నిర్ధారించారు.



ఒకేచోట కూర్చొని ఉంటే ముప్పే

నిరంతరంగా కూర్చొని ఉండే వారికి ఆరోగ్య సమస్యలు అధికమవుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. అవి తీవ్ర రూపం దాల్చి ప్రాణసంకటంగా మారుతాయని హెచ్చరిస్తున్నాయి. రోజుకు 11 గంటలకు పైగా ఒకేచోట కూర్చొని ఉండేవారికి జీవితకాలం తగ్గుతుందని ఆస్ట్రేలియాలోని సిడ్నీ యూనివర్సిటీ చేపట్టిన అధ్యయనంలో తేలింది. 45 ఏండ్లు, అంతకు మించిన వయసు కలిగిన 2.22 లక్షల మందిని పరిశీలించగా ఈ మేరకు ఫలితాలు వచ్చాయని పరిశోధకులు వెల్లడించారు. రోజూ వ్యాయామం చేయకుండా, సరైన ఆహారం తీసుకోకుండా ఒకేచోట కూర్చొని పనిచేయడం, టీవీలు, కంప్యూటర్లకు అతుక్కుపోవడం వల్ల ఆయుష్షు తగ్గుతుందని గుర్తించారు.



నల్ల ద్రాక్షతో గుండెకు బలం

నల్లద్రాక్ష పండ్లు హృద్రోగ సమస్యలకు చెక్ పెడతాయని ఇజ్రాయేల్ హై ఫాలోని రంబం మెడికల్ సెంటర్ చేసిన అధ్యయనంలో తేలింది. నల్లద్రాక్షలోని యాంటీ యాక్సిడెంట్లు గుండె సంబంధ సమస్యలను అరికడతాయని వెల్లడైంది. ఈ విషయాన్ని 'డైలీ ఎక్స్‌ప్రెస్' ప్రచురించింది. రోజూ అర కప్పు నల్ల ద్రాక్ష తీసుకోవడం వల్ల గుండెకు బలం చేకూరుతుందని పేర్కొంది.



బ్రేక్‌ఫాస్ట్ తప్పనిసరి!

స్కూల్‌కు పిల్లలు, ఆఫీస్‌కి పెద్దలు వెళ్లేందుకు హడావుడి చేస్తుంటారు. ఉదయం తీసుకోవాల్సిన బ్రేక్‌ఫాస్ట్‌కు బ్రేకులు వేస్తారు. లంచ్ వరకు దాన్ని కొనసాగిస్తుంటారు. టైమ్ లేదంటూ ఉదయం పూట ఏమీ తినకుండా వెళ్లిపోతారు. ఇది ఎంత మాత్రం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. ఎన్ని పనులున్నా తప్పనిసరిగా ఉదయం అల్పాహారం తీసుకోవాలని సూచిస్తున్నారు. అందుకు వారు చెబుతున్న కారణాలు ..

రాత్రి నుంచి ఉపవాసం ఉంటూ మరుసటి రోజు లంచ్ టైమ్ వరకు దాదాపు 15 గంటల పాటు కడుపు ఖాళీగా ఉండటంతో ఎసిడిటీ పెరగడంతో పాటు త్వరగా అలసట వస్తుంది. ఇలాగే మరిన్ని రోజులు కొనసాగితే..ముందుగా రక్తహీనత ఆ తర్వాత అజీర్తి వంటి శారీరక రుగ్మతలు దరిచేరుతాయి. పనిమీద ఆసక్తి తగ్గడం, చిరాకు వంటి మానసిక సమస్యలు వస్తాయి. వీటికి కారణం.. శరీరానికి అవసరమైన పోషకాలు లోపించడం. ఈసమస్యలన్నింటినీ ఉదయం పూట ఆహారం తీసుకోకపోవడమే ప్రధాన కారణమని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ అధ్యయనంలో వెల్లడైంది.



తగినంత శక్తి కావాలంటే..

తగినంత శక్తి అందినప్పుడే శారీరక, మానసికారోగ్యం బాగుంటుంది. ఆరోగ్యం బాగుంటేనే చేసే పనిపై శ్రద్ధ పెరుగుతుంది. శరీరానికి శక్తి అందించే ఆహారం సమయానుకూలంగా తీసుకోవాలి.. అప్పుడే శక్తి అందుతుంది. తీసుకున్న ఆహారం నాలుగు గంటల్లోగా జీర్ణం అయిపోయి.. శక్తిగా మారుతుంది. ప్రతి నాలుగు గంటలకోసారి ఏదో ఒకటి తింటుంటే శక్తి నిరంతరాయంగా అందుతుంది. మనం రాత్రివేళ ఎనిమిది గంటల నుంచి పది గంటలలోగా నిద్రపోతాం. ఉదయం బ్రేక్ ఫాస్ట్ తినకుండా లంచ్‌టైమ్ వరకు ఆగితే.. శరీరానికి అందే శక్తి ప్రవాహంలో అటంకం వచ్చి అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది.

ముఖ్యంగా చిన్నారులు..

స్కూల్‌కు వెళ్లే చిన్నారులకు తప్పనిసరిగా బ్రేక్‌ఫాస్ట్ ఇవ్వాలి. వారి పెరుగుదలకు కావాల్సిన పోషకాలు ఉండేలా అల్పాహారం ఉండాలి. పిల్లలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతంగా ఉండాలంటే ఇది తప్పనిసరి. ఆకలితో స్కూల్‌కి వెళ్లే పిల్లలు టీచర్ చెప్పే విషయాలపై ధ్యాస పెట్టలేరు. అల్పాహారం తీసుకోకపోతే అది వారి జ్ఞాపకశక్తిపై, ఆలోచనా సామర్థ్యంపై ప్రభావం చూపుతుందని పలు పరిశోధనల్లో వెల్లడైంది.

తెలుసుకుందాం..

బోన్ క్యాన్సర్లు- ప్రభావం

బోన్ క్యాన్సర్లంటే అవి ఎముకల్లో పుట్టేవి మాత్రమే కాదు. కొన్నిసార్లు ఇతర భాగాల్లో ఉన్న క్యాన్సర్లు కూడా ఎముకలకు పాకవచ్చు. అలాగే ఎముకల్లో పుట్టిన క్యాన్సర్ ఇతర భాగాలకూ పాకవచ్చు . అయితే ఈ క్యాన్సర్లన్నింటికీ చాలా వేగంగా వ్యాపించే లక్షణం ఒకటుందని అంటున్నారు వైద్య నిపుణులు. ఈ క్యాన్సర్లను ఎంత తొందరగా గుర్తించి చికిత్స తీసుకుంటే అంత మంచిదని సూచిస్తున్నారు.


ఎముకల్లో రెండు రకాల క్యాన్సర్ కణుతులు వస్తూ ఉంటాయి. వీటిని ప్రైమరీ, సెకండరీ బోన్ క్యాన్సర్స్ అంటూ ఉంటాం. ఎముకల్లో పుట్టేవి ఒక రకమైతే, శరీరంలోని ఇతర భాగాల్లో పుట్టి ఎముకల్లోకి పాకేవి రెండో రకం. అయితే ఎముకల్లో పుట్టే క్యాన్సర్ కణుతులు తక్కువే కాని. బయట ఎక్కడో పుట్టి, ఎముకల్లోకి విస్తరించేవే ఎక్కువ. నిజానికి అన్ని రకాల క్యాన్సర్లు ఎముకలకు పాకవచ్చు. అయితే.. కొన్నిరకాల క్యాన్సర్లు చాలా వేగంగా పాకుతాయి. ప్రోస్టేట్ క్యాన్సర్ ఈ కోవకే వస్తుంది. అందుకే ప్రోస్టేట్ క్యాన్సర్ ఉన్నట్టు తేలిన వారికి వెంటనే బోన్ స్కాన్ చేయించడం తప్పనిసరి. అలాగే కిడ్నీ క్యాన్సర్, లంగ్ క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ కూడా ఎముకలకు పాకే అవకాశాలు చాలా ఎక్కువ. ఈ కారణంగానే రొమ్ము క్యాన్సర్‌కి వైద్యం చేయించుకున్న తర్వాత కూడా ప్రతి ఏటా బోన్‌స్కాన్ అవసరం.

ప్రైమరీ బోన్ క్యాన్సర్

ఎముకల్లోనే వచ్చే ప్రైమరీ క్యాన్సర్లు 25 ఏండ్ల లోపు వారిలోనే ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. అరుదుగా కొంత మందిలో 65 ఏండ్లు దాటిన వారిలో కూడా రావచ్చు. ప్రైమరీ బోన్ ట్యూమర్లు ముఖ్యంగా అతి సాధారణంగా కనిపించేవి మూడు రకాలు. వాటిలో ఆస్టియో సార్కోమా ఒకటి. ఇది ఎముక నుంచి పుడుతుంది. దీని చాలా వేగంగా పెరిగే లక్షణం ఉంటుంది. రెండోది ఈవింగ్ సార్కోమా. ఇది న్యూరల్ క్రస్ట్ నుంచి పుడుతుంది. ఇది ఎక్కువగా 5 నుంచి 15 ఏండ్ల లోపు వారిలో కనపడుతూ ఉంటాయి. మూడోది స్కాండ్రో సార్కోమా. ఇది ఎముకలోని కార్టిలేజ్ నుంచి వచ్చే కణతి. ఇది కొంత అరుదుగానే వస్తుంది.

ఆస్టియో సార్కోమా

ఆస్కియో సార్కోమా పదేండ్లు దాటిన వారిలోనే ఎక్కువగా కనిపిస్తుంది. దాదాపు 20 ఏండ్ల వయస్కు దాకా ఈ క్యాన్సర్ బారిన పడొచ్చు. తొడ, మోకాళ్లు, భుజం, మోచేతి ఎముకల్లో ఎక్కువగా వస్తుంది. 70 శాతం దాకా మోకాలి కీళ్లకు పైన గానీ, కింద గానీ ఇది కనిపిస్తుంది. దీనికి చాలా వేగంగా వ్యాపించే లక్షణం ఉంటుంది. బాల్యంలో రేడియేషన్ తీసుకున్న వారిలో ఈ ఆస్టియో సార్కోమా వచ్చే అవకాశాలు మిగతా వారితో పోలిస్తే కాస్త ఎక్కువగా ఉంటాయి. అంతకు ముందే ఒకసారి క్యాన్సర్ ట్రీట్‌మెంట్ తీసుకున్న వారిలో కూడా ఈ క్యాన్సర్ ఎక్కువగా కనిపిస్తుంది. ఈ క్యాన్సర్‌లో లక్షణాలు పెద్దగా కనిపించవు. కాకపోతే స్వల్పంగా ఆయా భాగాల్లో నొప్పి ఉంటుంది. అందుకే పిల్లలు ఈ విషయమై నిర్లక్ష్యంగానే ఉండిపోతారు. ఆ నొప్పిని అంతకు ముందు ఏదో దెబ్బతగలడానికి ముడిపెట్టి, ఇది ఆ నొప్పే అనుకుంటారు. ఆ భాగంలో నొప్పితో పాటు వాపు రావడం, ఆ భాగంలోని చర్మం మెరుస్తున్నట్లు అనిపించడం ఉంటాయి. అప్పటికైనా క్యాన్సర్‌ని గుర్తించకపోతే ఆ ఎముక బాగా బలహీనపడుతుంది. ఒక్కోసారి అది విరిగిపోవచ్చు. ఈ సమస్యను గుర్తించడానికి ముక్క పరీక్ష (బయాప్సీ) చేయించాల్సి ఉంటుంది. నీడిల్ ద్వారా ఈ పరీక్ష జరుగుతుంది. ఈ సమస్య ఆస్టియో సార్కోమాగా నిర్ధారణ జరిగిపోయాక ఆ వ్యాధి ఏ స్టేజ్‌లో ఉందో నిర్ధారిస్తారు. ఈ క్యాన్సర్లన్నీ ఎక్కువగా శ్వాసకోశాలకు పాకే అవకాశం ఉంటుంది. అందుకే బోన్ స్కాన్‌తో పాటు సీటీ స్కాన్ చేయాల్సి ఉంటుంది. అలాగే ఆల్ట్రాసౌండ్ పరీక్ష ద్వారా శరీరంలోని ఇతర భాగాల్లోకి ఏమైనా పాకిందేమో పరిశీలిస్తారు. క్యాన్సర్ అప్పటికే బాగా ముదిరిపోయి ఉంటే కీమో థెరపీ ఒక్కటే చికిత్సా విధానం. ఒకవేళ క్యాన్సర్‌ని తొలి దశలోనే గుర్తించి అప్పటికింకా అది ఒక భాగానికి పరిమితమై ఉంటే ఆ భాగాన్ని ఒకప్పటిలా తీసివేసి అలాగే వదిలేయకుండా దాన్ని నిలబెట్టే లింబ్ కన్సర్వేటివ్ సర్జరీ చేస్తారు. అంటే.. ఆ భాగంలో ఒక కృత్రిమ ఎముకను అమరుస్తారన్నమాట. అవసరమైతే కీలును కూడా మారుస్తారు. అయితే.. వీరికి ముందు కీమోథెరపీ ఇచ్చి ఆ తర్వాత సర్జరీ చేస్తారు. కీమో థెరపీ వల్ల క్యాన్సర్ కణతి ఏ మేరకు నశించిపోయిందో తెలుసుకుంటారు. ఇంకా బతికున్న క్యాన్సర్ కణుతులను గమనించి ఆ తర్వాత కూడా కీమో థెరపీ ఇస్తారు. ఆస్టియో సార్కోమాను గుర్తించడంలో బాగా ఆలస్యమైపోత అప్పుడు ఆ ఎముక స్థానంలో కృత్రిమ ఎముకను బిగించే అవకాశాలు ఉండవు. ఎముకలో కణతి ఓ ఏడెనిమిది సెంటీ మీటర్ల కన్నా పెద్దదైనప్పుడు ఎముక బలహీనపడి అప్పటికే విరిగిపోయి ఉంటే, ఎముక చుట్టూ ఉండే కండరాలు కూడా ఈ క్యాన్సర్‌తో బాగా ప్రభావితమైనప్పుడు రక్తనాళాల్ని కూడా ఆవహించిన ప్పుడు ఇంక ఆ అవయవాన్ని మొత్తంగా తీసివేయడం తప్ప లింబ్ కన్సర్వేషన్ సాధ్యం కాదు.



ట్రీట్‌మెంట్ పూర్తి అయిపోయిన తర్వాత ఆ వ్యక్తిని నిరంతం పరీక్షలు చేయాల్సి ఉంటుంది. కారణమేమింటే.. ఈ క్యాన్సర్ శ్వాసకోశాల్లోకి పాకే అవకాశాలు ఎక్కువ. ఏమైనా సర్జరీ కన్నా ముందే కీమో థెరపీ ఇవ్వడం వల్ల ఫలితాలు ఇప్పుడు ఫలితాలు బాగుంటున్నాయి. ఈ క్యాన్సర్లను చాలా



ముందుగా గుర్తించినప్పుడే చికిత్సతో ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయి. అందుకే పిల్లలు ఏ కాస్త కుంటుతున్నట్లు అనిపించినా వెంటనే పీడియాట్రిషియన్‌కి తప్పనిసరిగా చూయించాలి.

ఈవింగ్ సార్కోమా

ఇది బాగా చిన్నపిల్లల్లోనే అంటే 5 నుంచి 10 ఏండ్ల లోపు వారిలోనే ఎక్కువగా కనిపిస్తుంది. ఇది ఎముకలోని న్యూరల్ క్రస్ట్ కణాల్లోంచి పుడుతుంది. ఇది పెద్ద ఎముకల్లోనే కాకుండా చిన్న ఎముకల్లోనూ అంటే పక్కటెముకల్లో, వెన్నెముకల్లోనూ రావచ్చు. వీటికి ప్రత్యేకమైన ఇమ్యూనో కెమికల్ మార్కర్స్ ఉన్నాయి. దీన్ని సీడీ-99 అంటారు. ఇది పాజిటివ్‌గా వస్తే ఈవింగ్ సార్కోమా కావడానికి అవకాశాలు ఎక్కువ. ఇది కూడా నొప్పిని, వాపును కలిగిస్తుంది. తరుచూ స్వల్పంగా జ్వరం కూడా రావచ్చు. ఈవింగ్ సార్కోమాను రౌండ్‌సెల్ ట్యూమర్ అని కూడా అంటారు. ఈ ట్యూమర్స్ కీమో, రేడియేషన్ థెరపీలతో తగ్గుముఖం పట్టే అవకాశం ఎక్కువగా ఉంది. సకాలంలో సరైన చికిత్స అందకపోతే ఈ ట్యూమర్ ఎముక మజ్జలోకి, శ్వాసకోశాల్లోకి పాకే అవకాశం ఉంది. అందుకే ఈ క్యాన్సర్ వచ్చిన వాళ్లకు శరీరం మొత్తాన్ని పరీక్షించే పెట్ స్కాన్, బోన్ మ్యారో పరీక్ష కూడా అవసరమవుతుంది. వ్యాధి దశను, దాని తీవ్రతను అనుసరించి వైద్య చికిత్సలు ఉంటాయి. ఇతర భాగాలకు పాకి ఉంటే కీమోథెరపీ ఒకటే చికిత్స. ఒకవేళ ఏదో ఒక భాగానికి పరిమితమై ఉంటే 10 వారాల పాటు కీమోథెరపీ ఇచ్చి, ఆ తర్వాత లోకల్ ట్రీట్‌మెంట్ చేస్తారు. అలాగే లోకల్‌గా రేడియేన్ ఇచ్చి ఆ తర్వాత మళ్లీ కీమో థెరపీ ఇవ్వాల్సి ఉంటుంది. మూడోదైన కాండ్రో సార్కోమా, ఈ క్యాన్సర్ చికిత్స కూడా పైరెండు క్యాన్సర్ల లాగే ఉంటుంది. కీమో థెరపీ, రేడియోషన్ థెరపీల పాత్ర ఈ క్యాన్సర్లలోనూ కీలకం గానే ఉంటుంది.

సెకెండరీ బోన్ క్యాన్సర్లు

థైరాయిడ్ క్యాన్సర్, లంగ్ క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్, కిడ్నీ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ ఇలా ఏ క్యాన్సర్ ద్వారా ఎముకలకు పాకినా ఆ పాకిన ప్రదేశాన్ని అనుసరించి వ్యాధి దశ, దాని తీవ్రతకు అనుగుణంగా చికిత్స చేయాల్సి ఉంటుంది. శరీరం బరువును మోసే కాళ్లలోనే క్యాన్సర్ ఉన్నప్పుడు ఆ వ్యక్తి బరువుతోనే అవి హఠాత్తుగా విరిగిపోయే ప్రమాదం ఎక్కువ. దీనికి ఆ ఎముకలు బలహీనపడటమే కారణం. అయితే.. ఆ ఎముకల్ని తిరిగి శకిమంతం చేయడానికి కొన్ని ప్రత్యేకమైన ఇంజెక్షన్స్ ఉన్నాయి. అలాగే కొన్ని రకాల ట్యాబ్లెట్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఆ తర్వాత రేడియేషన్ కూడా ఇస్తే ఆ ఎముకలు గట్టిపడతాయి. వెన్నెపూసల్లో క్యాన్సర్ ట్యూమర్లు వచ్చి వెన్నుపామును నొక్కడం ద్వారా రెండు కాళ్లూ చచ్చుబడే ప్రమాదం ఉంది. అందుకే.. శరీరంలో ఎక్కడ ఏ బాగంలో క్యాన్సర్ కణుతులు ఉన్నాయో వెంటనే గుర్తించి చికిత్స చేస్తే ఆ వ్యక్తి జీవిత కాలం గణనీయంగా పెరుగుతుంది. ఒక ప్రామాణికమైన జీవితం వారి సొంతమవుతుంది.

నవతెలంగాణ
12 హైదరాబాద్
శుక్రవారం 18 ఆగస్టు 2017
ఆటలు



సైనాకు మంచిదే!

కోచ్ విమల్ కుమార్ వ్యాఖ్య

బెంగళూర్ : మాజీ వరల్డ్ నెం.1, లండన్ ఒలింపిక్స్ మెడలిస్ట్ సైనా నెహ్వాల్ ఈ మధ్య చెప్పుకోదగిన విజయాలు సాధించలేదు. మోకాలి గాయంతో కెరీర్‌కు అర్థాంతరంగా ముగింపు పలికే ప్రమాదంలో పడినా.. నెమ్మదిగా కోలుకున్న సైనా నెహ్వాల్ ఇప్పుడు బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌కు సిద్ధమవుతోంది. వచ్చే వారం నుంచి గ్లాస్గోలో వరల్డ్ చాంపియన్‌షిప్స్ ఆరంభం కానున్నాయి. 2015 ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో రజతం సాధించిన సైనా నెహ్వాల్..ఈ ఘనత సాధించిన తొలి భారతీయ షట్లర్‌గా రికార్డు సృష్టించింది. కానీ మోకాలి గాయంతో రియో ఒలింపిక్స్‌లో పేలవ ప్రదర్శన చేసింది. దీంతో ఇప్పుడు బ్యాడ్మింటన్ అభిమానుల దృష్టంతా రియో స్టార్ పి.వి సింధుపైనే నెలకొన్నది. అయితే, సైనా వార్తల్లో లేకపోవటం ఆమెకు మంచి చేసేదే అని కోచ్ విమల్ కుమార్ అభిప్రాయపడ్డారు. 'మోకాలి గాయం తర్వాత సైనా ఇబ్బంది పడుతోంది. స్వల్ప తేడాతో కొన్ని కీలక మ్యాచుల్ని కోల్పోయింది. ఇప్పుడు మెరుగ్గా సన్నద్ధమైంది. సైనా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయగల్గితే టాప్ షట్లర్లను సులువుగా ఓడించగలదు. ఇదే సమయంలో ఫోకస్ మొత్తం పి.వి సింధు, కిదాంబి శ్రీకాంత్‌లపైనే నెలకొని ఉన్నది. సైనా నెహ్వాల్ లైమ్‌లైట్‌కు దూరం కావటం సైతం ఆమెకు మేలుచేసే పరిణామం' అని విమల్ కుమార్ వ్యాఖ్యానించారు.

దబంగ్ దబంగ్!

తలైవాస్‌పై ఢిల్లీపై గెలుపు

అహ్మదాబాద్ : తమిళ తలైవాస్‌తో జరిగిన మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ ఒక్క పాయింట్ తేడాతో విజయం సాధించింది. ఢిల్లీ తరపున ఇద్దరు విదేశీ ఆటగాళ్ల మేరేజ్ షేక్ (9), అబల్‌ఫజల్ (11) కేకపుట్టించటంతో ఢిల్లీ ఉత్కంఠ మ్యాచ్‌లో గెలుపొందింది. మరో నిమిషంలో ఆట ముగుస్తుందనగా 27-28తో ఓ పాయింట్ వెనుకంజలో నిలిచిన ఢిల్లీ.. మేరాజ్ షేక్ సూపర్ రైడ్‌తో ఒక్కసారిగా 30-28తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అజయ్ తర్వాతి రైడ్‌లో ఓ పాయింట్ తీసుకొచ్చినా 30-29తో ఢిల్లీ ఆధిక్యం నిలుపుకున్నది. రోహిత్ బలియన్ (3), విరాజ్ విష్ణు (2), రవి దలై (2) రాణించారు. రైడింగ్‌లో ఢిల్లీ 24 పాయింట్లు సాధించగా, తలైవాస్ మాత్రం 11 పాయింట్లతోనే సరిపెట్టుకున్నది. తలైవాస్ స్టార్ రైడర్ అజయ్ ఠాకూర్ 14 పాయింట్లతో రెచ్చిపోయినా ఆఖర్లో మ్యాచ్ దూరమైంది. విరామ సమయానికి 12-12తో సమవుజ్జీలుగా నిలిచినా.. అజయ్ సహా బలమైన డిఫెన్స్ తలైవాస్‌ను ముందంజలో నిలిపింది. అమిత్ హుడా నాల్గు టాకిల్స్‌తో ఢిల్లీకి దడపుట్టించాడు. కానీ ఆఖరి నిమిషం హైడ్రామాలో దబంగ్ ఢిల్లీ గెలుపొందింది.

ప్రో కబడ్డీలో నేడు

యూపీ యోధాX యు ముంబా
రాత్రి 8 గంటలకు
బెంగళూర్Xజైపూర్
రాత్రి 9 గంటలకు
వేదిక : అహ్మదాబాద్
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం



3 విజయాలు 6 సిరీస్‌లు

శ్రీలంకలో భారత్ వన్డే ప్రస్థానం

ఆగస్టు 20 నుంచి శ్రీలంకతో వన్డే సిరీస్

నవతెలంగాణ క్రీడా విభాగం

ఆసియాలో క్రికెట్ అభివృద్ధి అంటే టీమ్ ఇండియాగా మారిపోయింది!. అవును నిజమే, శ్రీలంక సహా బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లు ఒకప్పటి స్థాయి కోల్పోయాయి. దిగ్గజాలు జట్టును వీడిన తర్వాత సరైన వారసులు ఆ జట్లకు దొరకలేదు!. కానీ భారత్ పరిస్థితి భిన్నం. హేమాహేమీలు నిష్క్రమించినా.. యువ తరం ఆ లోటును కనిపించనీయటం లేదు. అందుకే ఈ మధ్యకాలంలో కోహ్లిసేన విజయాల్లో మన జట్టు బలం పాత్రకు తోడు ప్రత్యర్థి బలహీనమవటం సైతం కలిసొచ్చిందనేది విశ్లేషకుల మాట. ఇతర జట్ల పరిస్థితులను చూసినప్పుడు ఇది నిజమే అనిపిస్తుంది. ఇక శ్రీలంక, భారత్ ద్వైపాక్షిక సిరీస్ విషయానికొస్తే.. 1985 నుంచి లంకలో మనోళ్లు 26 వన్డేల్లో తలపడ్డారు. వాటిలో భారత్ 13 మ్యాచుల్లో నెగ్గగా, ఆతిథ్య జట్టు పది మ్యాచుల్లో గెలుపొందింది. మరో మూడు మ్యాచ్‌లు ఫలితం తేలకుండా ముగిశాయి. 1985 నుంచి ఇప్పటివరకూ శ్రీలంకలో ఆరు సిరీస్‌లు ఆడిన టీమ్ ఇండియా.. తొలి మూడింటినీ నెగ్గలేకపోయింది. కానీ 2008లో మహేంద్రసింగ్ ధోని సారథ్యంలో ద్వీపదేశంలో తొలి వన్డే సిరీస్ విజయాన్ని రుచి చూసింది భారత్. అదే జోరులో హ్యాట్రిక్ సిరీస్ విజయాలతో లంకపై ఆధిపత్యం పదిలం చేసుకున్నది. ప్రస్తుతం కోహ్లిసేన టెస్టుల్లోనే కాదు వన్డేల్లోనూ భీకరమైన జట్టు. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో తడబడినా.. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో విరాట్‌సేన విధ్వంసాన్ని నిలువరించటం ప్రత్యర్థులకు కష్టసాధ్యమైన పని. ఆగష్టు 20న తొలి వన్డేతో శ్రీలంకతో ఐదు మ్యాచుల వన్డేల సిరీస్ ఆరంభం కానున్న నేపథ్యంలో గతంలో లంకలో మన ప్రదర్శనపై ఓ లుక్కేద్దాం..

ధోని సారథ్యంలోనే లంకలో మనకు తొలి ట్రోఫీ

1985-86లో సిరీస్ సమం 1985-86లో శ్రీలంక పర్యటనకు వెళ్లిన టీమ్ ఇండియా మూడు మ్యాచుల వన్డే సిరీస్‌లో పాల్గొన్నది. కొలంబోలోనే జరిగిన సిరీస్ 1-1తో డ్రాగా ముగిసింది. తొలి వన్డేలో దిలీప్ వెంగ్‌సర్కార్ 66 బంతుల్లో 89 పరుగులకు తోడు ఆల్‌రౌండర్ రవిశాస్త్రి (67) ఇన్నింగ్స్‌తో 242 పరుగుల ఛేదనలో భారత్ గెలుపొందింది. శ్రీలంక, భారత్ మధ్య జరిగిన తొలి వన్డే ముఖాముఖి పోరు ఇది. వర్షం అంతరాయంతో 29 ఓవర్లకు కుదించిన రెండో వన్డేలో వెంగ్‌సర్కార్ అర్ధ సెంచరీతో మెరిసినా భారత్ 14 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. నిర్ణయాక మూడో వన్డే వర్షం కారణంతో రద్దు కాగా సిరీస్ టై అయ్యింది.

1993లో సిరీస్ లంక వశం 1993 వేసవిలో శ్రీలంకలో అడుగుపెట్టిన భారత్ సిరీస్ సాధించటంలో విఫలమైంది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన తొలి వన్డేలో ఒక్క పరుగు తేడాతో భారత్ గెలుపొందింది. 40,000 మంది ప్రేక్షకులు హాజరైన రెండో వన్డేలో 205 పరుగుల ఛేదనలో భారత్ 196కే కుప్పకూలింది. మూడో వన్డేలో గెలుపొందిన శ్రీలంక 2-1తో సిరీస్ సొంతం చేసుకున్నది.

1997లోనూ లంకదే పైచేయి ప్రపంచకప్ విజయం జోరుమీదున్న శ్రీలంక తర్వాతి సిరీస్‌లో భారత్‌పై 3-0తో ఏకపక్ష విజయం సాధించింది. తొలి వన్డేలో జయసూర్య, ఆటపట్టు మెరవటంతో లంక 304 పరుగులు చేసింది. కానీ ఛేదనలో తొలి 11 ఓవర్లలోనే టీమ్ ఇండియా టాప్-4 బ్యాట్స్‌మెన్ డ్రెస్సింగ్‌రూమ్ చేరుకున్నారు. ఈ దశలో అజహరుద్దీన్ (111), అజయ్ జడేజా (119)లు ఐదో వికెట్‌కు రికార్డు భాగస్వామ్యం నెలకొల్పినా.. విజయం త్రుటిలో చేజారింది. ఇక రెండో వన్డేలో సౌరవ్ గంగూలీ (113)తో సెంచరీతో మెరిసినా భారత్ 238 పరుగులే చేసింది. 26 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన భారత్ స్వల్ప స్కోరుకే పరిమితమైంది. జయసూర్య, అరవింద్ డిసిల్వ మెరుపులతో శ్రీలంక అలవోక విజయం సాధించింది. స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ మాయాగాడిగా తనేంటో నిరూపించుకున్న సిరీస్ ఇది!. రాబిన్ సింగ్ సెంచరీతో 291 పరుగులు చేసిన టీమ్ ఇండియా.. ఛేదనలో శ్రీలంకను 20/3తో నిలువరించింది. 19వ ఓవర్లో వర్షం అంతరాయం కలిగే సమయానికి శ్రీలంక 132/6తో ఓటమి అంచుల్లో నిలిచింది. కానీ వర్షం అంతరాయంతో మ్యాచ్‌ను తరువాతి రోజు మళ్లీ కొత్తగా ఆరంభమైంది. అరవింద డిసిల్వ శతకబాది ఆతిథ్య జట్టుకు 264 పరుగుల స్కోరు అందించాడు. ఛేదనలో అజహరుద్దీన్, జడేజా రనౌట్‌గా నిష్క్రమించటంతో ఆఖర్లో భారత్ తడబడింది. 0-3తో వన్డే సిరీస్‌ను కోల్పోయింది. ఇక 2006లో మూడు వన్డేల సిరీస్ తీవ్ర వర్షంతో రద్దు అయ్యింది. తొలి వన్డేలో 22 బంతుల ఆట సాగినా.. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సిరీస్‌ను రద్దు చేశారు.



శ్రీలంకపై సిరీస్ విజయం అంటే ఇప్పుడు సెంచరీ సాధించినంత సులువు!. కానీ 1985 నుంచి ప్రయత్నిస్తే.. భారత్ 2008లో తొలిసారి సిరీస్ విజయం సాధించింది. ఇప్పుడు టెస్టుల్లో కోహ్లి సాధించిన మాదిరిగానే.. అప్పట్లో ఎం.ఎస్ ధోని సారథ్యంలో టీమ్ ఇండియా వరుసగా మూడు వన్డే సిరీస్ విజయాలు సాధించింది. ఐదు రోజుల ఆటలో తిరుగులేని విజయం సాధించిన కోహ్లి ద్వీపదేశంలో పరిమిత ఓవర్ల ట్రోఫీపై కన్నేశాడు.

ధోని వచ్చాడు, సిరీస్ నెగ్గాడు మహేంద్రసింగ్ ధోని సారథ్యంలో శ్రీలంకకు వెళ్లిన టీమ్ ఇండియా తొలిసారి ద్వీపదేశంలో వన్డే సిరీస్ విజయం సాధించింది. అయితే తొలి వన్డేలో ధోనీసేన దారుణంగా ఓడింది. 146 పరుగులకే కుప్పకూలింది. శ్రీలంక 8 వికెట్ల తేడాతో మరో 91 బంతులుండగానే గెలుపొందింది. కానీ రెండో వన్డేలో ధోనిసేన గర్జించింది. జహీర్‌ఖాన్ 4 వికెట్లతో రెచ్చిపోవటంతో శ్రీలంక 142 పరుగులకే ఆలౌట్ అయింది, భారత్ విజయం లాంఛనమైంది. కీలక మూడో వన్డేలో కెప్టెన్ ధోని (76), సురేశ్ రైనా (53) రాణించటంతో భారత్ తొలుత 237 పరుగులు చేసింది. బౌలర్లు రాణించటంతో భారత్ 58 పరుగులతో గెలుపొంది 2-1తో ఆధిక్యం సాధించింది. నాల్గో వన్డేలో విరాట్ కోహ్లి, సురేశ్ రైనా, ఎం.ఎస్ ధోనిలు రాణించటంతో 258 పరుగులు చేసిన భారత్.. బౌలర్ల అండతో శ్రీలంకను కుప్పకూల్చి 3-1తో సిరీస్‌ను సొంతం చేసుకున్నది. ఆఖరి వన్డేలో శ్రీలంక నెగ్గినా అప్పటికే వన్డే సిరీస్ ధోనీసేన ఖాతాలో పడిపోయింది.

ధోనీసేన మరింత దూకుడు ధోని నాయకత్వంలో ఈసారి భారత్ మరింత దూకుడైన విజయం సాధించింది. జయసూర్య 28వ సెంచరీ సాధించిన తొలి వన్డేలో భారత్ గెలుపొంది శుభారంభం చేసింది. గౌతం గంభీర్, సురేశ్ రైనా, ధోనిలు 247 పరుగుల ఛేదనలో కీలకభూమిక వహించారు. యువరాజ్ సింగ్ (66) అర్ధ సెంచరీతో 256 పరుగులు చేసిన భారత్, ఇషాంత్ శర్మ నాల్గు వికెట్లతో శ్రీలంకపై సునాయాస విజయం సాధించి 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మూడో వన్డేలో సెహ్వాగ్ 90 బంతుల్లో 116 పరుగులు, యువరాజ్ సింగ్ 95 బంతుల్లో 117 మెరుపు శతకాలతో భారత్ 363/5తో భారీ స్కోరు నమోదు చేసింది. ప్రజ్ఞాన్ ఓజా (4/38) శ్రీలంక మట్టికరిచేలా చేసింది. దీంతో మరో రెండు వన్డేలు ఉండగానే 3-0తో సిరీస్ భారత్ వశమైంది. నాల్గో వన్డేలో గౌతం గంభీర్ (150) భారీ సెంచరీతో భారత్ 332 పరుగులు చేయగా.. ఛేదనలో శ్రీలంక చతకిల పడింది. 67 పరుగుల తేడాతో భారత్ గెలుపొందింది. నామమాత్రపు ఐదో వన్డేలో 68 పరుగులతో గెలుపొందిన శ్రీలంక వైట్‌వాష్ ఓటమి నుంచి తప్పించుకోగల్గింది.

2012లోనూ సీన్ రిపీట్ ధోనీసేనకు శ్రీలంకలో హ్యాట్రిక్ సిరీస్ విజయం. సెహ్వాగ్ (96), విరాట్ కోహ్లి (106) మెరుపు ఇన్నింగ్స్‌లతో తొలి వన్డేలో 21 పరుగుల తేడాతో గెలుపొందిన భారత్ శుభారంభం చేసింది. ఛేదనలో సంగక్కర సెంచరీ చేసినా ప్రయోజనం లేకపోయింది. కానీ, రెండో వన్డేలో శ్రీలంక పుంజుకున్నది. భారత్‌ను 138 పరుగులకే కుప్పకూల్చింది. 181 బంతులుండగానే 9 వికెట్ల తేడాతో గెలుపొంది 1-1 రేసులోకి వచ్చింది. ఇక తర్వాతి మూడు వన్డేలను వరుసగా ఐదు వికెట్లు, ఆరు వికెట్లు, 20 పరుగుల తేడాతో గెలుపొందిన టీమ్ ఇండియా 4-1తో వన్డే సిరీస్‌ను కైవసం చేసుకున్నది. రెండు సెంచరీలు సహా 296 పరుగులు చేసిన విరాట్ కోహ్లి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు. 2012లో సిరీస్ విజయంలో కీలకపాత్ర పోషించిన కోహ్లి.. ఇప్పుడు మరో సిరీస్ విజయంపై కన్నేసిన భారత జట్టుకు నాయకత్వం వహించనుండటం విశేషం.

సాదాబైనామాల సమస్యను పరిష్కరించాలి

కౌలు రైతులను గుర్తించాలి - కార్డులు జారీ చేయాలి.. 'ప్రజా దర్బార్'లో రైతు సంఘాల నేతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అపరిష్కృతంగా ఉన్న సాదాబైనామాల సమస్యను పరిష్కరించాలని పలువురు రైతు సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కౌలు రైతులను గుర్తించడంతోపాటు వారికి రుణ అర్హత కార్డులు జారీ చేయాలని కోరారు. 'ప్రభుత్వ మద్దతు - రుణాలందని వాస్తవ సాగుదారులు- గుర్తింపు లభించని కౌలు రైతులు- ఇతర వర్గాలు' అనే అంశాలపై రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ప్రజా దర్బార్' నిర్వహించారు. దీనికి వివిధ జిల్లాల నుంచి పలువురు రైతులు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. వీరి అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాత రిటైర్డ్ ఐఏఎస్ అధికారి గోపాల్‌రావు మాట్లాడుతూ కౌలు రైతుల సమస్య చాలా తీవ్రంగా ఉన్నదన్నారు. గుర్తింపు కార్డులు జారీ చేసినా ఫలితం లేదన్నారు. 40శాతం మంది రైతులకు కార్డులు ఇచ్చారని, అందులో 10 శాతమే రుణాలు ఇచ్చారని చెప్పారు. ప్రభుత్వం కౌలు రైతులపై మాట్లాడే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో కదలిక తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ జేఏసీ చైర్మెన్ కోదండరామ్ మాట్లాడుతూ బ్యాంకులు, ఇన్సూరెన్స్ సంస్థలు, వ్యవసాయ శాఖ, విశ్వవిద్యాలయం అధికారులందరూ సమిష్టిగా కృషి చేస్తేనే రైతు సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. సాదాబైనామా దరఖాస్తులు చాలా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. బ్యాంకులు అప్పులు ఇవ్వకపోవడంతో రైతులు ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. సమస్యలన్నింటినీ ఒక నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేసి పరిష్కరించే విధంగా ఒత్తిడి తీసుకొస్తామన్నారు. అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.6లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామన్న ప్రభుత్వం, ఎక్కడా అమలు చేయలేదన్నారు. రైతు ఆత్మహత్య చేసుకున్నట్టు నమోదు చేసుకోవడానికి 13 ధ్రువ పత్రాలు సమర్పించాల్సి వస్తోందన్నారు. దీంతో రైతు కుటుంబ సభ్యులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. ప్రకృతి పరిహారం కూడా కౌలు రైతులకు అందడం లేదన్నారు. కొంత మంది రెవెన్యూ అధికారులు కౌలు రైతులు, భూయజమానుల మధ్య తగాదాలు పెడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో రైతు స్వరాజ్య వేదిక నుంచి కిరణ్‌కుమార్ విస్సా, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు జీవన్‌కుమార్, భూసేకరణ చట్టం పరిశోధకురాలు ఉషా నేతాలక్ష్మీ, పి. కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



'ప్రజా దర్బార్'లో మాట్లాడుతున్న అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి

మాది ఆ ఊరే కాదంట!



నాభర్త పేరు కావలి మల్లేశం. గ్రామం పులుసు మామిడి, మండలం, జిల్లా వికారాబాద్. రూ.5వేల చొప్పున కౌలుకు, 5 ఎకరాలు సాగు చేశాము. నాభర్త వ్యవసాయంలో పెట్టిన పెట్టుబడి రాలేదు, చేసిన కష్టం చేతికం దలేదు. అప్పులు పెరిగినయ్. అప్పులు తీర్చలేనని బెంగతోని ఆత్మహత్య చేసుకుండు. ఉన్న ఇల్లు అమ్ముకున్నం. ఊళ్లో ఇల్లు లేదు గదా ఇప్పుడు మాది ఆ ఊరే కాదు అని అంటున్నారు. ఏం చేయాలి. ఎట్ల బతికాలి. రైతు ఆత్మహత్య కింద అధికారులు రాసుకుని పోయింద్రు. పోస్టు మార్టం రిపోర్టులో కూడా ఆత్మహత్య అనే తేలింది. ఇప్పటి వరకు నాకు ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదు. కౌలు గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకున్నా కానీ ఇంత వరకు కార్డు రాలేదు.

- కావలి జంగమ్మ

పత్తి పంట ప్రాణం తీసింది



నా కండ్ల ముందే నా కొడుకు కుమారస్వామి, కోడలు రాధిక ప్రాణాలను పత్తి పంట బలితీసుకుంది. మూడెకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట వేసిండు. రెండు లక్షలు అప్పులు అయ్యాయి. బ్యాంకులో రుణం ఇవ్వలేదు. ఉన్న ఎకరం పొలం అమ్ముదామంటే ధర పడలేదు. ఉన్న బంగారం అమ్మి కొంత అప్పుడు తీర్పిండు. మిగిలిన వాళ్ల పొలంలోకి వెళ్లి గొడవ చేసి పంచాయతీ ఆఫీసుకు పట్టుకొచ్చింద్రు. కొడుకు, కోడలు అవమానం తట్టుకోలేక పురుగుల మందు తాగింద్రు. దవాఖానకు తీసుకుపోతే కోడలు చనిపోయింది. కొడుకు బతికిండు. దీన్ని రైతు ఆత్మహత్యగా గుర్తించడం లేదు. ఇంకా అప్పులు తీరలేదు. ఇద్దరు పిల్లలున్నారు. భూమి తన పేరుమీద లేదు గనుక పరిహారం ఇవ్వమని అధికారులు అంటున్నారు.

- గొర్రె కొమురమ్మ

అసైన్డ్ భూముల సంగతేందీ?: పొడిశెట్టి స్వామి



వరంగల్ అర్బన్ జిల్లా ధర్మసాగర్ మండలంలోని దేవనూర్ గ్రామంలో 150 మంది రైతులు 300 ఎకరాల అసైన్డ్ భూముల్లో సేద్యం చేస్తున్న వారి పరిస్థితి ఏందీ? ఇప్పటికే 30 ఏండ్లు పూర్తయింది. మేం ఏమై పోవాలి. మేం లెక్కలో లేనట్టేనా? ప్రభుత్వం చేస్తున్న సమగ్ర సర్వేలో అసైన్డ్ భూమి వివరాలు రాసుకోవడం లేదు. పట్టా పాస్‌బుక్‌లు ఉన్నవారి వివరాలే సేకరిస్తున్నారు.

కౌలు రేటు పెరిగిపోతుంది : అక్కం లచ్చయ్య

మేము ముగ్గురం అన్నదమ్ములం. మాది నవాబుపేట గ్రామం, లింగాల ఘనపురం మండం, జనగామ జిల్లా. రాములవారి గుడి కింద 25 ఎకరాల భూమి ఉంది. శివాలయం కింద 6 ఎకరాలుంది. మా గ్రామానికి చెందిన 16 మంది రైతులు ప్రతి ఏటా వేలం పాట ద్వారా ఈ భూములను కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటున్నాము. 50 ఏండ్లు పూర్తయింది. రూ. 2వేల నుంచి ఇప్పుడు రూ.20వేల కౌలుకు పెరిగింది. గుర్తింపు కార్డులు లేవు. రుణం లేదు. రూ.40వేలు అప్పుతెచ్చుకొని మూడు బోర్లు వేస్తే రెండు ఫెయిల్, ఒకటి పాస్ అయింది. ఇప్పటికే లక్ష రూపాయల అప్పు అయింది ఎట్ల బతకాలే.



సమగ్ర సర్వేలో పేరు రాయమని చెప్పిండ్రు



మాకు ఎకరం మీద 20 గుంటల పొలం ఉంది. దీనికి తోడు మూడెకరాలు కౌలుకు తీసుకున్నాం. మాకున్న పొలం సాదాబైనామాలో నమోదు కాదని అధికారులు చెప్పారు. సమగ్ర సర్వేలో కూడా రాసుకోలేదు. నా భర్త చనిపోయి 8 ఏండ్లు అవుతుంది. నాకు ఇద్దరు పిల్లలున్నారు. ప్రభుత్వం నుంచి ఏ సహాయం అందకపోతే ఎట్ల బతకాలి. ఆరోగ్యం కూడా అంతంత మాత్రమే. నాకు కూడా బతకాలని లేదు. మేం ఏం పాపం చేశామని, మీకింత శిక్ష. అని ఆవేదన వ్యక్తం చేసింది.

- మంగ లక్ష్మీ

కార్డు, రుణం అందింది.. రుణమాఫీ కాలేదు...



మాది ఇబ్రహీంపూర్ గ్రామం, తుర్కపల్లి మం, యాదాద్రి భువనగిరి జిల్లా. నాకున్న ఎకరంతోపాటు 15ఏండ్లుగా కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నా. 2011లోనే భూ అధీకృత సాగుదారుల చట్టం గురించి తెలుసుకుని కార్డుకు దరఖాస్తు చేసుకున్నా. నల్లగొండ కలెక్టరుకు ఫిర్యాదు చేసుకున్నాను. ఎట్టకేలకు కార్డు వచ్చింది. రూ. 40వేలు రుణం కూడా ఇచ్చారు. కానీ రుణమాఫీ కాలేదని బ్యాంకు అధికారులు చెబుతున్నారు.

రాపోలు నర్సిరెడ్డి

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan, 1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.